నవశక్తి

Vol. 2, no. 27

(Jun. 21, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 27

(Jun. 21, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 } బుధవారం 21-6-39 బెజవాడ { సంచిక 27

మునగాలలో రాక్షసకృత్యాలు మితిమీరు తున్నాయి

కొంపలు తగుల పెట్టారు—60 ఏండ్ల ముసలమ్మను లాఠీలతో కొట్టారు—
గర్భిణీ స్త్రీని కింద పడతోశారు—12 ఏండ్ల పిల్లవానిని ఫుట్ బాల్ మాదిరిగా తన్నారు

మునగాల రైతుల సత్యాగ్రహ పోరాటం రోజు రోజుకీ తీవ్రమవుతోంది. ప్రతి దినం రైతులు జట్టు జట్టులుగా వెళ్ళి ఇమ్మడి పాపయ్యగారి భూమిని దున్ను తున్నారు. రైతుల పోరాట శక్తిని బలహీన పరచ డానికి ఆస్థుల జప్తులు ఎక్కువౌతున్నాయి, ఈ నెల 11 వ తేదీని రిజర్వు పోలీసులు 2 లారీలలో రేపాల వెళ్ళి, జమీందారీ నౌకర్లతోకలసి రావు శేషయ్య, అరె కట్ల లక్ష్మయ్య, అనే రైతుల యిండ్లలో బలవంతముగా ప్రవేశించి తిండికి, విత్తనాలకు దాచుకొన్న జొన్నలు, వడ్లు వగైరా ఆస్థిని జప్తుచేసుకొని వెళ్ళిపోయారు, ఇండ్ల తాళములు పగులగొట్టి, ఇంటి గోడలు దుమికి, సామానులు—ధాన్యం తీసుకొని పోయారు. రసీదులు కూడా యివ్వడంలేదు. ప్రజలలో దౌర్జన్యం పురిగొల్ప డానికి చాకలి, కుమ్మరి మొదలయినవారి యిండ్లకువెళ్ళి కుండలు, పొయ్యిలు పగులగొట్టి నానా బీభత్సం చేశారు. నిర్బంధించిన పశువులకు నీళ్లు, మేత లేక ఒకటి మరణించింది. బందెలదొడ్డి చాలా హీనస్థితిలో ఉంది.

12 వ తేదీని 16 గురు సత్యాగ్రహుల్ని నడిగూడెములో ఎరస్టు చేశారు. 13 వ తేదీని కూడా ఒకజట్టు పాపయ్యగారి భూమిలో దున్ని సత్యాగ్రహం చేశారు. కాని పోలీసులు రాలేదు. ఎస్టేటునౌకర్లు చూచివెళ్లారు. శిరిపురంలో జమిందారుచే ఆక్రమించుకొనబడిన స్కూలు చావడిలో రైతులు ప్రవేశించకూడదని 51 మంది మీద 2 నెలలవరకు 144 వ సెక్షను జారీ చేశారు. జప్తులు 13 వ తేదీని కూడా సాగాయి. అలుగూరి సీరనారాయణగారి యింట్లో పోలీసు సూపరిండెంటు రిజర్వు పోలీసులతోను, ఎస్టేటు నౌకరులతోను ప్రవేశించి జొన్నలు,వడ్లు తీసుకొనిపోతూంటే, స్త్రీలు అడ్డుపడ్డారు. ఎస్టేటు జవాన్లు స్త్రీలను అటు ఇటు తోసి, రుక్కమ్మ అనే స్త్రీని కింద పడతోసి, పెద్ద వడ్ల బస్తాను మీద పడవేసి, సుమారు అయిదారు గజాల దూరము లాగారు. మరొక స్త్రీని ఒక జవాను ముఖము మీద కొట్టగా ముక్కు తెగింది. ఒక రైతు అక్కడ నిలబడి ఉండగా ఇన్స్పెక్టరు అతన్ని తన్ని గుద్దులు గుద్దాడు. 12 ఏండ్ల కుర్రవానిని ఫుట్ బాల్ ను తన్నినట్టుగా బూటు కాలితో తన్నాడు. తరువాత ఉప్పల రామయ్యగారి యింట్లో ప్రవేశించి తినుటకు దాచుకున్న వడ్లు, విత్తనాలు, ఆముదాలు దొడ్డిదారిని తీసుకు వెళ్ళారు, ఎంత తీసుకున్నారో లెక్క చూప లేదు. ఉప్పల నరసింహయ్యగారి యింట్లో పుట్టెడు వడ్లు తీసుకెళ్లారు. స్త్రీల రోదనము అరణ్య రోదనముగా ఉంది. పురుషులు జైళ్ళలో ఉండగా స్త్రీలను, పిల్లలను హింసించి దౌర్జన్యముగా ఆస్థులు తీసుకుపోవడము ప్రజలు సహించలేకుండా ఉన్నారు.

15—6—39 వ తేదీని పోలీసులు ఎస్టేటు నౌకర్లు, 3 లారీలలో తాడవాయి గ్రామం వెళ్ళి జప్తుచేయడానికి బోనాల వెంకటప్పయ్య గారి యిల్లు ప్రవేశించగా, సుమారు 100 మంది స్త్రీలు అడ్డుపడ్డారు. వెంటనే క్రూరమైన లాఠీచార్జి జరిగింది. 50 మంది స్త్రీలకు దెబ్బలు తగిలాయి. కోటా అంతమ్మ అనేస్త్రీకి ఎడమ కాలి మీద బలమైన దెబ్బ తగిలింది. కోలా అచ్చమ్మ అనే 60 సంవత్సరాల ముసలి స్త్రీకి మోకాళ్ళ మీద దెబ్బ తగిలి,నెత్తురు వరదలైంది.వెంటనే స్పృహ తప్పి పడిపోయింది. కోలిసెట్టి రంగమ్మకు నడుము మీద తీవ్రమైన దెబ్బ తగిలింది. ఒక గర్భిణీ స్త్రీని కింద విసరివేయగా, ఆమె కూడ స్పృహ తప్పి పడిపోయినది. బోనాల వెంకటప్పయ్యగారి యింట్లో 5 బస్తాల బియ్యం, గట్టి పాపయ్యగారి యింట్లో 100 మానికల జొన్నలు, 750 మానికల బందరు పొట్టి విత్తనాలు దౌర్జన్యంగా స్వాధీనపర్చుకున్నారు.

14 వ తేదీని, 15 వ తేదీని సత్యాగ్రహం యధావిధిగానే సాగింది. కాని పోలీసులు ఎరస్టు చేయలేదు. 16 వ తేదీని 12 గురిని ఎరస్టు చేశారు. ప్రతి రోజు సత్యాగ్రహానికి వెళ్లే జట్టును నడిగూడెం మునగలులు బ్యాండు మేళాలతో ఊరేగించి తీసుకువెళ్లుతున్నారు. జమీందారీ నౌకర్లు బ్యాండు వాయించవద్దని ఎంత చెప్పినా వినకపోవడంవల్ల, 15 వ తేదీ రాత్రి మంగలి వీరాయి యిల్లు తగులబడింది, 13 వ తేదీని రేపాలలో గొంది పుల్లయ్యగారి యిల్లు, రామసముద్రంలో పిచ్చగుంట్ల వారి యిల్లుకూడా తగులబడ్డాయి.

సత్యాగ్రహులకు శిక్షలు

14-6-39 వ తేదీని మునగాల సత్యాగ్రహములో ఎరస్టయిన మొదటి జట్టు, ఉప్పల రామయ్య వగైరా 9 మందిని జగ్గయ్యపేట సబ్ మేజిస్ట్రేటు విచారించి, ఒక్కొక్కరికి ఆరేసి నెలల కఠిన శిక్ష, రెండేసి వందల రూపాయల జరిమానా, విధించాడు. జరిమానాలు యెవరూ చెల్లించలేదు. రెండవ జట్టు 10 మంది సత్యాగ్రహులకు కూడా ఆరేసి నెలల కఠినశిక్ష విధించబడింది. 16 వ తేదీని మైలవరం మకాంలో బెజవాడ సబ్ కలెక్టరుగారు నండూరి ప్రసాదరావు, మోటూరి పరంధామయ్య, జోస్యుల సత్యనారాయణ, ఇమ్మడి పాపయ్య, కందుల రాములు, నల్లపాటి వెంకట్రామ నర్సయ్యగార్లను విచారించారు. మునగాల సబ్ ఇన్స్పెక్టరు, షార్టుహాండ్ రిపోర్టరు, నడిగూడెం మునసబు, ఎస్టేటు ఉద్యోగి, ప్రభుత్వం తరపున సాక్షులు. సత్యాగ్రహులు డిఫెన్సు పెట్టుకోలేదు. ఒక్కొక్కనికి 11 నెలల విడిఖైదు విధించబడింది.

17 వ తేదీని రివెన్యూ మంత్రి ప్రకాశంపంతులు గారు, అఖిలభారత రైతు సంఘ ఉపాధ్యక్షులయిన ప్రొఫెసర్ రంగాగారు, చలసాని వాసుదేవరావుగారు (ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి), కామినేని వెంకటప్పయ్యగారు, కాట్రగడ్డ వెంకటనారాయణ రావుగారు మునగాలవెళ్ళి మునగాల సమస్యను చర్చించారు. [18 వ తేదీ రైతుసంఘాల నిర్ణయాలుచూడ వలసివుంది]

మునగాల రైతులయెడ సానుభూతి సభలు

రాజోలు

11—6—39 వ తేదీని శ్రీ ఆరుమిల్లి వెంకటరత్నంగారి అధ్యక్షతక్రింద జరిగిన రాజోలు తాలూకా (తూ॥ గోదావరిజిల్లా) కాంగ్రెసు కమిటీ సమావేశంలో ఈ దిగువ తీర్మానము ఆమోదించబడెను:

"మధ్యవర్తి అయిన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘ ప్రధాన కార్యదర్శిగారి నిర్ణయములకు భిన్నంగా ప్రవర్తించుచు, రైతులను విపరీతముగా పీడించుచున్న మునగాల ఎస్టేటు జమిందారు చర్యల నెదుర్కొని తమ న్యాయమైన హక్కులను సంపాదించుకొనుటకు ఆ ఎస్టేటు రైతులు శాంతియుతమైన, న్యాయబద్ధమైన పద్ధతు లవలంబించుచుండ, పోలీసువారు దారుణముగా 33 గురిని లాఠీలతో మోది, 157 గురిని ఎరస్టుచేసి, వారిపై కేసులుపెట్టి బాధించుచున్నట్లు పత్రికా ముఖమున ప్రకటింపబడుచున్నందున యీ విషయమును గురించి రాష్ట్ర కాంగ్రెసు కార్య సంఘమువారు తక్షణమే మంత్రివర్గముతో సంప్రతించియు, యిటువంటి లాఠీఛార్జీ జరుగుటకు వీలులేకుండా చేయవలసినదిగాను, మునగాల రైతు సోదరులు ధైర్య సాహసములతోను, శాంతియుతముగను, సక్రమముగను పోరాడవలసినదిగాను యీ సభవారు హెచ్చరించుచున్నారు."

గరికపర్రు

ఈ నెల 11 వ తేదీ సాయంత్రం గరికపర్రు గ్రామంలో జరిగిన బహిరంగ సభలో కామ్రేడ్ రామినేని పిచ్చయ్యగారు, మిక్కిలినేని సుబ్బారావుగారు, మునగాల రైతుల సత్యాగ్రహ పోరాటాన్నిగురించి విపులంగా ఉపన్యసించిన మీదట యీక్రింది తీర్మానం ఆమోదించ బడింది.

"న్యాయసమ్మతమైన తమ హక్కులకొరకు ధైర్యముతో పోరాడుచున్న మునగాల రైతుల నభినందించుచూ, పోలీసువారు జరుపు అక్రమచర్యలను, లాఠీఛార్జీలను, యీ సభవారు తీవ్రముగా ఖండించుచున్నారు. కాంగ్రెసువారు మంత్రిపదవులలో నుండగా యిట్టి పోలీసు జులుములు జరుగుటవలన కాంగ్రెసు ప్రతిష్ఠ సన్నగిల్లునుగాన మద్రాసు ప్రభుత్వమువారు వెంటనే కలుగజేసుకొని, రైతుల న్యాయమైన హక్కులను కాపాడవలెనని యీ సభవారు కోరుచు తీర్మానించడమైనది."

కురుమద్దాలి

మునగాల రైతు సత్యాగ్రహంపట్ల సానుభూతిని ప్రకటించుటకు ఈ నెల 11 వ తేదీని కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో పలువురు యువకులు జాతీయ పతాకములతోను రైతు గీతములతోను ఊరేగింపు జరిపి, గ్రామ పాఠశాలలో శ్రీ గుళ్ళపల్లి రామచంద్రయ్యగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగెను. శ్రీ గుళ్ళపల్లి ప్రసాదరావుగారు, గుళ్ళపల్లి రామబ్రహ్మంగారు మునగాల జమిందారు రాజీ షరతుల నేవిధంగా భగ్నం గావించించినదీ ఉపన్యసించారు. పిమ్మట, మునగాల రైతుల యెడ సానుభూతిని తెలియజేస్తూ, పోలీసుల యొక్కయు, జమీందారు యొక్కయు అత్యాచారములను తీవ్రముగా నిరసించుచు, ప్రభుత్వము వెంటనే జోక్యం కలిగించుకో వలసినదిగా కోరుచు తీర్మానించబడెను.

కాటూరు

కాటూరు రైతుసంఘ యాజమాన్యమున ఈ నెల 11 వ తేదీ సాయంకాలం జరిగిన బహిరంగ సభలో కామ్రేడ్ వేములపల్లి వెంకటదాసు మునగాల రైతుల కష్టాలను గురించి విపులంగా తెలియజేసిన పిమ్మట "మునగాల జమిందారు చేయు అన్యాయ అక్రమ చర్యలను ధైర్యముతో ఎదుర్కొనుచున్న రైతు సోదరులను అభినందించుచు, రైతు ఉద్యమాన్ని అణచివేయుటకు పోలీసువారు అవలంబించుచున్న దౌర్జన్య విధానానికి తీవ్ర అసమ్మతిని తెలియజేయుచు, సోదర రైతులు తమ హక్కులకై చివరవరకు సత్యాగ్రహ సమరము సాగించవలెననియు, ఈవిషయమై మద్రాసు ప్రభుత్వం వెంటనే తగు చర్య తీసుకొనవలె"నని హెచ్చరించుచు తీర్మానించబడెను.

అంగలూరు

11 వ తేదీని గ్రామ రైతుసంఘ యాజమాన్యమున మునగాల రైతుల యెడ సానుభూతిని తెలియజేయుటకై, సాయంకాలం 5 గంటలకు నగర సంకీర్తనము 6 గంటలకు బహిరంగ సభ జరిగెను. సభలో శ్రీ అరికపూడి నాగభూషణం గారు అహింసాయుతమైన మునగాల సత్యాగ్రహమును కొనియాడుచు ఉపన్యసించిన మీదట, రైతుల యెడ సానుభూతిని తెలుపు తీర్మానమున ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

కొండపల్లి

11—6—39 వ తేదీ సాయంకాలం గం॥ 6-30 లకు వీరహనుమాన్ యువజనసంఘ యాజమాన్యమున జరిగిన బహిరంగ సభలో పై సంఘ ప్రెసిడెంటు శ్రీ పి. చలపతిరావుగారు, సంఘ సభ్యులైన పి. రామమూర్తి గారు, మునగాల రైతుల కడగండ్లను గూర్చి ఉపన్యసించిన తర్వాత, "మునగాల రైతులుజమిందారుయొక్క అక్రమ చర్యలను ప్రతిఘటించి తమ హక్కులను కాపాడుకొనుటకై సత్యాగ్రహము చేయుచున్నందుకు వారిని అభినందిస్తూ, లాఠీచార్జి, ఎరస్టులు వీటికి కారణభూతులైన పోలీసు అధికారులను వెంటనే తొలగించాలనీ, అరెస్టు చేయబడినవారిని విడుదల చేసి, రైతుల హక్కులను కాపాడాలనీ" మద్రాసు మంత్రివర్గమును కోరుచు తీర్మానించబడెను.

కొత్తపల్లి

పిఠాపురం తాలూకా, కొత్తపల్లిలో కామ్రేడ్స్ పుత్సల సత్యనారాయణగారి అధ్యక్షతను 11 వ తేదీని జరిగినతాలూకా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ సమావేశంలో యీక్రింది తీర్మానం ఆమోదించ బడింది:

"ప్రస్తుతము మునగాల ఎస్టేటు జమీందారుకు, రైతులకు మధ్య జరుగుచున్న సంఘర్షణలో పోలీసువారు జమీందారుకు సహాయపడుచు రైతులమీద అన్యాయంగా తీవ్రమైన లాఠీచార్జియు, జమీందారు రాజీ షరతులను భగ్నం గావించి రైతులమీద గావించుచున్న జులుంను, యీ కమిటీవారు నిరసించు చున్నారు. మద్రాసు రివెన్యూమంత్రిగారు యీ విషయంలో వెంటనే జోక్యం కలుగజేసుకొని రైతులకు న్యాయం కలుగజేయవలెనని కోరుచు తీర్మానించడమైనది."

ఇతర గ్రామాలు

కొరుప్రోలులోను; శ్రీకాకుళంలో పట్టణ యువజన సంఘం యాజమాన్యమున గౌతు లచ్చన్నగారి అధ్యక్షతను; గణపవరంలో గుంటక సుబ్బారెడ్డిగారి అధ్యక్షతను; కొడమంచిలిలో శ్రీ నెక్కంటి సత్యనారాయణమూర్తిగారి అధ్యక్షత క్రిందను; కోడేరు (నర్సాపురం) గ్రామంలో నారిన మాల్రాజుగారి అధ్యక్షతను; ఉత్తర విశాఖజిల్లా. సోంపేటతాలూకా బుసగాం గ్రామములో భద్రి వెంకయ్యగారి అధ్యక్షతను: జరిగిన బహిరంగ సభలలోకూడా 11 వ తేదీనాడు మునగాల రైతుల పోరాటం యెడ సానుభూతిని ప్రకటిస్తూ తీర్మానములు గావించబడెను.

15—6—39 వ తేదీని వెల్లటూరు గ్రామ రైతుసంఘ కార్యనిర్వాహక వర్గ సమావేశము పమిడిముక్కల నాగభూషణంగారి అధ్యక్షత క్రింద జరిగి, మునగాలలో పోలీసుల దౌర్జన్యాలను తీవ్రంగా ఖండించుచు, రైతుల సత్యాగ్రహంయెడల సానుభూతిని ప్రకటించుచూ తీర్మానించబడెను.

జిల్లా రైతు సంఘం

13-6-39 వ తేదీ సాయంత్రం 4 గంటలకు బెజవాడలో కృష్ణాజిల్లా రైతుసంఘ కార్యనిర్వాహక వర్గం శ్రీ కామినేని వెంకటప్పయ్యగారి అధ్యక్షతను సమావేశమై, యీక్రింది తీర్మానమును గావించెను.

"మునగాల ఎస్టేటులో జమీందారు రైతులమధ్య జరిగిన ఒడంబడికను జమీందారు సక్రమంగా అమలు జరుపక పోవుటచే రైతులు మార్గాంతరములేక సత్యాగ్రహమును ప్రారంభించినారని యీ సంఘంవారు నమ్ముచున్నారు.

"శాంతియుతముగా సత్యాగ్రహం సాగించుచున్న రైతుల నరెస్టు చేయుట, రైతులపై అక్రమంగా పోలీసువారు ఎస్టేటు నౌకరులతో కలిసి దారుణంగా లాఠీలతో కొట్టుట, క్రింద పడిపోయిన వారిని కాళ్లు పట్టి యీడ్చుట, స్త్రీల రొమ్ములపై కర్రలు వేసి నెట్టుట, సుమారు 43 ఎడ్లను, దున్నలను, మండువేసవిలో పై కప్పులేని దొడ్లో పెట్టి నీళ్లు, మేత సరిగా వేయకుండుట మున్నగు అమానుష కృత్యములను ఈసంఘము వారు తీవ్రముగా గర్హించుచూ, యిన్ని తీవ్ర నిర్బంధములకు లోనుచేయబడుచున్నను తమ న్యాయమైన హక్కుల కొరకు నిర్భయముగా సత్యాగ్రహపోరాటం సాగించుచున్న మునగాల రైతుల నీ సంఘమువారు అభినందించుచున్నారు.

"ప్రస్తుత జమీందారు పరిపాలనలోనికి వచ్చిన గత సుమారు 30 సంవత్సరాలనుండి ప్రజలను అమానుష అత్యాచారములకు పాల్జేయుచున్న విషయమును మదరాసు ప్రభుత్వము గుర్తించియు, యింతవరకు జమీందారుపై ఎట్టిచర్య తీసుకోనందులకు ఈసంఘముపొడు సంతాపమును తెలుపుచు, వెంటనే ప్రభుత్వం ఈ ఎస్టేటును కోర్టు ఆఫ్ వార్డ్సు స్వాధీనం చేసుకొని రైతుల న్యాయమైన హక్కుల నమలు జరిపించవలసినదిగా కోరుచున్నారు."

సంపుటం 2 సంచిక 27

నవశక్తి

బుధవారం 21—6—39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు), కంభంపాటి సత్యనారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య, తుమ్మల వెంకట రామయ్య.

మునగాల రైతు పోరాటము : మన కర్తవ్యము

మునగాలకు 17 వ తేదీ రెవిన్యూమంత్రి ప్రకాశం పంతులుగారు వెళ్ళారు. పరిస్థితులన్నీ చూచారు. బందిలిదొడ్డికోని పశువులను వదలివేయమని సెలవిచ్చారు. బ్రహ్మయ్యగారి రాజీ పత్రము, ఆ తీర్పు చాల అస్పష్టంగా ఉందనీ, రైతుల కోర్కెల ననేకాలను జమీందారీ బిల్లులో కన్న చాలతక్కువగా గుర్తించి ఉందనీ సెలవిచ్చినట్లుకూడ తెలుస్తూఉంది. కాని రైతులు తమ పోరాటాన్ని విరమించనిదే తామేమో రైతుల తరపున జోక్యము కలిగించుకోలేమన్నారు. జమీందారని తరఫున (లా అండు ఆర్డరును) న్యాయమును శాంతిని కాపాడవలసి ఉంటుందని హెచ్చరించారు.

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యనిర్వాహక సభ 18 వ తేది సమావేశమయింది. ఏప్రిల్ 30 వ తేదీన మునగాల జమీనురైతు సంఘం సమావేశమై తమ కోర్కెలు ప్రకటించి వీనికోసం తాము పోరాటము సాగించబోతూ ఉన్నామని చెప్పి ఒక నెలరోజులు వ్యవధి నిచ్చినది. ఆకాలములో కాంగ్రెసు మంత్రివర్గము తమకేమీ పట్టనట్లు ఊరకుండినది. అయినా మరియొక పర్యాయము కాంగ్రెసు మంత్రులకు మరొక అవకాశము ఇవ్వడానికి మునగాల సత్యాగ్రహాన్ని 15 రోజులవరకు తాత్కాలికంగా ఆపుచేస్తూ తీర్మానించింది.

ఆపుచేయడమంటే అర్థమేమిటి? రైతు లేమిచేయాలి? జమీందారు ఏమిచేయాలి? ప్రభుత్వము ఏమిచేయాలి? అనే ప్రశ్నలు వస్తాయి.

బ్రహ్మయ్యగారి రాజీని జమీందారు భగ్నముచేసినపుడు, జమీందారుని పక్షమువహించి ప్రభుత్వము 144 వ సెక్షను రైతు సేవకులపై ప్రయోగించినపుడు, రైతులు తమ హక్కుల కోసం పోరాటము ఆరంభించవలసి వచ్చిందని ప్రపంచానికంతా తెలిసిన విషయమే. జమీందారు అన్యాయంగా ఆక్రమించుకొనిఉన్న శ్రీ ఇమ్మడి పాపయ్యగారి పొలాలను రైతులు తిరిగి స్వాధీనము చేసుకోవడముతో పోరాటము ఆరంభమయింది.

అందుచే తాత్కాలికంగా పోరాటము ఆపుచేయడమువలన అచ్చటి రైతులు, రైతుసేవకులు గమనించవలసిన విషయము. ఈ 15 దినాలు శ్రీ ఇమ్మడి పాపయ్యగారి పొలాలలోగాని, అన్యాయంగా ఆక్రమించుకోబడ్డ మరేలాంటి ఇతర పొలాలను గాని దున్నడము, తిరిగి ఆక్రమించుకోవడము ఆపుచేయుట అని.

పంటలు పోవుటచే పన్నులు ఈ సంవత్సరం నూటికి 95 మంది కట్టుకోలేరు. రైతులకు రిమిషను మినహాయించుకొని తతిమ్మా పన్నును వచ్చే సంవత్సరము కట్టుటకు అవకాశమివ్వవలసినదిగా మొదటినుండి మునగాల జమీన్ రైతుసంఘము కోరుతూ వచ్చింది. చెల్లించగలవారే ఈ సంవత్సరము చెల్లించవలయుననీ కోరి ఉండినది పోరాటము ఆరంభమయినపుడు చెల్లించగల్గినవారుకూడ చెల్లించ నవసరము లేదని తెలియజేయబడినది. ఈ విషయము ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యనిర్వాహక సభ కూడ గుర్తించినది

అందుచే సత్యాగ్రహాన్ని ఆపుచేస్తూ చేసిన తీర్మానములో చెల్లించగలవారు మాత్రమే చెల్లించాలి. అని తెలియజేసింది. దీని అర్థం మిగతావారు వచ్చే సంవత్సరమువరకు చెల్లించనవసరము లేదు. చెల్లించగల్గినవారుకూడ బ్రహ్మయ్యగారి అవార్డులో ఇచ్చిన రూపాయికి రెండణాల రిమిషను మినహాయించుకొని చెల్లించినచాలు. దానికి పూర్తిగా రశీదు పొందాలి.

అయితే చెల్లించలేనివారెవరు? అప్పుతీసికొని రానిదే చెల్లించలేనివారు, తిండికి, విత్తనాలకు పోను, అమ్మి పన్నుకట్టడానికి ధాన్యము లేనివారు, ఈ రెండు తరగతులవారూ, చెల్లించలేనివారిలో వస్తారు. ఈ సూత్రాల ననుసరించి మునగాల రైతుసంఘం ఎవరు చెల్లించగల్గినదీ, ఎవరు చెల్లించలేనిదీ నిర్ణయించాలి.

మునగాల రైతులు రైతు సేవకులు మరియొక విషయము ముఖ్యంగా గమనించాలి. ప్రభుత్వము మనకెట్టి వాగ్దానము చేయలేదు. అందుచే ఈ 15 దినాలలో ప్రభుత్వము యేమేమి పనుల జేయకపోతే, మనము తిరిగి పోరాటాన్ని ఆరంభించవలసి ఉంటుందో స్పష్టముగా మనమూ, ఇతర రైతులు తెలుసుకొని ఉండుట మంచిది.

ఈ 15 దినాలలో,

1. అరెస్టు చేయబడిన, శిక్షించబడిన రైతు సత్యాగ్రహుల నందరిని విడుదల గావించాలి.

2. సత్యాగ్రహ పోరాటములో జప్తు చేయబడిన ఆస్తి నంతను తిరిగి అప్పజెప్పాలి.

3. పోలీసుల నిర్బంధవిధానాన్ని ఆపుచేయాలి.

రైతులు తమ పోరాటాన్ని కాంగ్రెసు మంత్రుల జోక్యము కలిగించుకోడానికి అవకాశం కల్పిస్తూ ఆపుచేసినపుడు జమీందారుకూడ అదే రీతిని తన తరపున ఈ 15 దినాలు పన్నులు వసూలుచేయడానికని చేసేజప్తులు, నిర్బంధాలు, ఇండ్లు తగులబెట్టడము, పశువులను బందిలిదొడ్డికి తోలడము, రైతులపైకి తన సేవకులను, పోలీసులను రెచ్చగొట్టడము మానుకోవాలి.

జమీందారు, ప్రభుత్వమూ, తాము ఏమిచేయవలసి ఉంటుందో స్పష్టముగా గుర్తిస్తారనుకొంటాము. తమ బాధ్యతను గుర్తించకపోతే, తిరిగి మునగాలలో రైతు పోరాటము తప్పదు. అది ఈ పర్యాయము ఒక్క మునగాల రైతుపోరాటముగా మాత్రమే ఉండదు. ఆంధ్రరాష్ట్ర రైతుల పోరాటంగా, ఆంధ్రరాష్ట్ర ప్రజా సామాన్యమంతటి పోరాటంగా మారక తప్పదు.

ప్రభుత్వమూ, జమీందారు రైతుల కోర్కెలను మన్నిస్తారనే శ్రద్ధినమ్మకముతో రైతులు రైతు సేవకులు అజాగ్రత్తగా ఉంటే తీరని దెబ్బ తింటారు. మన శక్తిని తగ్గకుండా కాపాడుకోవాలి. దానిని వృద్ధిపొందించుకోవాలి.

1. రైతులు, 15 దినాలలో తమ వ్యవసాయపనుల నన్నింటిని పూర్తిచేసుకొని, తిరిగి పోరాటములో దూకడానికి తయారు కావాలి.

2. అంతేగాదు. జెయిళ్లలోనున్న మన వీరసత్యాగ్రహయోధులను మనము మరువలేము. వారి పొలాలనుకూడ మనమే ఈ 15 దినాలలోనే సాగుచేసిపెట్టాలి. ఏవిషముగా ఆకుటుంబములలో ఒకరో, ఇద్దరో జెయిళ్ళకువెళ్లారో, అచేతిత జెయిళ్ళకు వెళ్ళక ఇంటివద్ద నుండువారు ఇంటికి ఒకమనిషి చొప్పున వచ్చి, జెయిళ్ళలోనున్నవారి పొలాలు సాగుచేసి పెట్టాలి. పొలాలులేని జెయిలు సత్యాగ్రహ కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయాన్ని ఏర్పాటుచేయాలి.

3. రైతు సేవకులు నిరంతరమూ గ్రామగ్రామమూ తిరుగుతూ, సభలుపెట్టుతూ రైతులను ప్రబోధముచేయాలి. ఈ పోరాటములో రైతులు విజయము పొందకపోతే 1930 పోరాటము భగ్నమయినపుడు పడినబాధలన్నీ పడవలసి ఉంటుంది. మరికొంత పట్టుదలతో, మరి కొంచెమునేపు ఓపికతో, జమీందారు, పోలీసుల నిర్బంధాలను ఎదుర్కొనండి. ఆంధ్రరాష్ట్ర మందంతటినుండి వందలకొలది రైతు సోదరులు తమతోపాటు నిలబడి పోరాటము సాగించడానికి వస్తారు.

4. రైతుసేవకులు, గ్రామగ్రామాన తిరిగి, జమీందారు, పోలీసులు చేసే అత్యాచారాలను బెదరింపులను, నిర్బంధ జప్తులను సాగనివ్వకుండా జాగ్రత్తగా పని చేయవలసి ఉంటుంది.

5 జెయిలులోని మునగాల రైతు సత్యాగ్రహులకు సహాయము చేయడానికి, తిరిగి పోరాటమువస్తే, దానిని నడుపుటకు ధనము కావలసి ఉంటుంది. గ్రామగ్రామాన ఇంటింటికి తిరిగి "మునగాల నిధి"కి ధనరూపానో, ధాన్యరూపానో భిక్ష ఎత్తడము వెంటనే ఆరంభించాలి. ఎంతెంత వసూలుచేసినదీ ప్రతి వారమూ "నవశక్తి"లో ప్రకటిస్తాము. వసూలైన మొత్తాలు రాష్ట్ర రైతుసంఘము ఆఫీసు బెజవాడ అని పంపించండి!

6. ఆంధ్రరాష్ట్ర మందంతటనున్న రైతు సోదరులకు, సోషలిస్టులకు మరియొక పర్యాయము హెచ్చరిక. 15 దినాలలో తిరిగి పోరాటమువస్తే, వెంటనే మునగాల సత్యాగ్రహ క్షేత్రానికి ఉరుకుటకు సంసిద్ధులు గుండి త్వరలో మేకు పిలుపు వస్తుంది. ఈపిలుపును అందుకోడానికి తయారుగ ఉండండి, మునగాల రైతు పోరాట విజయముమీదనే, ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతుల విజయము, ఆంధ్రరాష్ట్ర రైత్వారీ రైతుల విజయము, కాంగ్రెసు వాదులలోని ఐక్యత, స్వాతంత్ర్య పోరాటాభివృద్ధి ఆధారపడి ఉన్నాయి. మునగాల రైతు పోరాటము, ఆంధ్రప్రజా పోరాటమని గ్రహించండి

పుచ్చలపల్లి సుందరయ్య,
కార్యదర్శి
ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ.

మన రాజకీయాలు

కలకత్తా మ్యునిసిపల్ బిల్లు

కాంగ్రెసేతర రాష్ట్రాలలో జాతీయ ప్రతికూల పార్టీలు తమ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. కలకత్తా మ్యునిసిపాలిటీలో జాతీయ శక్తులకు మెజారిటీ లేకుండాచేయడానికి మహమ్మదీయులకు ప్రత్యేక నియోజక వర్గాలు యిస్తూ హక్ మంత్రివర్గం కలకత్తా మ్యునిసిపల్ బిల్లు ఒకటి ప్యాసు చేసింది. కాని, బెంగాలు రాష్ట్ర కాంగ్రెసు కమిటీవారు యీ బిల్లు అచరణలోనికి రాకుండా సత్యాగ్రహము సాగించడానికి తీర్మానం ప్యాసు చేశారు. బిల్లు ఆచరణలోకి తేబడితే, మ్యునిసిపాలిటీకి రావలసిన పన్నులు ప్రజలు చెల్లించకుండా పన్నుల నిరాకరణోద్యమము ప్రారంభించడానికి సత్యాగ్రహ కమిటీ నిశ్చయించింది. శరత్‌బోసువంటి నాయకులు ఈ ఉద్యమాన్ని నడిపించడానికి తయారుగా ఉన్నప్పుడు సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తే హక్ మంత్రివర్గము యొక్క కుటిల పన్నాగాలు పటాపంచలు కాకమానవు.

ఉద్యోగాల పంపకం

ప్రభుత్వోద్యోగాల పంపకం విషయములో కూడా బెంగాల్ మంత్రివర్గం ప్రజా ప్రతికూల వైఖరినే ప్రదర్శిస్తోంది. కాబినెట్‌లో అనేక దీర్ఘ చర్చల పర్యవసానంగా, మహమ్మదీయులకు సగం, మిగిలిన మతాలవారందరికీ సగం చొప్పున ఉద్యోగాలు రిజర్వు చేయాలని తుది నిర్ణయం ఇచ్చింది. 100 కి 15 చొప్పున అస్పృశ్యులు మొదలయిన "షెడ్యూల్ తరగతి" వారికి రిజర్వు చేస్తుంది. కాని వారి సంఖ్య ముస్లిములు కాని మతస్థులందరిలో 100 కి 30 కంటె ఎక్కువ ఉండకూడదు. అంగ్లో ఇండియన్లు, యూరపియన్లు, బౌద్ధులు వగైరా తెగలవారికి రిజర్వు చేయడం సాధ్యం కాదని తెలియజేయిబడింది. ఈనిబంధన లన్నీ కొత్త ఉద్యోగాల నియామకం గురించి. ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్లు యివ్వడం విషయములో పైవిధమైన రేషో పద్ధతి ఉండదని గ్యారంటీ యిచ్చినప్పటికీ 100 కి 50 కంటె ఎక్కువ ప్రమోషన్లు మహమ్మదీయులు కాని వారికే లభిస్తే, ఆలోటు మహమ్మదీయులకు అదనంగా కొత్త ఉద్యోగాలిచ్చి నింపుతారు. కాబట్టి కొత్త ఉద్యోగాల విషయంలోను, ఉన్న ఉద్యోగుల ప్రమోషన్ విషయములోను, పూర్తిగా మహమ్మదీయులకే పక్షపాతము చూపబడుతోంది.

కుల, మత భేదాల ననుసరించి ఎన్నికలు జరగడం వల్ల ప్రజా ప్రతినిధులు ఆయా కులాలకు; మతాలకే, ఎక్కువ ప్రాముఖ్యత నిచ్చి విశాలమైన జాతీయ భావాన్ని నిర్లక్ష్యం చేస్తారు. కనుకనే కాంగ్రెసు సంస్థ మొదటినుంచీ ప్రత్యేక నియోజక వర్గాలను ఎదిరిస్తూ వచ్చింది. బెంగాల్ మంత్రివర్గం యిప్పుడు చేసిన నిర్ణయంవల్ల రాష్ట్రంలో ఉన్న వేర్వేరు భిన్న మతస్థులలో ఉద్యోగాలకొరకు వైషమ్యాలు చెలరేగి, జాతీయ ఆశయాన్ని మరచిపోకుండా చేయాలంటే, బెంగాల్ కాంగ్రెసు వాదులు మహమ్మదీయ ప్రజా సామాన్యం యొక్క దైనందిన పోరాటాలలో పాల్గొంటూ, వారి దృష్టిని జాతీయ పోరాటంవైపుకు తిప్పవలసియుంటుంది. జాతీయ ప్రతికూల శక్తుల విజృంభణాన్ని అప్పుడే అణచగలుగుతారు.

గ్రంథ నిషేధం, నిర్బంధ విధానం.

భావ ప్రచారాన్ని అరికట్టడానికి కూడా బెంగాల్ ప్రభుత్వం అనేకనిరంకుశపద్ధతులకు దిగుతోంది. లాహోరు కుట్ర కేసు నిందితుడును, అండమాన్ దీవులలో శిక్ష ననుభవించి యిటీవల విడుదల చేయబడ్డ విజయకుమార్ సిన్హా వ్రాసిన "అండమాన్ జీవితం" అనే గ్రంధాన్ని, "నేషనల్ ఫ్రంటు" పత్రిక మే 21 వ తేదీ సంచికను, బెంగాల్ ప్రభుత్వము నిషేధించింది. బెంగాల్ కార్మిక నాయకుడైన దత్తు మజుందార్‌కు అప్రిల్‌లోకూడా 3 నెలల కఠినశిక్ష విధించబడింది. బాట్లీవాలా, రాం మనోహర్‌లోహియాగార్ల విచారణ (రాజద్రోహ నేరం క్రింద)సాగుతోంది.దయారాంబేరీ అనే మరొక కార్మిక నాయకుడు రాజద్రోహ నేరానికి అరస్టు చేయబడ్డాడు దామోదర్ కెనాల్ రైతు సత్యాగ్రహంలో పాల్గొన్న ఖైదీలు జైలులో నిరశన వ్రతం చేసినందుకు వారికి ఆరేసి వారాల కఠిన శిక్ష విధించారు.

ఇక బెంగాల్ జైళ్ళలో మ్రగ్గుతూన్న రాజకీయ ఖైదీల స్థితి రోజు రోజుకీ విషమిస్తోంది. డిటెన్యూలందరూ విడుదల చేయబడినప్పటికీ, దీర్ఘ కారాగార శిక్షలు అనుభవిస్తూ 150 మందికి పైగా రాజకీయ ఖైదీలు జైళ్ళలో పడరాని బాధలు పడుతున్నారు. వారి విడుదల విషయంలో బెంగాలు ప్రభుత్వం అవలంబిస్తూన్న విధానం సంతృప్తికరంగా లేకపోవడం వల్ల ప్రభుత్వపు 'ఎడ్వైజరీ కమిటీ'లో నుండి శరత్ బోసు, లలిత్ చంద్రదాసు (కాంగ్రెసు ప్రతినిధులు) గారలు రాజీనామా యిచ్చారు. ఈ విషయమై శరత్ బోసు గాంధీగారికి తెలియజేస్తే, "ఈ సమస్యపై మళ్ళీ బ్రహ్మాండమైన ఆందోళన ప్రారంభమయితే, అది మన దురదృష్టం" అని జవాబు చెప్పాడు. ఖైదీలు మాత్రం తిరిగి నిరశనవ్రతం ప్రారంభించకుండా ఓపికపట్టి యుండేలాగు చేయవలసిందని బోసును కోరాడు.

పంజాబ్‌లో

బెంగాలులో మాదిరిగానే పంజాబులోకూడా మంత్రివర్గం జాతీయ ప్రతికూల దృక్పథంతోనే ప్రవర్తిస్తోంది. ఈ నెల 4 వ తేదీని తట్టా గ్రామంలో జరిగిన అట్టక్ జిల్లా కాంగ్రెసు రాజకీయ మహాసభ సందర్భములో జమీందార్ల కొందరు ప్రజలపైబడి చిత్రవధ చేస్తే, ఒక కాంగ్రెసువాది మరణించాడు. అనేకమందికి తీవ్రమైన గాయాలు తగిలాయి. శాంతికి భంగము కలుగజేసిన జమీందార్లపైనను, రౌడీల పైనను కఠినమైన చర్య తీసుకొనడానికి బదులు సుమారు 60 మంది కాంగ్రెసువాదుల్ని పోలీసులు ఎరస్టు చేశారు. పైగా, మొన్నటి ప్రభుత్వ ప్రకటనలో, కాంగ్రెసు నాయకులే స్థానిక ముస్లింలీగ్ వారి కోరికకు విరుద్ధంగా ఊరేగింపు జరిపి శాంతికి భంగము కలుగజేశారనే నిందమోపబడింది. అమృతసర్‌లో శాంతియుతంగా సమ్మె చేస్తూన్న 120 మంది పాకీపనివారు అన్యాయంగా ఎరస్టు చేయబడ్డారు.

లాహోరు రైతు సత్యాగ్రహుల్ని ప్రభుత్వం ఎడతెగకుండా ఎరస్టు చేస్తూంది. 2000 మందికి పైగా జైళ్ళలో నిర్బంధింపబడ్డారు.

కాంగ్రెసు రాష్ట్రాలలో

ఇక కాంగ్రెస్ రాష్ట్రాలలో పరిస్థితు లేవిధముగా ఉన్నాయో చూద్దాం. బీహార్‌లో రైతులు ప్రభుత్వానికి చెల్లించవలసిన హాలు శిస్తు వసూళ్ళకు అక్టోబరు 15 వరకూ వాయిదా యివ్వబడినప్పటికీ, ఉమ్రేర్ రైతు సత్యాగ్రహములో పాల్గొన్న తా॥ కాం॥ కమిటీ కార్యదర్శికి, మగన్‌లాల్ అనే సోషలిస్టు నాయకునికీ, తంబేకర్ అనే రాష్ట్ర కాంగ్రెసు కమిటీ సభ్యునికీ, శ్రీహరి అనే రైతునాయకునికీ ఒక్కొక్క స॥ కఠిన శిక్ష విధించబడింది. మరొక 6 గురు సత్యాగ్రహులకు ఆరేసి నెలలు. బీహారులో 25 గురు రైతు సత్యాగ్రహ ఖైదీలు ఛాప్రా జైలులో నిరశనవ్రతం చేస్తే, బలవంతంగా ఆహారం యిచ్చారు. సరిహద్దు రాష్ట్రంలో 200 మందికి పైగా రైతు సత్యాగ్రహుల్ని పోలీసులు ఎరస్టు చేశారు. వారి నాయకుడయిన ఒబీమల్లాస 1½ సం॥ జైలుశిక్ష విధించబడినది. "వర్గ వైషమ్యాన్ని" ప్రోత్సాహం చేయు కమ్యూనిస్టుల్ని 153 (ఎ) సెక్షన్ క్రింద, 107 సెక్షన్ క్రింద ఎరస్టుచేయవలసిందని యు పి. ప్రభుత్వం జిల్లా అధికార్లకు రహస్యపు ఉత్తరువులు జారీ చేసింది. సరిహద్దులో కక్కి అనే గ్రామానికి చెందిన 10 మంది కాంగ్రెసు వాదులు పోలీసులను ఆటంకపరిచారనే ఆరోపణ క్రింద ఎరస్టుచేయబడ్డారు. మునగాల రైతుల విషయము సరే సరి!

ఫెడరేషన్ సమస్య

కాంగ్రెసు మంత్రు లీవిధముగా "శాంతి-భద్రత"లను కాపాడటమే కాకుండా, బ్రిటిష్‌ప్రభుత్వంతో పోరాటమే అవసరం లేదనే స్థితికి నాయకులు వస్తున్నారు. సంస్థానాధీశులు ఫెడరల్‌విధానాన్ని నిరాకరిస్తూ తీర్మానించడంవల్లమనం కొంతకాలంవరకు పోరాడ నవసరం లేదని కాంగ్రెసు అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పలికాడు. బ్రిటిషు ప్రభుత్వము యిక ఏమి చేస్తుందో నిరీక్షిస్తూ ఉండడము మంచిదని సలహా యిచ్చాడు. "గత రెండు మూడు తరాలుగా మనం ఏ యింటి యాజమాన్యంకొరకు పోరాటము సాగించామో, అయిల్లు నేడు మన స్వాధీనమైపోవడం మన అదృష్టం"అంటూ మనరాజాజీ మద్రాసులో ఉపన్యాసం యిచ్చాడు. అహమ్మదాబాద్‌లో కాంగ్రెసు వాలంటీర్ల దళం యెదుట వల్లభభాయి పటేల్ ఉపన్యసిస్తూ, "ప్రభుత్వంతో పోరాటం సల్పడం కంటె కష్టసాధ్యమైన జాతీయపునర్నిర్మాణానికి వాలంటీర్లు పూనుకోవలసిం"దని హెచ్చరించాడు. నేస్థుల్ని పట్టియివ్వడంలో వాలంటీర్లు కాంగ్రెసు ప్రభుత్వానికి సహాయపడవలసిందని సలహా యిచ్చాడు. పోలీసుల కివ్వవలసిన జీతాలకు బొంబాయి ప్రభుత్వపు ఖజానాలో సొమ్ములేదు కాబట్టి వాలంటీర్లు యీ "ధర్మం" నెరవేర్చాలట!

కాంగ్రెసు నాయకుల యీ వైఖరి జాతీయ పోరాటానికి ఎంత హానికరమో వేరే చెప్పనక్కర్లేదు.

తప్పటడుగులు-వెక్కిరింతలు

"ఉత్తతీ, ఉత్తతీ" అని పాడుకోడం ఉత్తతీత పిట్టకు సహజమే కావచ్చు; కాని ఆ పాడు ధ్వని ఆపదలో వున్నవారికి విషాదాన్ని కలిగించి తీరుతుంది. అందుచేతనే ఆర్తులు ఆ పిట్ట కూత విన్నపుడల్లా తిట్టి పోస్తారు. ఆ అపభ్రంశపు కూతలు కూయడం తిట్లు తినడం దాని ఖర్మ! మన మేం చేస్తాం ఆ కూతలు-కూయడం మాననపుడు?

* * *

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ డిసిప్లిన్ మహామారి పుణ్యం గట్టుకుంటె సంప్రాప్తమయిన దిక్కులేని వారసత్వపు పశ్చిమకృష్ణా జిల్లా కాంగ్రెసు కమిటీ నడుమంతరపు అధ్యక్షులు ఒక ప్రకటన చేసారు. దాని సారాంశమేమిటంటే మునగాల రైతుసత్యాగ్రహంతో తమ కాంగ్రెస్ సంఘానికి ఎట్టి సంబంధం లేదని. ఉందని ఎవ్వరన్నారు, లేదని చెప్పడానికి? ప్రజలతో సంబంధమున్న కాంగ్రెసు కమిటి వున్నపుడు మునగాల ఎస్టేటు పరిపాలన గురించి సబ్ కమిటీ ద్వారా విచారించి రిపోర్టు ప్రకటించింది. ఆ రిపోర్టులో మునగాల జమీలోని దౌష్ట్యాలన్నీ వెల్లడించబడ్డాయి. ఆ పరగణాలో ప్రచారకుల పంపి కాంగ్రెసు సందేశాన్ని వ్యాపింపజేసింది. కాంగ్రెసు సంఘములో మూడువేలదాకా సభ్యులు చేరారు. ప్రజలలో చైతన్యం గలిగి జమిందారీ నిరంకుశత్వాన్ని ఎదిరించ పూనుకొన్నారు. యీలోగా డిసిప్లిన్ కత్తికి బలియై 35 వేల మంది కాంగ్రెసు సభ్యులతో సహా ప్రాత కాంగ్రెస్ కమిటీ రద్దయి పోయింది. జమిందార్ల డబ్బుతో 29 వేల సభ్యులనుచేర్పించారనే వదంతులువున్న ముఠా కొత్తగా పీఠ మలంకరించింది. ఈ కొత్త అధ్యక్షుడు మునగాల సత్యాగ్రహంతో తన కేమీ సంబంధం లేవంటున్నాడు.

రాష్ట్ర కాంగ్రెస్ పంపిన ఒక సర్క్యులర్‌లో కొత్త పశ్చిమ కృష్ణా కాంగ్రెసు సంఘము ప్రారంభించిన నాటినుండి యింతవరకు నెలసరి లెక్కలను పంపలేదని మందలింపు పంపింది. దానిని బట్టి చూస్తే యీ కొత్త సంఘం, కొత్త అధ్యక్షుడు అసలు నామకః అయినా పనిచేస్తున్నారా అనే సందేహం రాకపోదు. "కలడు కలండనెడువాడు కలడో!లేడో!!"

ఓయి! అన్నయ్యా!! పూర్వం మునగాల ప్రజలలో కాంగ్రెస్ సందేశాన్ని అందచేసిన కాంగ్రెస్‌వాదులకు మునగాల పోరాటంలో యిపుడూ సంబంధం వుంది! నీకూ నీ ముఠాకు అపుడూలేదు: యిపుడూలేదు. సంబంధములేదని మడికట్టుకుంటే ప్రజా నాయకత్వం మీ జిల్లా సంఘానికి అబ్బదు. బయలుదేరు. పూర్వం జిల్లా కాంగ్రెసు సంఘము ప్రారంభించిన పని పూర్తిగావించు. మునగాల ప్రజల తరపున నిలబడి పోరాడు; ప్రజలకు సేవ చేయడంలో నీ ప్రత్యర్థులతో పోటీపడు; చేతులు ముడిచికొని కూర్చుంటే ప్రజలు మెచ్చరు.—

* * *

వితండవాదం సాగించడానికి ఉన్న సంగతులు మరచిపోవడం, లేనిసంగతులు వూహించడం, అవసరం: తమ వాదనకు సరిపడని సంగతులు తెలిసినా తెలియనట్లు నటించడం, బుకాయించడమూ సహజమే. పత్రికలన్నీ మునగాల వార్తలతో నిండుతున్నాయని వ్రాస్తూనే జూన్ 17 వ తేదీ కృష్ణాపత్రిక సంపాదకీయంలో అనేక స్టేటుమెంట్లలో ప్రతిధ్వనించిన సత్యాలను ఎరుగనట్లు నటించుతూ వ్రాసారు.

నెంబరు 1 బుకాయింపు: "ఆంధ్రరాష్ట్ర రైతు సంఘంగాని, కృష్ణాజిల్లా సంఘముగాని యీ విషయములో బాధ్యత వహిస్తున్నట్లు కన్పట్టదు. రాష్ట్ర రైతు సంఘ అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా సంఘ అధ్యక్ష కార్యదర్శులు స్టేటుమెంట్లు యిచ్చారు. అచటికి వెళ్ళి ఉద్యమానికి తమ సలహానిచ్చి నడిపించుతున్నారు. కాని యీ సత్యం కృష్ణా పత్రికకు కాన్పించదు. చూడదలచుకోలేదు కాబట్టి. సోషలిస్టు కమిటీలు, రైతు సంఘాలుగాని కాంగ్రెసు వలదంటే ఎలా జోక్యం కలిగించుకుంటాయి? అని ప్రశ్నించుతూంది.

రైతుల హక్కులను పోరాడి, అయినా, సంపాదించడానికే రైతు సంఘా లున్నాయి. కష్టజీవుల హక్కులకై జరుపబడు పోరాటా లన్నిటిలోనూ పాల్గొని, కట్టుదిట్టాలతో పోరాటాన్ని జయప్రదంగా నడుపుటే సోషలిస్టుల కార్యక్రమం. మంచివైద్యుడు తన నైపుణ్యాన్ని అర్తులకొరకు వినియోగించడానికి యితరుల ఉత్తరవు కొరకు వేచియుండజాలడు: స్వలాభాపేక్షాపరుల అడ్డగింపులను అతిక్రమించి తీరాలిసి వస్తుంది. అలాగే సోషలిస్టులు, రైతు సంఘాలు ఎల్లపుడూ మునగాల రైతుల తరఫే. సంబంధం లేదనే అనుమానం కృష్ణా పత్రికకు కలగడంలో ఆశ్చర్యం లేదు. తమ వాదనను సమర్థించుకోడానికి లేని సంగతులు ఉన్నవని వూహించుకో వద్దూ మరి!

* * *

బుకాయింపు నెం. 2:—"పన్నులంతా గాకపోయినను, ఒక భాగమైనను యిచ్చుటకు గూడ నిరాకరించుటలో నర్థ మేమి"?

రైతులు దాదాపు 28 వేల రూపాయలు హాలుసాలు శిస్తులో చెల్లించారు. ఈ సంగతి కృష్ణాపత్రిక జమిందారు కనుకూలముగా మరచిపోతూంది. మొత్తము ఎస్టేటు 28 వేలలో 30 వేలు చెల్లించడం రైతులు తాము నెరవేర్చవలసిన వానిలో గమనించదగినంత వరకు చేశారనే గదా రుజువు చేస్తూంది?

పరిష్కర్తలయిన ఎర్నెని సుబ్రహ్మణ్యం గారు ఇపుడు సత్యాగ్రహం సాగించుతున్న ఇమ్మడి పాపయ్యగారి భూమి రైతు కిచ్చివెయ్యాలని తీర్పు యిచ్చారు. జమీందారు అక్రమంగా ఆక్రమించుకొన్న అనేకభూములను గురించిన తగాదాలలో మొట్టమొదటి తీర్పు ఇదే. దీన్ని జమీందారు నెరవేర్చాడా? లేదు. తనకు రావలసిన ఎస్టేటు యావత్తు శిస్తూ, రాజీతో ఎట్టి సంబంధం లేని కమతాల మగతా సహా, ముందుగా చెల్లించితేనే తాను చెల్లించాలసిన షరతుల గురించి ఆలోచించుతానన్నాడు. రైతులనుండి శిస్తులు రాబట్టుకోడానికి జమిందారుకు బ్రిటీషు ప్రభుత్వం నిర్మించిన శాసనాలున్నాయి; కోర్టులున్నాయి; రిజర్వుపోలీసు దళాలు లాఠీలు, తుపాకులు వున్నాయి. అంటే ఇప్పటి ప్రభుత్వ రక్షణ వుంది జమీందారు శిస్తులు వసూలు చేసికోడానికి. కాని, జమీందారునుండి రాజీ ప్రకారం రైతులకు రావలసిన దానిని రాబట్టడానికి అట్టిరక్షణ లేదు. బ్రహ్మయ్య గారు యివ్వలేరు: యిప్పుడు రైతులను బాధించుతున్న ఉద్యోగులు అట్టి హామీ ఇవ్వలేరు. ఇక రైతులకు గత్యంతరం ఏమిటి సత్యాగ్రహంతప్ప? జమీందారీ పక్షపాతులకు, రాజాజీ గవర్నమెంటుకు, చిక్కు వచ్చిందనుకొనే వారికి తప్ప ప్రజలందరికి మునగాల రైతు పోరాటం సబబుగా కన్పించి తీరుతుంది.

* * *

బుకాయింపు నెం. 3:— పోలీసు అధికారి మాటలు ప్రకటించి వానిని ఖండించకుండా వుండుట. లాఠీఛార్జీలను, ఆడవాండ్లను బలవంతముగా నెట్టుట వగయిరా దౌర్జన్యాలనుకూడా సమర్థించుతుందా అనిపించకపోదు. పైగా వీని నాక్షేపించే పత్రికలను "రాజాజీ అంటే మనవారికి మంట"..."ఇక వానిపై నిప్పులు చెరుగుతున్నారంటే ఆశ్చర్యమేముంది?" అని వాపోతూంది.

పోలీసువారంటే మమత రాజాజీకి—రాజాజీ అంటే అప్యాయత కృష్ణా పత్రికకు. పోలీసువారి చర్యలను సమర్థించడంలో ఆశ్చర్య మేముంది?

* * *

క్రాశీపట్టణంలో రైతు సత్యాగ్రహంలో పాల్గొన్న కాంగ్రెసువాదులకు రాష్ట్ర కాంగ్రెసు' సంఘము తమ అనుమతిలేకుండా ఎందుకు పాల్గొన్నారో సంజాయిషీ చెప్పాలని హుకుం పంపింది. జమీందారు అనాదినుంచీ రైతులు అనుభవించుతున్న భూములను అన్యాక్రాంతం చేస్తున్నాడు. అపుడు అచటి రైతులలో బయలుదేరిన ఆక్రందనం, హృదయాలు గల స్థానిక కాంగ్రెసువాదులను ఆకర్షించింది. వారు రైతులను సక్రమ పోరాటానికి తయారుచేసారు.

కొంపలు తగలబడుతూంటే ఆర్పడానికి పోయే వీరుడు పై సంఘము అనుమతికోసం కూర్చోడు. పై సంఘము అతని ప్రజాసేవను హర్షించుతూ మెప్పులివ్వాలిగాని నోటీసులునారు పంపాల్సింది!

బ్యాంకట్ల తాకట్టుపెట్టుకొని వడ్డీ కివ్వడాన్ని కాంగ్రెసు కమిటీ అభ్యంతరము చెప్పడంలేదు. కాంగ్రెసు మహాసభ అజ్ఞానానికి వ్యతిరేకంగా జపాను జయాన్ని హర్షించే కాంగ్రెసు పత్రికలను బెదరించలేక పోయింది కాంగ్రెసు కమిటీ. ఫాసిజానికి కాంగ్రెసు వ్యతిరేకమైన్నా,ఫాసిజమే మానవోద్ధరణకు దారిఅని వాగేకొందరు కాంగ్రెసు మంత్రుల నోరు మూయించలేక పోయింది కాంగ్రెసు కమిటీ. పైగా ఫైజపూర్ కాంగ్రెసుచే నిర్వచింపబడిన రైతుల హక్కులను సంపాదించడానికే కాశీపట్టణ రైతు సత్యాగ్రహంలో పాల్గొన్న కాంగ్రెసువారిపై డిసిప్లిన్ కత్తి ఝుళిపింపులా, కర్తవ్యాన్ని నెరవేర్చినవారికి నెత్తిమీద మొట్టికాయలా— అధికార దుర్వినియోగానికి పరమావధి యింతకంటె వుండబోదు!

మునగాల

సత్యాగ్రహం ఎందుకు చేయాలసి వచ్చింది?

శ్రీ కామినేని వెంకటప్పయ్య

ప్రస్తుతం జరుగుతూఉన్న మునగాల రైతుల సత్యాగ్రహ పోరాటాన్ని గురించి వాస్తవస్థితిని ప్రజలకు, ప్రభుత్వానికి తెలియపరచడం ధావ్యమని తలుస్తాను.

జిల్లా రైతు సంఘాధ్యక్షుడనుగా ప్రారంభం నుండియు ఈ ఎస్టేటు వ్యవహారాల్లో నాకుగల సంపర్కంవల్ల నేనెరిగిన యదార్థ హంశాలను వెల్లడించుచున్నాను. ఇందులో వ్రాసిన జమీందారీ అత్యాచారాలను ఋజువు పరచడానికి మేము సంసిద్ధంగా ఉన్నాము.

మునగాల ఎస్టేటులో 23 మోజె గ్రామాలు 16 శివారు గ్రామాలు, 3 బేచరాకు గ్రామాలు. మొత్తము 42 ఊళ్లు ఉన్నవి జనసంఖ్య సుమారు 18000. 1802 సంవత్సరంలో ఎస్టేటు ఆదాయం పేష్కసునుబట్టి చూస్తే, సుమారు రు 6000 గా కన్పడుతుంది. 1900 సంవత్సరానికి 46,000-0-0 కు పెరిగింది. ప్రస్తుతం యితర రాబడులు మినహాయిస్తే, భూమిశిస్తు సుమారు రు 74000 వరకు పెరిగింది.

రైతుల స్వంతబావులు, కుంటలు వీటిక్రింద సాగుకుకూడా ఎస్టేటువారు పల్లం శిస్తుగా మొదటి పంటకు రు 10 లు. రెండో పంటకు రు 5 లు. మూడోపంటకు రు 2-8-0 వసూలు చేస్తున్నారు.

ఒకసారి బావిక్రింద సాగుచేస్తే బావులు పూడిపోయినా, సాగులు చెయ్యకపోయినా, గూడా శాశ్వతంగా పల్లంరేటు చెల్లించాలి. వీటి మరమ్మతులుకూడా రైతు చేయించుకోవాలసిందేనని పట్టాషరతు. ఈ నూతుల, కుంటల ఏరియాకుకూడా శిస్తుతప్పదు.

చెరువు సాగులు

చెరువు పడకలు చాలావరకు జిరాయితీకిచ్చారు. చెరువు లోదట్టుభూమికి శిస్తే, బయటి భూమికి శిస్తే. ఈ చెరువుల మరమ్మతు జమీందారే చేయాలని పట్టాలో షరతుఉన్నా, మరమ్మతులు రైతులచేతనే చేయిస్తున్నారు. రైతుల వద్ద మరమ్మతుల నిమిత్తము డబ్బుకూడా వసూలు చేస్తున్నారు. ప్రతి చెరువుకు క్రిందొక తూము, పైనొక తూము, గజం కెరలులో ఉంటాయి.

అన్ని భూములకు క్రిందితూమునుండి నీరివ్వరు. పైతూము వరకు నీరువస్తేనే చాలా భూములకు నీరువదుల్తారు. ఎస్టేటు స్వంత కమతాలు వారు కోరిన రేటుకు నిర్బంధంగా రైతులు సాగుచేయాలి. తప్పితే క్రిందితూము గుండా నీరివ్వబడదని బెదిరిస్తారు.

వెట్టి చాకిరి

చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, పురోహితుడు, రైతు, కూలీ, వీరు—వారు అనే భేదం లేకుండా వెట్టిచెయ్యాలి. బిల్డింగులు కట్టడం, వ్యవసాయం, రోడ్లువేయడం, మామూలు వృత్తులు, అన్నికూడా వెట్టికి చెయ్యవలసిందే. ఎస్టేటువారికి అవిధేయులుగా ఉన్నవాళ్ళనందరినీ బహిష్కరించమంటే బహిష్కరించవలసిందే. వాళ్ళతో సంపర్కం వదలుకుంటామని ఖరారునామాలు వ్రాయాలి. తప్పితే జరిమానాలు, శిక్షలు. సుమారు ఈ 30 ఏళ్ళనుండి జమీందారు వసూలు చేసిన జరిమానాలు కొన్ని లక్షలుంటాయి.

ప్రజలను వంగోబెట్టి బండ లెత్తించడం, కట్టి కొట్టించడం, అన్నపానాలు లేకుండా కోటలో నిర్బంధించడం సర్వసామాన్య విషయాలు.

రైతులు తమ భూములలోని మట్టిని పెంకు రాయీ కాల్చుకుంటానికీ, ఇల్లు అలుక్కుంటానికీ, కూడా ఎస్టేటుకు ఫీజుకట్టందే ఉపయోగించుకుంటానికి వీలులేదు. తమ చేలల్లోఉన్న రాతిముక్కలు కూడా ఎస్టేటుకు ఫీజు యివ్వకుండా తేరాదు. ఫీజురేటు అధికం. రైతులు తమ భూములలోని రాతిని అదేభూమిలోని నూతులకు కూడా ఉపయోగించుకోవటానికి వీలులేదు. రాతిగుట్టల ఏరియాకుకూడా రైతులు తిరిగి శిస్తులు చెల్లించాలి.

ఇతర వసూళ్ళు

ఇందుచేత, బావులు రాతి కట్టడంలేక తరచు విరిగి పూడిపోతూ ఉంటవి. రైతీ భూములలోని చెట్లుకూడా ఇప్పటివి అప్పటివి అనే భేదం లేకుండా జమీందారుదే అనుభవం. చెరువు పడకలు, గట్లు, డొంకలలోని గడ్డికి కూడా రైతులు పుల్లరి చెల్లించే మేపుకోవాలి.

గొల్లలు చెరువు పడకల్లోను, డొంకల్లోను, తమ గొర్రెలు తిరిగినందుకు 100 కి సం॥ కి 3 గొర్రెలు యివ్వాలి. కంసాలీలు బొగ్గుల నిమిత్తం డొంకలలోను, దోవలోను, ఉన్న చిన్న తంగేడు మొక్కలను తెచ్చుకున్నందుకు కింపటికి యింతపన్ను అని యివ్వాలి.

అనేక నిర్బంధాలు.

ఎస్టేటులో ఒకరికొకరు బాకీ ఉంటే సివిల్ కోర్టుకు పోరాదు. జమీందారువద్దనే కంప్లయింటు చేయాలి. పరిష్కారం చేసినందుకు పెద్ద మొత్తం జమీందారుకు యివ్వాలి. ఎస్టేటులో ఎవరైనా తగువులాడుకుంటే, క్రిమినల్ కోర్టుకు పోరాదు. జమీందారువద్దనే ఫిర్యాదు చేయవలెను.

జమీందారు చాలా సందర్భాలలో ఉభయులకుకూడా జరిమానాలు వేసి వసూలు చేస్తాడు. పోలీసు స్టేషనుకుకూడా ఎట్టి రిపోర్టు పోరాదు. జమీందారుకు తెలియకుండా ఎవరైనా సివిల్, క్రిమినల్ కోర్టులకు పోతే, అట్టివారిని తాము పిలిపించి జరిమానాలు వేస్తారు.

సంతానం లేకుండా ఎవరైనా చనిపోతే, ఆ ఆస్థి ఎస్టేటుకే రావాలి. ఎవరైనా తమ భూములనమ్ముకుంటే కొన్నావారు కొంత కిమ్మతును ఎస్టేటుకు చెల్లించాలి. తెలియకుండా క్రయవిక్రయాలు జరిగితే, అదే భూమికి మరొకరిపై క్రయం చేయించుకొన్న వానికి స్వాధీనంగాకుండా చేస్తారు. ఎస్టేటువారు ఏ సరకులకైనా చీటీ వ్రాస్తే డబ్బు లేకుండా వర్తకులు ఆ సరకులివ్వాలి.

ఈ ఎస్టేటులోని జమీందారీ నిరంకుశాలను గూర్చి న్యాయాధిపతులు, అధికారులు, రిమార్కులు" రిపోర్టు వ్రాసియున్నారు. నాకు దొరకిన నిచట ఉదహరించుచున్నాను.

కొన్ని తీర్పులు

మాధవరం గ్రామ మున్సిఫ్ కొల్లు అచ్చయ్యగారిని జమీందారు కొట్టించిన సందర్భములో అప్పటి సబ్-కలెక్టరు టి. శివశంకరన్, (ఐ. సి. యస్.) గారు జడ్జిమెంటులో "జమిందారు కోర్కెలకు భిన్నంగా నడిస్తే ఎస్టేటులో బ్రతుకుట దుర్లభం అన్న గ్రామమునసబు మొరలో సత్యం ధ్వనించుచున్నది" అని వ్రాసియున్నారు.

O. S. 370/35 రేపాల కేసులో తీర్పుయిస్తూ బెజవాడ డిస్ట్రిక్టు మున్సిఫ్

"వాది బలవంతుడైన జమీందారనీ, పేద బ్రాహ్మణునిచేత తన యిష్టం వచ్చిన డాక్యుమెంట్లను వ్రాయించుకొనుటకు ఒత్తిడి తేగలడనే విషయాన్ని మరువకూడదు" అని చెప్పారు.

1935 లో ఆంధ్రరాష్ట్ర జమీన్ రైతు సంఘమున్నూ గత సంవత్సరం పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘమున్నూ ఎస్టేటు రైతుల బాధలనుగురించి విచారణలు జరిపి తమ నివేదికలను ప్రకటించియున్నారు. ఆ నివేదికలు ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం ఆఫీసులో లభ్యపడగలవు.

పైన వ్రాసిన విషయములేగాక, ఇంకా అనేక విషయములను స్థలాభావం వదలివేసియున్నాను. ఈ విధమైన నానా బాధలు పడలేక 1930 సంవత్సరంలో ఒక రైతుసంఘం పెట్టుకొని దానిద్వారా తమ బాధలను లోకానికి తెల్పడానికి రైతులు ప్రయత్నించారు.

రైతు సంఘంపై ఆగ్రహం.

అంతటితో మరింత తీవ్రనిర్బంధాలు ప్రారంభమైనాయి. మొత్తం 19 మంది కరణాలలో 13 మందిపై కేసులు పెట్టించి, 11 మందిని సస్పెన్షను, యిద్దరిని డిస్మిసు చేయించారు ఇండ్లలో నుండి బయటికి రాకుండా వాకిండ్లకు కంపలు కొట్టారు. మంచినీరు దొరకకుండా ఎస్టేటు నౌఖరులచే బావులలో అశుద్ధం కల్పించబడ్డవి.

కొందరు దారుణంగా కొట్టబడ్డారు. మరికొంతమందివద్ద వందలు వేలు మొత్తాలు జరిమానాలుగా వసూలుచేయబడ్డది.

కొంతమందివద్ద ఇక ముందు రైతు సంఘాల్లో చేరకుండా వందలు వేలు మొత్తాలకు ప్రోనోట్లు వ్రాయించుకోబడ్డవి.

రివెన్యూ వేలాలు

కొంతమంది భూములు నిర్బంధించి విడుదల పెట్టించుకోవడం, క్రయం వ్రాయించుకోవడం, బలవంతంగా స్వాధీనం చేసుకోవడం, ఖుక్తదారుకు తెలియకుండా రెవిన్యూవేలంలో భూములను బంధువుల వగైరాలపేర కొట్టివేయించుకోవడం, జరిగింది.

ఈబాధలు పడలేక చాలామంది ఎస్టేటు వదలి నైజాముకు పారిపోయిరి. అటుల పారిపోయినవారిలో కొంతమంది ఇప్పటికీ నైజాములోనే ఉన్నారు. అప్పుడేర్పడ్డ రైతు సంఘం ఈవిధంగా విచ్ఛిన్నం చేయబడ్డది.

ఎరిగి క్రిందటి సంవత్సరము జమీందారీ విచారణ సంఘం ఏర్పడ్డ దరిమిలాను కాంగ్రెసు ప్రభుత్వం తమ హక్కులను రక్షించడానికి పూనుకున్నదనే ధైర్యంతో రైతులు ముందుకు వచ్చారు.

రైతుజన ప్రబోధం.

ఎస్టేటంతటా అన్ని గ్రామాలలోను రైతు సంఘాలు, కాంగ్రెసు సంఘాలు, పెట్టారు. మైనారిటీవెళ్ళిన స్త్రీ పురుషులలో నూటికి 80 మంది వరకు రైతు, కాంగ్రెసు, సభ్యులుగా చేరారు. తమ దుస్థితిని జిల్లా అధికారులకు, కాంగ్రెసు — రైతు సంఘాలకు, ప్రభుత్వానికి, విజ్ఞప్తులద్వారా తెలుపుకొన్నారు.

ఈ ప్రయత్నాలకు కినిసి, జమీందారు రైతులపై దాడి ప్రారంభించాడు. పశువులను అక్రమంగా బందెల దొడ్లలో పెట్టించడం, చెరువులకు నీళ్ళకు వెళ్ళకుండా నిరోధించడం, 144 సెక్షను యిప్పించడం, క్రిమినల్ కేసులు పెట్టించడం, ఇంకా సాగినచోట సాంఘిక బహిష్కరణం దాకా సాగించారు.

కూలీల సత్యాగ్రహం.

శిస్తులకై వెనువెంటనే జప్తులు జాయింటు పట్టాల అవకాశము తీసికొని విరోధులపై అమర్చుజరిపారు. ఈ పరిస్థితులలో గత్యంతరంలేక రైతులు జప్తులను శాంతంగా నిరోధించారు. ఈ సమయంలోనే రైతులతోపాటు ఇక తాముకూడా కూలియిస్తామని వరికోతలు కోయించుకొని దరిమిలా కూలీలకు ఎస్టేటువారు సరియైన కూలియివ్వ నిరాకరించారు. దానితో కోతకూలీల సత్యాగ్రహము కోట ముందు జరిగింది. జమీందారు రిపోర్టుపై జిల్లా అధికారులు పోలీసు దళంతో పరుగెత్తివచ్చారు. సరియైన కూలి యిప్పించారు.

తక్కిన రైతులు మున్నగువారి వ్యవహారాలుకూడా పరిష్కరిస్తాం అని ఉభయులను బెజవాడ రమ్మన్నారు. రైతులు సంతోషంతో బెజవాడ వచ్చారు.

బ్రహ్మయ్యగారి తీర్పు

శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారిని మధ్యవర్తిగా పెట్టుకొని మీ తగాదాలు పరిష్కరించుకోండి; ప్రక్కన ఉండి తాము తోడ్పడతామని కలెక్టరుగారు చెప్పారు. రైతు లంగీకరించారు.

ఈ రాజీ సమావేశానికి రైతుల తరపున నేనుకూడా హాజరయ్యాను. పర్యవసానంగా మునగాలలో 12—1—1939 తేదీని జమీందారు-రైతులమధ్య ఒడంబడిక జరిగినది

ఈ ఒడంబడిక ప్రకారం రైతులు చట్టప్రకారం యివ్వవలసిన శిస్తులు చెల్లింపవలెను.

ఇక తక్కిన షరతులు జమీందారు నెరవేర్చవలసినవి.

ఇందులో ముఖ్యమైనవి :

జమీందారు రైతులవద్ద బలవంతముగా లాక్కొన్న భూములను తిరిగి యివ్వాలి.

ఖుక్తదారులకు తెలియకుండా వేలం జరిగి, ఎస్టేటుపేర, వారి సంబంధీకుల పేర, కొట్టివేయబడ్డ భూములను తిరిగి యివ్వాలి.

జరిమానాల క్రింద వ్రాయించుకొన్న ప్రోనోట్లు రద్దుపరచాలి. రైతుల స్వంత బావులక్రింద మెరకరేటునే వసూలుచేయాలి.

దావాలుచేసి ఈనాందార్లను కంటెస్టు చెయ్యకుండాజేసి అక్రమంగా జయంపొందిన ఎక్సెస్, టైటిల్‌డీడ్ ఈనాములు, యితరసర్వీసు అర్టిజాన్ వగైరా ఈనాములకు జిరాయితీ పట్టాలు యివ్వాలి.

లిమిటేషనుతో నిమిత్తము లేకుండా, వర్తకులవద్ద తీసికొన్న సరకులకు డబ్బుయివ్వాలి.

రైతు భూమిలోని 1908 సం॥పు దరిమిలా చెట్లను రైతులకు వినగొట్టాలి.

ఎస్టేటువారు ఆక్రమించుకున్న సాముదాయక భూములను విడగొట్టాలి.

ఒడంబడిక అనంతరం షరతులను అమలు జరిపించడానికి మిత్రులు శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యంగారున్నూ నేనున్నూ కోరబడ్డాం. మేమొక మాసంరోజుల పాటక్కడ ఉండి ఒడంబడిక నమలు జరిపించడానికి విశ్వప్రయత్నాలు చేశాము. రైతులు అంతకుముందే చెల్లించిన శిస్తు రు 20,000 లు గాక, దరిమిలా రు 8000 లు పైబడి శిస్తు చెల్లించారు.

జమిందారు విముఖత

కాని జమీందారు ఏకొద్దిమంది వర్తకుల సరకులకు డబ్బు చెల్లించడమో తప్ప తక్కిన షరతులేమీ అమలుజరపలేదు. మేము జమీందారుతో ముందు నడిగూడెం ప్రైవేటు ఆస్తులను, ప్రోనోట్లను పరిష్కరించమన్నాము. జమీందారు కాలయాపన చెయ్యసాగారు. భూములను అసలు మేములాక్కోలేదని మమ్మలను నమ్మించ ప్రయత్నించారు. రైతులలో ఇందుచే అవిశ్వాసంకలిగింది. ఇంతలోనే ది 24-2-39 న మునగాలవచ్చిన శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య కలెక్టరుగార్ల ఎదుట స్వంత ఆస్తులు లాక్కున్న బాపతు విచారణ ప్రారంభమైంది. 2, 3 కేసులు విచారించిన దరిమిలాను ఇవన్నీ శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యంగారి పరిష్కారానికి విడువండనీ. రేపే వారు దీనిని పరిష్కరించవచ్చుననీ, ఎస్టేటువారు చెప్పారు. మేముకూడా అంగీకరించాము.

కాని ఆ తర్వాత శ్రీ సుబ్రహ్మణ్యంగారు ఎస్టేటువారిని ఆ వ్యవహారాలు పరిష్కారం చెయ్యమని కోరగా, యిప్పుడు చెయ్యటానికి వీలులేదనీ, ఆఖరునగాని చెయ్యమనీ, చెప్పినారట.

రెమిషన్ తగవు

ఇంతేగాక మెరకభూమికి యిస్తామన్న రెమిషను సందర్భంలోకూడా తగాదావచ్చింది. కలెక్టరుగారియెదుట జరిగినమాటల ప్రకారం రు. 1కి రు. 0-2-0 మొత్తం మెరక శిస్తుకు మినహాయించుకుని శిస్తు చెల్లించుటకు రైతులు సిద్ధపడ్డారు. ఎస్టేటువారు మేమన్నది ఒక కిస్తీకే గాని మొత్తానికి కాదని పేచీపెట్టారు. దానితో మళ్ళా సిస్తు చెల్లింపు ఆగిపోయింది.

అంతకుముందు 24-2-39 న మునగాలలో కూడ కొన్ని నిర్ణయములు యివ్వబడ్డవి. ఈ నిర్ణయములు "యీఒడంబడిక అమలు జరపడంలో వచ్చే సందేహములు తగాదాలనుగూర్చిన అంత్యపరిష్కారం బ్రహ్మయ్యగారిదే అయి వున్నది" అనేఒడంబడిక నిర్ణయం ప్రకారం ఇవ్వబడ్డవి.

ఈ నిర్ణయాలను కూడా జమీందారుగారు ఒప్పుకోమన్నారు.

తర్వాత అదివరకు ఎప్పుడూలేని స్వంత కమతాలకట్టుబాట్లుకూడా రైతులు పూర్తిగా చెల్లిస్తేనే గాని శిస్తు రెమిషను యివ్వమన్నారు.

రైతాంగ విద్యాలయ నిషేధం

ఈ పరిస్థితు లిట్లుండగా, రామాపురం గ్రామంలో గ్రామస్థుల సొమ్ముతో కట్టుచున్న స్కూలు బిల్డింగులో రైతుసంఘం తరఫున రైతాంగ విద్యాలయం పెట్టుకోగా జమీందారు పెట్టిన పిటీషనుమీద బెజవాడ సబ్‌కలెక్టరుగారు ఎక్స్‌పార్టీగా 141 సెక్షను ఉత్తరువులను యిచ్చారు. పాఠశాల అదివరకే పెట్టబడుటచే యథాప్రకారం సాగించబడ్డది. దానిమీద పాఠశాల నిర్వాహకులు శ్రీనండూరి ప్రసాదరావు మున్నగు 22 గురి మీద 144 సెక్షను నోటీసులు జారీచేసిరి. ఈ పరిస్థితులలో రైతులు నిర్బధంగా సత్యాగ్రహానికి యీడ్వబడ్డారు.

ఇక ఒడంబడిక అమలుజరుగడం దుర్ఘటంగా భావించి రైతులు సత్యాగ్రహానికి ప్రారంభించారు.

సత్యాగ్రహ ప్రారంభం

1930 లో తమసంఘానికి అధ్యక్షుడుగా ఉన్నందుచేత జమీందారుచే అనేకవిధముల బాధింపబడ్డట్టియు, భూములుకూడా స్వాధీనం చేసికోబడ్డట్టియు, ఇమ్మడి పాపయ్యశ్రేష్టిగారి భూమిలో రైతులు 2-6-39 తేదీని నాగళ్ళతో ప్రవేశించారు.

ఈ భూమి పాపయ్యగారిదేనని జిల్లాపై అధికారులకు తెలియును. వారిఎదుట జరిగిన విచారణలోనే యీ విషయం నిష్కర్షగా తేలింది.

అట్టి భూమిలో దున్నుటకు ప్రవేశించినందుకు అరెస్టులుసాగాయి. లాఠీచార్జీలు జరిగాయి.

ప్రత్యేకంగా 4 వ తేదీని జరిగిన లాఠీచార్జీనిన్నీ, అదేరోజున మునగాలలో స్త్రీ పురుషులతో కూడిన ప్రజల ఊరేగింపును జండాలు విరగదీసి కర్రలతో అడ్డగించుటయు ప్రత్యేకంగా విసరింపదగ్గవి.

ఆరోజు ఉదయం 9 గురు రైతుల గుంటకలతో చేలో ప్రవేశించి దున్నుచున్నారు.

సబ్-కలెక్టరుగారు, డి. యస్. పి గారు, ఏ. డి. యస్ పి. గారు షుమారు 60 మంది పోలీసు దళంతో వచ్చారు. చేను దున్నేవారిని అరెస్టు చేశామన్నారు. వారు శాంతంగా లోబడ్డారు.

లాఠీల ప్రయోగం.

తర్వాత ఆ ఎడ్లను గుంటకలతో జమీందారు మనుష్యులు స్వాధీనం చేసికొని ఎడ్లను బాదుకుంటూ తోలుకొని పోతున్నారు ఆ చుట్టూ మూగియున్న రైతులకిది కష్టంగా తోచింది.

ఆ ఎడ్లను తోలుకొని పోతున్న జమీందారు మనుష్యుల కడ్డంవచ్చి ఎడ్లను తోలుకొనిపోతే పోలీసువారు తోలుకుపోవాలిగాని అట్లా బావ బాదుతూ తోలుకొని పోవటానికి మీకేమి పని, మీరు తోలుకొని పోవటానికి వీలు లేదు అని అన్నారు. అంతట రైతులపై లాఠీ చార్జీకి ఉత్తర్వు లివ్వబడ్డవి.

పోలీసులతోపాటు ఎస్టేటు నౌకరులుకూడా రైతులపై కర్రలతో కొట్టారు. క్రిందబడ్డవారిని కాళ్లుపట్టుకొని ఈడ్చారు.

ఈ లాఠీచార్జిలో పోలీసుల లాఠీలు విరిగిపోయినై, కర్రలచివర ఇత్తడి పొన్నులు కూడా పగిలిపోయినై. అట్టి పగిలిపోయిన యిత్తడి పన్నులు కొన్ని దొరకగా రైతులు నాకు తెచ్చి చూపించారు.

ఈ లాఠీచార్జికి షుమారు 50 మంది వరకు గురి అయ్యారు ఇందులో మిక్కిలి వృద్ధులు కూడా ఉన్నారు. ఒక వృద్ధుని చేతివ్రేలు తెగిపోయింది. కొందరికి రొమ్ములమీదను, తలమీదను, కణతలమీదను కూడా బలమైన దెబ్బలు తగిలినవి.

మొదట అరెస్టయిన 9 మందినీ గాక లాఠీ చార్జీ అనంతరం దెబ్బలుతిని పడిపోయినవారిని మరి 23 గురిని అరెస్టు చేసారు.

రైతుల సంరక్షణకై పూనుకున్న కాంగ్రెసు ప్రభుత్వం హయాములోనే ఇట్టి దారుణమైన లాఠీచార్జీలు జరుగుచుండుట చూచి ప్రజలు విస్మయం పొందుతున్నారు.

పోలీసు మద్దతుతో జప్తులుకూడా ప్రారంభమైనాయి.

రైతుల పట్టుదల

రైతులుమాత్రం తమ హక్కులు సంరక్షించుకోడానికీ, లోకానికి ప్రభుత్వానికి తాము చిరకాలంగా అనుభవిస్తున్న అమానుష యమయాతనలను తెలియపరచడానికీ, సత్యాగ్రహానికి పూనుకున్నారు.

ప్రభుత్వమునూ శాసనసభ్యులున్నూ గత 30 సంవత్సరాలనుండి మునగాల రైతులు పడుచున్న ఘోరమైన బాధలను యిప్పటికైనా గుర్తించి వెంటనే చర్యతీసికొని తగిన పరిహార మిప్పించవలసిందని ప్రార్థించుచున్నాను.

మునగాల సత్యాగ్రహం

కృష్ణాజిల్లా మహిళా సంఘాధ్యక్షురాలు సీతామహాలక్ష్మమ్మగారూ, కృష్ణాజిల్లా యువజన సంఘ ప్రధాన కార్యదర్శి రాజగోపాలరావుగారూ యీక్రింది సంయుక్త ప్రకటన గావిస్తున్నారు.

ఎన్నిరోజులనుంచో మునగాల పరగణాలోని రైతులు జమీందారు నిర్దాక్షిణ్యంగా కావించే అత్యాచారాలకు బలి అవుతూవచ్చారు. మానవులుగా పరిగణింపబడక పశుతుల్యులుగా చూడబడుతున్నా, దారీ తెన్నూలేక అలాగే ఉండిపోయారు. సుమారు ఒక సంవత్సరం నుంచీ తమ కష్టాలు గట్టెక్కించుకొనేందుకు జమీన్ రైతు సంఘం ద్వారా తీవ్రముగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని ప్రతిఘటించటానికి జమీందారూ, పోలీసులూ ఏకమై అయి రైతులమీద కేసులూ వగైరా బనాయించి అనేక నష్టాలు కల్గించారు. రైతులు తగాదాలు లేకుండా ఉండాలని మధ్యవర్తి పరిష్కారానికి అంగీకరించారు. ఏదోవిధంగా సర్దుకొందామని తమకు నష్టదాయకమైన షరతులకుకూడా అంగీకరించారు. ఐనా జమీందారుగారు మాత్రము మామూలు వ్యవహారమే. ఆయన రాజీకి వ్యతిరేకంగా పనిచేశారు. రైతులు విధిలేక తమ కనీసకోర్కెల్ని నెరవేర్చుకొనేందుకు చిట్టచివరి ఆయుధమైన సత్యాగ్రహాన్ని ప్రయోగించారు. శాంతియుతమైన పద్ధతుల ద్వారానే సత్యాగ్రహము సాగించబడుతోంది. ఐనా జమీందారుకి పోలీసుల అండ, తోడ్పాటు అధికంగా ఉంటంవల్ల లాఠీచార్జీలూ, అరెస్టులూ పోలీసుల దారుణచర్యలూ అధికంగా సాగినాయి. అనేకమందికి దెబ్బలు తగిలినట్టూ, పోలీసులు జాతీయ పతాకమును అవమానపర్చినటూ, వందలాది అరెస్టు లవుతున్నట్టూ పత్రికల్లో చూచేఉంటారు. కాంగ్రెసు ప్రభుత్వ హయాములో కూడా ఇలాంటి దారుణచర్యలు సాగటం స్వాతంత్ర్య కాంక్షులకు, కాంగ్రెసు సేవకులకు తీరని అవమానం. యీ సత్యాగ్రహాన్ని జయప్రదమొనర్చి మునగాల రైతుల కష్టాల్ని నివారించాల్సిన బాధ్యత, మునగాల రైతులకు కాస్త కూడు గుడ్డా కల్గించాల్సిన బాధ్యత, మునగాల రైతుల్నికూడ మానవుల వలె గుర్తించేటట్టు చేయాల్సిన బాధ్యత, మన జిల్లాలోని యువజనుల మీదా, సోదరీమణుల మీద ఉంది. ఈ సత్యాగ్రహాన్ని జయప్రదం కావించేందుకు కృష్ణా జిల్లాలోని యువతీయువకులు తీవ్రంగా ప్రయత్నించాలి. ఊరూరా సభలు జరిపి జిల్లాలోని ప్రజలకు మునగాల రైతుల సత్యాగ్రహ చరిత్రను, దైనందిన కష్టాలనూ, బానిసత్వాన్నీ, బాధలనూ విశదీకరించి ఉద్యమానికి ఆర్థికంగాను, నైతికంగాను బలం కలిగించాలి.

వీరత్వంలోను, త్యాగంలోను, ధైర్యంలోను దేశ సేవలోను ఇతరులకు వెనుదీయని కృష్ణా జిల్లాలోని యువజనులు, సోదరీమణులు, జమీందారీ నిరంకుశత్వాన్ని, పోలీసుల అత్యాచారాలను అరికట్టేందుకు, సత్యాగ్రహోద్యమం జయం కాంచేందుకు, సంపూర్ణ సహాయం చేయాల్సిందని కోరుతున్నాము. సత్యాగ్రహ సమరాన్ని చక్కని పద్ధతులమీద నడిపి బలపత్తరం కావించుటకు, యువజనులూ, మహిళామణులూ దళములు దళములుగా బయల్దేరి ఆందోళన చేయవలసిందని కోరుతున్నాము.

పల్లెటూరి కవులు: భారతదేశ విప్లవం

కామ్రేడ్ అహమ్మద్ ఆలీ

[పల్లెటూరి కవి సమ్మేళనం 14—15, మే, 1938 లో పంజాబులో జరిగింది. సంవత్సరం పైగా అయినా, స్వారస్యం కోల్పోదు గనుక ఈ వ్యాసాన్ని 'న్యూ ఏజ్' (మే 1939) నుండి అనువదించి ప్రకటించుతున్నాం. సారస్వత ప్రియులంతా గ్రహించాల్సిన విషయాలనేకం ఉన్నాయి దీనిలో—సం.]

ఈ సంవత్సరంలో ఇంత ఎండ కాచిన రోజులేదు. ఆకాశమంతా మండిపోతున్న ఇసకా, దుమ్మూ కమ్మివేసింది. మేనెలలో గాలిదుమ్ము వచ్చేముందు ఎఱ్ఱబడ్డట్లు ఆకాశం ఎఱ్ఱబడింది. తుఫాను మరుసటిరోజున రానే వచ్చింది మహావేగంతో. కళ్లన్నీ దుమ్ముతో మూతలుపడ్డాయి. చెట్లు తలక్రిందులుగా వ్రాలాయి.

ఎండవేడిమివల్ల 2 గంటలు ఆలస్యమయినది ఫరీదాబాద్ వెళ్లడానికి. అక్కడే మహాసభ జరిగేది.

మేము సాయంత్రం 6½ కు బయలుదేరే సరికి వాతావరణం అంతా పసుపు ఇసుకతో నిండిపోయుంది. అల్యూమినం డిస్కులాగా ఆకాశంమీద సూర్యుడు వ్రేలాడుతున్నాడు. ఎండవేడిమి ఇంకా తీక్షణంగా ఉంది.

మా కారు తారురోడ్డుమీద గంటకు 50, 60 మైళ్ల వేగంతో పోతోంది. మా కిరుప్రక్కలా ఢిల్లీ ఔన్నత్యాన్ని తెలియజేసే శిధిలాలు పడి ఉన్నాయి. ఖూనీదర్వాజా దాటాం. ఇక్కడే మొగల్‌రాజ వంశీకులలో చిట్టచివరివారైన బహదర్‌షా కొడుకులను 1857 లో బ్రిటిషు సైనికులు హత్యచేశారు. ఖూనీదర్వాజా దాటి 1354 లో ఫెరోజ్‌షా నిర్మించిన కోటవద్దకు వచ్చాం. ఇంకా ఆ ఉన్నత కుడ్యాలు అలాగే నిలిచిఉన్నాయి. సాయంకాలం కాస్త మంచి గాలి మేద్దామని వందలకొలది ప్రజలు అక్కడికి చేరుతుంటారు.

అనేక శిధిలాలు-పాత కోటలు-పట్టణాలు రాజుల గోరీలు-ఎన్నో దాటిపోతున్నాం. ఒక్కసారి గత చరిత్ర అంతా జ్ఞాపకం వచ్చింది. సప్తసామ్రాజ్యాధిపతుల పతనమూ, ఉన్నతీ. మహాభారత యుద్ధానంతరం యుధిష్ఠర మహారాజు క్రీ. శ. పూర్వం 1450 లో ఈ నగరాన్ని నిర్మించడమూ, యివన్నీ జ్ఞప్తికి వచ్చాయి.

గుజార్సు కట్టి నివసించిన కోటలు గల గ్రామాలూ, ఎన్నో కథలుచెప్పే ప్రాచీన శిధిలాలూ, దాటి ఢిల్లీకి 21 మైళ్లల్లో ఉన్న ఫరీదాబాద్ చేరాం. ఇది చాలా పురాతన గ్రామం. మట్టి గోడలు, రాతిగోడలు కల ఇండ్లు మధ్య తరగతివారివి ఉన్నాయి. కాని అధిక సంఖ్యాకులు గ్రామవాసులు. గుడిసెలలో—మట్టి అలికిన తడికెలే ఇంటికప్పు గల గుడిసెలలోనే ఎక్కువమంది నివశించుతారు. అది ఒక మార్కెటు ఉన్న పట్టణమే గాకుండా, రంగుల వేయడానికి దేశమంతా ప్రసిద్ధి చెందిన పట్టణం. పైగా రెండు పిండిమరలున్నాయని గర్వపడుతుంది. ఆ పట్టణం, ఇవి లేకపోతే ఆధునిక నాగరిక లక్షణాలే కన్పించవు. ఇంకా పాతరకపు మట్టి దీపాలే గుడిసెలలో వెలుగుతుంటాయి. మురికి ఇరుకు సందులలోను, వీధులలోను కిరసనాయిలు దీపాలే వెలుగుతాయి. ఇవి గాక చిన్న హాస్పిటలూ, స్కూలూ ఉన్నాయి. పోలీసు స్టేషను సరేసరి. మాకు విప్లవ ఎత్తి కవిత్వంమాద సాయుధ విప్లవం. కావిస్తామని

కాబోలు పంజాబు ప్రభుత్వం ఒక డెప్యూటీ సూపరింటెండెంట్‌ను మా గౌరవార్థంగా పంపింది. ఇద్దరు పోలీసు రిపోర్టర్లనుకూడా పంపారు మేము ఉచ్చరించినమాటల్లా వ్రాసికోడానికి. ఎందుకంటే మేము, కనీసం మాలో కొందరు (నా మిత్రుడు సజ్జద్ జహీర్, నేనూ బ్రిటిషు ప్రభుత్వం నాకూ ఆ గౌరవం దయచేసింది) అపాయకరమైన విప్లవకారులమనీ, లెక్క. ఇంతేగాదు 'ప్రజా రక్షణకోసం' మా పైన కావలా వేశారు. గనుక మేము దేశానికి శత్రువులంకూడా. కాని మేం విన తటస్థించిన ఒక గ్రామ కవి వాక్యాలలో

"గతాన్ని మఱచిపో
తర్వాత జరిగిన ఘటనలను విను"

గ్రామకవులు పాటల్నీ—పురాణ (ఎపిక్)ల్నీ అనాదినుండీ వ్రాస్తున్నారు. మానవుడు భాషను కనిపెట్టిన నాటినుండీ హిందూదేశంలో ఈపురాణాలు వ్రాయటం వరుసగా వచ్చింది. ఒక్క హిందూదేశములోనే తరతరాలనుండీ వచ్చిన ఆ పురాణాలు నేటివరకూ గ్రామాలలో బ్రదికి వుండటం, ఇంకా ఆకవిత్వధోరణి గ్రామాలలో ఉండడం, చూస్తున్నాం.

కవిత్వపు పోటీలు పూర్వకాలం ఉంటూ ఉండేవి. ఇంకా ఇప్పటికీ జరుగుచున్నాయి. ప్రపంచ కవిత్వ చరిత్రలో ఇది అనన్యవిశేషం. (ఫినోమినా) పట్టణాలలో వాటిని 'ముషైరా' లంటారు. పారంపర్యంగా వస్తున్న జ్యోతిని ఒక కవినుండి మరొక కవి అందిస్తాడు. కవి 'గజల్' చదువుతుంటాడు. 'గజల్' వ్రాయడం చాల కష్టమైన కళ. గత శతాబ్దంలోని కవులు ఈకళను పెంపొందించారు. ఇప్పుడిది చప్పబడిపోయింది. కారణం ప్రాచీన చిహ్నాలను, విగ్రహాలను పదేపదే ఉపయోగించడం; దుర్వినియోగం చేయడం. పర్షియన్ భాషనుండి ఇవి అనుకరించబడినాయి. ('గజల్' కూడా 'పర్షియనే') ఉపమానాలు, రూపకాలంకారాలు వాటిలోనుండే సౌకుమార్యం, క్రొత్తదనము పోగొట్టుకొని, పేలవమయిపోయాయి. అది రాజ సభలకు, ప్రభువుల దర్బార్ లకు పనికివచ్చేకళ. 'ఘలిబ్' లేక 'మీర్' ఈకళలో అందరినీ మించుతాడు. ఈనాటికికూడా మన కున్నవారిలో 'ఘలిబే' గొప్పకవి—కాని ప్రస్తుతం, క్లిష్టమైన భావోద్రేకాలనూ, కవిత్వావసరాలనూ, వెల్లడించడానికి మరోవస్తువుకావాలి. ఎందువల్లనంటే 'గజల్' భావనను అరికట్టుతుంది. ఇంకా జీవితానికి అది చాలదూరమైపోయింది. (ఇపుడూ, పూర్వంకూడా) ఇంతేగాక, అరెండు చరణాల ('షేర్')లోనే మన భావవిహారానికి స్థలం చాలదు.

కాని కవిత్వ సాంప్రదాయం ఇంకా క్రొత్తగాను, సజీవంగాను ఉన్నది ఎందుకంటే పల్లెటూరి కవి, గ్రామ జీవితాన్నుండి విడిపోలేదు. అతని జీవిత బాధలు దుఃఖాలు ఆనందాలు, ఉత్సాహాలు [illegible] కవిత్వ [illegible]

కవిత్వ సాంప్రదాయం, వ్యక్తిగతం గాక, యావత్ సంఘానికీ, సమిష్టిగానూ, ఉండేది. అంటే పల్లెటూరి కవి ఒక వ్యక్తిగతంగా తన వివారాలు ఆవేదనలు గాక, యావత్ సంఘమూ హర్షించేటట్లు, పాడేటట్లు, సమిష్టిగా కవి భావోద్రేకతలో భాగం పంచుకొనేటట్లు వ్రాస్తాడు. ఇదిగో చూడండి. ఇక్కడ గొప్ప గొప్ప జాతీయ యుద్ధాలను గురించిన పురాణాలు మనకు తగులుతాయి. ఇక్కడ అమరత్వం చెందిన మహా వీడలు, ప్రేమికుల చరిత్రలు తగులుతాయి. ఇచట హృదయాల్ని కదల్చివైచే యాలపాటలు కన్పిస్తాయి. సూదులలాగు గుచ్చుకొనే హాస్య కవిత్వం కనిపిస్తుంది. ప్రణయ కవిత్వం—ప్రపంచంలో కల్లా మృదువైన సున్నితమైన కవిత—గోచరిస్తుంది. కాని వీటిలో ఏదిచూచినా వ్యక్తిగతమైన ఆవేదనలుగాని, విచిత్ర వైఖరులుగాని ఉండవు. కవిత అంతా సమిష్టి రూపకమైంది.

గ్రామాలలో జరిగే పోటీలు పట్టణాలలాంటివి గావు. పట్టణాలలో 'ముషైరా'లు జరుగుతాయి. ఒక రకపు ఛందస్సు ఇచ్చి దానిలో పద్యాలను వ్రాయమంటారు. అదీ కష్టమే మనం తలచుకుంటే. కాని గ్రామాలలో భజనలు—'అస్లా'లు చదువుతారు. దానికి వాయిద్యవిశేషాలుంటాయి—ఈరోజుల్లో హార్మోనియం ఉంటుంది. ఇక కవిని చూద్దామా, మోటు రైతు మురికితలగుడ్డ, తుఱచధోవతి, చిన్నచొక్కా, నిలుచుంటాడు, గొంతుసవరిస్తాడు, కవితతో తన పాట ప్రారంభిస్తాడు 'కవిత' అంటే, శతాబ్దాలనుండి, సంవత్సరాలకొలది వచ్చ కష్టజీవితం యొక్క అనుభవమునూ, జ్ఞానాన్ని పద్యరూపంలో ప్రతిబింబింప జేసిన ప్రవేశిక అన్నమాట. ఇది ఆయాక, పద్యాలు మొదలెడతాడు. అప్పుడప్పుడు వాటికి వచనంలో, వ్యాఖ్యచేస్తాడు. పురాణాలనుండీ; దైనిక జీవితానుభవంనుండి ఉదాహరణలు విశదీకరిస్తూ విమర్శిస్తాడు.

ఈ కవులు — అతి వినయతతో ప్రారంభిస్తారు. ఈ వినయత ఇండియాకు-వైనాకు, ప్రత్యేకంగా ఉన్నది. మొదట్లో ప్రేక్షకులను, తమ తప్పుల్నీ, పాండిత్యం లేకపోవడాన్నీ క్షమించమనీ—దోషాలనుసవరించమనీ (హంస నీరక్షీర న్యాయం) ప్రార్థిస్తారు. సాధారణంగా మామూలు సభలైతే—మా కాన్ఫరెన్సులాగా—చాలా దూరప్రదేశాలనుండి తమ కవిత్వాన్ని వినిపించడానికి వచ్చినప్పుడు, ప్రజలూ, ఇతర కవులూ మొదటనుండి చివరదాకా నిశ్శబ్దంగా వింటారు. కాని తరుమగా పోటీలలో ఒక కవి కేచి మరొకవిని, అతని పద్యాలకు ఆధారాలు చూపమనో, ఛందోబద్ధమని నిరూపించమనో, సవాలుచేస్తాడు. అపుడు తాను అప్పటికప్పుడు వైపద్యపు భావంతోనే మరొక పద్యం కొంత వ్రాసి దాన్ని పూర్తిచేయమంటాడు. కవి ఆనవాల అంగీకరించి సమాధానం ఇస్తాడు. తాను మళ్ళు ఆనవాల చేసినవానిని తనపద్యం అప్పిన మాటలమంది కథ పూర్తిచేయమని అడుగుతాడు.

ఇది కొంత వాదోపవాదాలలో గడుస్తుంది. ఉదాహరణకు ఒక పోటీలో, ఆకాశం ఎలా నిర్మింపబడింది, అనే విషయంపైన వాదవివాదాలు చెలరేగాయి. తర్కం రోజులకొలది జరిగింది. అలాంటి పోటీలు ఒక్కొక్కప్పుడు నెలలు కొలది వడుతాయి. అయినా ప్రజలు కూర్చుని వినడానికి విసుగు చెందరు. సాధారణంగా ఈ తగాదాలు ఒక్కొక్కరి మధ్యనే ఉండవు. కవులు రెండేసి ముఠాలుగా చీలిపోతారు. ఇలాంటి పరిస్థితు లేర్పడినపుడు గ్రామమంతా ఉడుకెత్తి పోతుంది. సాయంకాలం ఎపుడవుతుందా అని కనిపెట్టుక కూర్చుంటారు. ఒక్కొక్కప్పుడు దగ్గరగా ఉన్న ఇతర గ్రామప్రజలు కూడా ఆకర్షింపబడతారు.

సాధారణంగా వసంత ఋతువులో ప్రతి గ్రామంలోను, ఈ కవిత్వపు పోటీలు జరుగుతుంటాయి. మన దేశంలో ఇది చాల అందమైన కాలం అని వేరే చెప్పనక్కర లేదు. వర్ష ఋతువు అప్పుడే నెలవుతీసుకొంటుంది. ప్రతిచోటా ఒకవిధమైనశోభ, అందమూ కన్పిస్తుంది. నవవికసిత కుసుమ సుగంధంతో వాయువు నిండిపోతుంది వసంత కన్యకి పచ్చనిచీరలు తొడిగే చెట్లపైనా, పొదలపైనా పక్షులు కిలకిలారావం సల్పుతాయి. నీలిమాకాశం వింత శోభతో విరాజిల్లుతుంది. మైళ్ళకొలది — మన కనుచూపుమేర వరకు—ఆకుపచ్చని ఆవపూలు పొలాలలో, గాలిలో ఆడుతుంటూ, ఊగుతుంటూ కన్పిస్తాయి. వసంతఋతువు—ఈమాట వినగానే సౌఖ్యంతో సంతోషంతో ప్రతివాడూ గంతులేస్తాడు. వసంతపంచమి పండుగనాడు—స్త్రీలూ పురుషులూ పసుపుబట్టల ధరిస్తారు. స్త్రీలు నదులకు పవిత్ర స్నానాలకుపోతారు. గుంపులు గుంపులు పాడుతూపోతుంటే, వారి కిన్నెరస్వరాలతో ప్రకృతి పులకించిపోతుంది. వసంత ఋతువు—ప్రతివాడూ కవిత్వంతో, ప్రేమగానంలో—తన్మయుడైపోతాడు.

ఇట్టి వాతావరణంలో—వసంతఋతువులో కవిత్వపు పోటీలు జరుగుతాయి. ఎందుకంటే. గర్వదరిద్రుడు, పీడితుడూ అగు రైతుకు—గంటలకొలదీఫలరహితమైనకఠినశ్రమ చేస్తున్న రైతుకు—"సతోకీ" చెప్పినట్లు కష్టపడేవాళ్ళు, కడుపుచిచ్చుతో చస్తున్నా—ఇలాంటి రైతులకు—ఈ పోటీలే కాస్త విశ్రాంతినిస్తాయి.

యావత్‌గ్రామమూ ఏదోఒక బహిరంగ ప్రదేశంలో చేరుతుంది. మద్దెల, హార్మోనియం, తాంబుర మొదలైన వాయిద్యాలుకూడా ఉంటాయి. పురాణాలు, యాలపాటలు, ప్రేమ గీతాలు కవులు పాడుతుంటారు. స్త్రీలు, రంగు రంగుల చీరెలు—అందమైన చీరలు ధరించి చేతితో వాసపుకర్రలు పట్టుకొని వస్తారు. దేవర (ధర్తసోనుడు) అను వేగాకోళంతో పిలిస్తూ నృత్యంచేస్తారు. ఈ పోటీలలో 10 ఏండ్ల క్రిందట పాల్గొనేటప్పుడు నెత్తిన ముసుగు (పర్దా) ఉండేదికాదు. కవులు పాడుతుంటే, పాటకు దగిన ఆట ఆడేవారు. ఉపవాలలో, కవుల

పల్లెటూరి పడుచులను, (ముసలి స్త్రీలను కూడా) కొంటెగా ఏదన్నా అనేవారు. వారలా హాస్యమాడేందుకు స్వాతంత్ర్యం ఉండేది. దానికి ఆ స్త్రీ, కవి ఎప్పుడైనా తప్పునడిచితే, తనచేతిలో ఉన్న కర్రతో బాదుతుంది. ఇలా బదులు తీర్చుకొంటుంది.

నేడుకూడా ఈ పోటీలలో స్త్రీలు పాల్గొంటున్నారు. కాని, నేను వారి ముఖాలు కాన్పించకుండా ముసుగులున్నాయి. ఆర్యసమాజ ఉద్యమం వృద్ధికాగానే, గ్రామగ్రామాలకు వెళ్లి (ఇస్లాం మనస్సులో పెట్టుకొని) మతావేశంతో 'పర్దా' వలని లాభాలు బోధించసాగారు. ఐనా ఇంకా స్త్రీలు స్వతంత్రులే, కర్రలతోవచ్చి నిలబడతారు. ఒక్కొక్కరే నృత్యం చేస్తారు. ఇక్కడే అనేక ప్రేమ ఘటనలు జరుగుతాయి. ఈ పోటీలలోనే అనేక ప్రేమ గీతాలు పుట్టుకొన్నాయి. ఇక్కడ కవులు తమ ప్రతిభను కనబరుస్తారు. స్త్రీలు తమ నాట్యంద్వారా కవుల్ని ఎత్తిపొడిచి బదులు తీర్చుకొంటారు. అంటే దాని అర్థం స్త్రీలు పాటలువ్రాయలేరని, పాటల ద్వారా హాస్యం వెళ్ళగక్కలేరనీ అర్థంకాదు. చాలామంది స్త్రీలు కవిత వ్రాస్తారు. వాళ్ళు గుంపులు గుంపులుగా కూర్చుని పాడేటప్పుడు పురుషుల్ని ఎగతాళి చేస్తారు. దానికి పురుషులు జవాబు చెప్పాలి.

కాని ఈ ఆచారం మైదాన భూములలోని గ్రామాలలో రెగ్యులర్‌గా లేదు. కాని పర్వత ప్రదేశాలలో ఇది సర్వసాధారణం. ఒకసారి సిమ్లా పర్వతాలలో దాక్కొని, ఇది వినగల్గాను. ఒకసారి నా పోర్టరూ, పర్వతాలలో ఎక్కడో దాక్కొన్న ఒక స్త్రీ ప్రేమగీతాలు (డైలగ్) పాడసాగారు. సిమ్లా పర్వత ప్రజలకు సంగీతం అంటే ఇష్టమే గాక, హాయిగొల్పే కంఠం కూడా ఉంది. కొండ లోయలలో సూర్యాస్తమ సమయంలో ప్రతిధ్వనించి నెమ్మది నెమ్మదిగా లీనమైపోయేవారి పాటలను వినడం ఎంతో అదృష్టమే.

ఒక చెట్టు నీడక్రింద కూర్చొన్నాం విశ్రాంతి కోసం పైన ఎక్కడో ఒక స్త్రీ కిన్నెర స్వనం హఠాత్తుగా వినపడింది. పాటగా మారింది. మొదటిచరణం పూర్తిఅయి క్రమంగా ఆమె స్వనం అంతరించినపుడు, మాపోర్టర్ క్రిందనుండి అందుకున్నాడు. ఇతడాగగానే ఆమె పైనుంచి మరోచరణం అందుకొంది. ఆవిధంగా ఒక్క అరగంట గడిచింది. ఒకమధుర ధ్వని వాయువులో విహరించి ఎక్కడో దూరాన కొండ లోయలలో అస్తమించినపుడు మరో మృదుధ్వని అవస్పని పర్వతభాగాల నుండి బయలుదేరి గాలిలో రెక్కలు గట్టుకొని ఎగిరి ప్రతిధ్వనిస్తుంది. అది పురుషుని కన్నీళ్ళతో ముగిసింది. పురుషుని—స్త్రీ—ఆహ్వానించడం....

ఈ గాయకులకూ (ఇతరుల గీతాలను మాత్రమే చదువగల్గిన గాయకులు కొందరుంటారు—కాని చాలమంది కవులుకూడా) కవులకూ, అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉంటుంది. వేలకొలది చరణాలు కంఠతావచ్చు. వీరికి ఇంతేగాక అందరూ చక్కగా పాడతారు. పాడటంవలన వినుగు చెందరు. ఎక్కువ శ్లోకశక్తిగల పట్టణ కవులకున్న అహంభావం వీరికుండదు. పట్టి అమాయకులు. వాళ్ల టెక్కులు విరిచి ప్రదికేరైతులు. అందుకని ఎప్పుడూ వాస్తవికత (రియాలిటీ) పైన ఒకకన్ను ఉంటుంది. వారిభావన అంతా పైనందిన జీవితాన్నుండీ, హిందూకథల, పురాణాలనుండీ పుట్టుకొస్తుంది. వాళ్ళముఖాలలో ఎక్కడైనా

"కవి" లక్షణాలు కన్పిస్తాయేమోనని వృధాగా ప్రయత్నించాను వాళ్లు చాలా సాధారణంగా, పల్లెటూరి అమాయకులుగా కన్పించుతారు. మా కాన్ఫరెన్సువద్ద కూడా అలాంటి వారున్నారు. వాళ్లకళ్లలో ఏదోరసం ఉట్టిపడుతూ ఉన్నట్లుండాలని ప్రయత్నిస్తారు. వాళ్ళకన్నుమత్తు చెందినవాడి చూపులా ఒకవింత భావాన్ని ప్రకటిస్తుంటాయి. జుట్టుపొడుగ్గా ఉంటుంది, బాగా నూనెపూస్తారు. వారి ధోరణిలో కొంచెం స్త్రీత్వం ఉంటుంది. ఏమాత్రం అన్నా నొచ్చుకుంటారు. శాలువాలు కప్పుకొని వారుత్సాహముగా కన్పడుతుంటారు.

కాని ఈ పల్లెటూరి కవిలో ఎంత వెదకినా 'ఈస్తటిక్' లక్షణాలు కన్పించవు. అతడు పట్టి రైతు. అమాయక శిశువులాగా తనను గురించి కవిత్వంగాని, గాలిలో మేడలు కట్టడం గానీ ఎరగడు. పొలంలో కష్టపడి పనిచేస్తాడు. అతనికి విశ్రాంతి అపుడపుడు కబుర్లు చెప్పుకోడంలోనూ, రాత్రిళ్లు, పోటీలలో పాల్గొనడంలోను ఉంటుంది. ఆ విధంగా ఇతరుల కష్టసుఖాలను పంచుకొంటూ ఉంటాడు. అతడు జీవిత కార్యాచరణల మధ్య బ్రదుకుతూ ఉంటాడు. కాబట్టి మన బూర్జువా రచయితలలో చాలమందివలెనాస్తవంగాని వాటిపై వ్యామోహమూ, పిచ్చిపిచ్చి కలలుగనటమూ లేని, సజీవమైన నూతన కవిత్వం అతనిది.

★ ★ ★

ఇలాంటి పల్లెటూరి కవుల సమావేశాన్ని సంఘటిత మొనర్చడం హిందూదేశ చరిత్రలో ఇది మొదటిసారి.

1936 ఫిబ్రవరిలో మేము సంఘటిత పఱచిన "ప్రోగ్రెసివ్ రైటర్ల"సంఘం దానికి దారితీసింది. మా ప్రోత్సాహంవల్ల 'సయ్యద్ అబ్దుల్ ముత్తాలిబ్' కార్యభారం నెత్తిన వేసుకొన్నాడు. సయ్యద్ రచయిత, కవి. ఉర్దూలో, గ్రామ్య ఏదాలలో కూడ వ్రాయగలడు. సోషలిస్టుకూడా.

అప్పుడే సూర్యుడస్తమించుచున్నాడు. సభాస్థలం ఎక్కడో అడుగుతూ ఒక స్కూలుకు చేరాం. అక్కడే 'శామియానా' (చాందినీ) క్రింద సభ జరుగుతుంది. అతిధులు కూర్చుంటానికి ఒక 'తక్తా' ఉంది. ప్రేక్షకులకు నేలపైన దుప్పట్లుపరచారు.

మేము—సయ్యద్‌జహీర్ (యువకసోషలిస్టు నాయకుడు) యస్. యం. ఓయాం (పెయింటర్) నేనూ, ఇంకా ఇద్దరూ—వెళ్ళేసరికి మహాసభ ప్రారంభమయింది. సభకు అధ్యక్షుడు పండిట్ సతోకిశర్మ, ముత్రాజిల్లా నివాసి. భూమిపుత్రా లేని రైతు బిడ్డ, చాక్‌లెట్ రంగు ఖద్దరుచొక్కా, గాంధిటోపీ, ధోవతీ అతని వేషం. మేం వెళ్లేసరికి అతని అధ్యక్షోపన్యాసం పూర్తికావచ్చింది. సన్నటి ముఖం వర్ణించరాని బాధతోగూడి ప్రకాశిస్తున్న కళ్లు. అతని కళ్లల్లోకి చూడగానే ఒక దుఃఖమయ ప్రపంచం మన కళ్లెదుట కన్పడుతుంది దాని నుండి తప్పించుకోడం కష్టం. అతడు గ్రామ్యభాషలో మాట్లాడాడు. మాట్లాడేటప్పుడు అతని కొక్కిరిపండ్లు కత్తిరింపు మీసాలగుండా కన్పడేవి. అతని పదాలు చాల సులభంగా ఉండేవి ఎక్కువ అలంకారాలులేవు. అతని వాదనలు కూడా చాల స్వాభావికంగా ఉండేవి. అతని ఉపన్యాసం ఒకదానినుండి ఇంకొందానికి పరుగెత్తుతున్నది. కాని అది వాళ్ళహృదయానికి అందుతుంది.

బ్రిటిషు ప్రభుత్వం నాల్గుకోట్లమీద నిలబడి ఉన్నదని శర్మ చెప్పాడు. ఒకటి వర్తకం. ఈ విషయంమీద ఉదాహరణ పూర్వకంగా చెప్పి, బ్రిటిషు వస్తువుల్ని, విదేశీ బట్టలను బహిష్కరించమని చెప్పాడు. రెండవ కాలు ఇంగ్లీషు భాషట. దానిని చదవవద్దన్నాడు. మూడవపాదం "ప్రభుత్వోద్యోగం". నౌకరీలిచ్చి లాలించి మనల్ని బానిసత్వంలో నుంచారు. ఉద్యోగం చేయడం బానిసత్వం.

"మనం 35 కోట్లమంది ప్రజలం. ఇంగ్లీషువాళ్ళు ఒక లక్షమంది. మనం అందరమూ ఉచ్చపోసామా వాళ్లు దానిలో కొట్టుకుపోతారు. కాని అధైర్యమేది; ఆసాహసం ఎక్కడ, మనం ఇంగ్లీషు స్కూళ్ళకుపోయి, కాస్త చదువునేర్చుకొని, ఏదో ఉద్యోగం సంపాదించి శాశ్వతంగా బానిసలమవుతామాయే మనం ఈ విదేశస్థులతో — శత్రువులతో సహకారం చేయరాదు" అని అన్నాడు. ఆ ఉపన్యాస ఉద్రేకంలో నాల్గోకాలు ఎక్కడో ఎగిరిపోయింది. ఆలస్యమవుతూ ఉండడంవల్ల, అర్జన్జెరు, సతోకిని ఆపమని అడిగాడు. తొందరగా అతడు ఉపన్యాసం ముగించాడు. కాని అతని ఉపన్యాసం కొందరికి ద్వేషం కల్గించిందని తర్వాత తెలుసుకొన్నాను. వాళ్లు తమ పాటల్నిపాడ నిరాకరించారు. "మేము జాతీయ పోరాటానికి సహాయంచేయని పనికిమాలిన వారం"అని చెప్పి పాడిచారు.

ఉపన్యాసం తర్వాత సతోకి మంచి అందమైన పద్యం బారహ్ మన్సి (12 నెలల వర్ణన) ఇచ్చాడు. దానిలో ప్రతి నెలా రైతులు ఎలా కిష్టపడేదీ, ప్రతి నెలా గ్రామాలలో ఏ యే పనులలో మున్గి ఉండేదీ, ప్రతి నెలా ఎలా జమీందార్లూ, వర్తకులూ, అప్పులూ, శిస్తులూ అనే పేరిట ఎలా పీడించేదీ, వర్ణించాడు. దానికి గత సంవత్సరం బహుమతి వచ్చిందన్న తర్వాతనాతో చెప్పాడు. 1937 అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిగా ముందు దాని వ్రాశాడు. అది రైతులను గాంధిగారి సలహాను పాటించమని ప్రబోధిస్తూ ప్రారంభింపబడింది. ఆ పద్యం భావం ఇది.

"లే; వీర కర్షకా; లే;
* కృష్ణ ఉపదేశాన్ని గుర్తించి లే;"

★

చైత్రమాసం; జాగృతి చెందు.
మొద్దు నిద్దురలో గుఱకలు పెట్టకు
దొంగలు—బందిపోటు దొంగలు
మన ఇంట్లో జొరపడ్డారు; లే; నిద్రలే;
దొంగలే మన దొరలయారు—వాళ్లకి
దోపిడిచేసే హక్కుందట;
ఇది వారి నీతి; సోదరులారా లెండి; లేవండి;
లే; వీర కర్షకా; లే;

★

వైశాఖ మాసం. పంటకోసేకాలం.
** బ్రాహ్మణ భూమిని లాక్కుంటారు.
భూస్వాములు పంటలాక్కుంటారు.
సీ కన్నీళ్లు ధు [illegible]
సీ శ్రమ ఫలితాన్ని [illegible]
నిలువునా దోపిడి చేస్తారు.
ఒక్క గింజైనా మిగలదు.
ఒక క్షణమైనా శాంతి లేదు.

★ ★ ★ ★ ★

లే; వీర కర్షకా; లే;
కృష్ణ ఉపదేశాన్ని గుర్తించి లే;

[* అర్జునుడు బంధుమిత్రులను చంపవలెనని దీనినపుడు యుద్ధం చేయవలసిన ధర్మాన్ని కృష్ణుడు ఉపదేశించాడు. ధర్మసంస్థాపకులైన గురించి కృష్ణుడుపదేశించాడు. కర్మ సంఫల [illegible] రంలో పాపం లేదంటాడు.

** గ్రామంలోని పెట్టుబడిదారుడు]

అమీనాలు, శిస్తుల చెల్లింపమన ఎలా బాధపెడతారో వర్ణిస్తూ కవి గ్రామజమూనాదిని వస్తాడు. కష్టం బాగా పరిసే మాసం ఇది. గీతా—పఱ సం విన్నాలు ఉల్లసం పుట్టక ఇవన్నీ వర్ణిస్తాడు.

శ్రావణ మాసం.
పడుచుకన్నెలు మధురమైన పాటలు
పాడతారు.
ఉఱుముల, మెఱపుల మధ్య వర్షం
కురుస్తుంది.
నెమళ్లు నృత్యం చేస్తాయి.
సోమరిపందలు-ధనవంతులు-త్రాగితందనాల
త్రొక్కుతారు బంగళాలలో.
పేదలకు కుడువ కూడూ లేదు.
పండ గుడిసా లేదు.
బాధలో—దుఃఖంలో—చక్కని గీతాలుకూడ
మధురంగా ఉండవు.

అని వర్ణించుకుంటూ వచ్చి 'అఘన' మాసాన్ని గురించి ఇలా వ్రాస్తాడు.

వినండి; అఘనమాసం ఇది
జవహర్‌లాల్ మన సహాయానికి వస్తాడు.
అతడు * లక్ష్మణమూర్తి.
మన బాధల తొలగించుతాడు.
భారతదేశం గర్వింపదగిన మహావ్యక్తి.
మాతృభూమి దాస్యశృంఖలాను
తెగగొడతాడు మన అర్జునుడతడు.
ఇప్పటికి ఒక సింహం జన్మించింది;
లేవండి; వీర కర్షకులారా; లేవండి;
కృష్ణ ఉపదేశాన్ని గుర్తించండి;

[* రావణుని నుండి సీతను రక్షించడంలో లక్ష్మణుడు తోడ్పడ్డాడు. అలాగే మన బాధలు తొలగించడానికి సహాయపడతాడని భావం.]

రష్యా ఉదాహరణ చెప్పి, అక్కడ కార్మిక కర్షకులు ఎలా బాధలనుండి విముక్తులయినదీ ఉదహరించి, దాని ననుసరించమని చెబుతాడు, కాంగ్రెసేతరులకు ఓటిచ్చి దానిని పాడుచేయవద్దని-అలా చేస్తే ఎప్పుడో ఒకప్పుడు పశ్చాత్తాపపడవలసి వస్తుందనీ హెచ్చరించాడు. ఆ విధంగా పద్యం పూర్తి అవుతుంది....

నేను మరుసటి రోజున సతోకి శర్మను అతని జీవితాన్నిగురించీ, అతని కవిత్వపు అలా వివారంగా ఎందుకుంటాయనీ అడిగాను. అతని జీవితంకూడా, ఎవరు గుర్తించని అనేక వేలమంది భారతీయుల జీవితంలాంటిదే. అతని జీవితం భారతదేశపు రైతు కష్టాలనూ, సామ్రాజ్యవాదాన్నుండి విముక్తిగాడానికి రైతు కావించవలసిన త్యాగాలను గురించీ తెలియజేస్తుంది.

సతోకిశర్మ 37 ఏండ్ల క్రిందట (ఇప్పటికి 38) ముత్రాజిల్లాలో ఒకచిన్న గ్రామంలో జన్మించాడు. అతని కుటుంబానికి భూమి పుట్రాలేదు. ఒక్క ఎకరమైనా లేదు సాగుచేసుకోనేందుకు. పల్లెటూరి బడిలో నాల్గోక్లాసువరకూ చదివాడు. హిందీలో కాలక్షేపం చేయగలడు. 1921 లో కాంగ్రెసులో చేరాడు. అనాటినుండి తన జీవితాన్ని దేశ స్వాతంత్ర్యానికే వినియోగించాడు. జిల్లా కాంగ్రెస్ కమిటీకి ఇపుడు మెంబరు. ఆయన వార్డు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడు. 1929 లో విదేశ వస్త్రాలపైన పికెటింగుచేసి, కాంగ్రెస్ పతాకాన్ని మోసినందుకు 144 సెక్షను క్రింద, ఆరునెలల కఠినశిక్ష వేశారు. అతని అరెస్టు కాగానే పోలీసు ఇనస్పెక్టరు అతని భార్యవద్దకు వెళ్లి శర్మ [illegible]

"జయప్రద" కు ఆంధ్ర దేశంలో జేజేలు!

స్త్రీలు, పురుషులు, వృద్ధులు, బాలురు వీరు వారననేల? తండోపతండాలుగా ప్రజాప్రవాహం ఘూర్ణిల్లుతోంది!

ఆబాలగోపాలం యీ చిత్రాన్ని చూచి ఆనందించుచున్నారు.



ఎస్. ఎస్. ఆర్. ఫిలిమ్సువారి

★ జయప్రద ★



జూన్ 11 వ తేదీ నుండి

గుంటూరు	శ్రీ కృష్ణా టాకీస్
తెనాలి	శ్రీ వెంకటేశ్వర టాకీస్
రాజమండ్రి	శ్రీ గజలక్ష్మి టాకీస్
కాకినాడ	శ్రీ కృష్ణా టాకీస్
ఏలూరు	సత్యనారాయణ టాకీస్

జూన్ 15వ తేదీనుండి

బెంగుళూరు	మెజెస్టిక్ టాకీస్
విశాఖపట్టణం	సెలెక్టు టాకీస్

★

జూన్ 17వ తేదీనుండి

మచిలీ పట్టణం	బృందావన టాకీస్





బెజవాడలో విడుదల తేదీకై ఎదురు చూడండి

For Bookings: S. S. R. FILMS Ltd., Cuddapah

No. 6 Harington Road, Chetput, Madras.

పల్లెటూరి కవులు: భారత దేశ విప్లవం

(9 వ పేజీ తరువాయి) శర్మ అరెస్టయాడనీ ఆమెమీద పగ తీర్చుకొంటామనీ చెప్పాడు. బట్టలూడదీసి, ఆమె చేతుల్లోంచి చిఱుత ప్రాయపు బాలికను లాక్కొని ఆమె కాళ్ళ ముందు పడవేశాడు. ఆమెను కాంగ్రెసులో పాల్గొనరాదని వాళ్లు ఆర్డరిచ్చారు. కాని ఆమె కాంగ్రెస్ పతాకం మోసి, పోలీసుల ఆర్డరును ధిక్కరించింది. ఆమెను అరెస్టుచేసి ఒక ఇంటిలోపెట్టి, బయటివారి నెవ్వరినీ చూడరాదని నిషేధించారు. సతోకిశర్మ తల్లిదండ్రులు చని పోయి అప్పటికి ఎన్నోరోజులు కాలేదు. 8 రోజులదాకా శర్మభార్యకు తిండీ తిప్పలూ లేవు. క్రోధంతోనూ విచారంతోను చెప్పాడు, పొరుగు వారు గాని, బంధువులు గాని తనకు సహాయం చేయలేదని. "నా భార్యకు సహాయం చేయడానికి ఒక్కడూ ముందుకు రాలేదు." అన్నాడతను. అతని కంఠంలో క్రోధం కన్పిస్తూంది. (అతడు కథ చెపుతున్న సమయంలో మేము గదిలో కూర్చున్నాం. బయట సూర్యుడు దుమ్ములో దాక్కొన్నాడు. దుమ్ము గాలిలో ఎగిరి అంతా క్రమ్మేసింది. గాలిదుమ్ము వచ్చే ముందు ఉండే ప్రశాంతి ఉన్నది. ఆకు కదలడంలేదు. ఊపిరాడటం లేదు. చెమట....) ఒక్క వారం రోజులయాక ఆమెనూ పిల్లనూ జైలుకు తీసుకు వెళ్ళారు. ఆరు నెలల శిక్ష విధించారు.

సతోకి, అతనిభార్యా, జైలునుంచి బయటకురాగానే, అదివరకు కవులుకు తీసుకొన్న కొద్ది భూమికూడా ముక్యా (చిన్న గ్రామ ఉద్యోగి) బ్రిటిషు ప్రభుత్వ సలహా ననుసరించి లాగివేశాడు. పనిదొరికే విధానంలేదు. తినడానికి తిండిలేదు. కాని అదృష్టవశాత్తు అది నాటుమళ్లు దున్నేకాలం. కూలీగా పనిచేసి, రోజుకు మూడణాలు సంపాదించాడు. మళ్ళా వర్షాలు పడగానే పని ఏమీదొరక లేదు. కాని పచ్చిగడ్డి. చిన్న మొక్కలూ మొలకలెత్త సాగాయి. వీటిమీద సతోకి కుటుంబం మూడు నెలలు ఆధారపడింది. తర్వాత మొహమ్మద్ మొహిన్‌ఖాన్–ఒక పెద్ద జమీందారు–భూమిని దున్నుకొనేందుకు ఇచ్చాడు. అతనికింకా కృతజ్ఞత చూపుతాడు సతోకి. తాను ఋణపడి ఉన్నానని అంటాడు. కాని అతని దీనచరిత్ర అంతటితో అంతంకాలేదు కలక్టరు మొహిన్‌ఖాన్‌ను ఆభూమిని తిరిగి తీసుకొమ్మని ఆర్డరిచ్చాడు. మళ్లా భూమిలేని రైతు అయ్యాడు సతోకి.

ఈనాటివరకూ అతనికి భూమి లభించలేదు. యు. పి ప్రధాని (సతోకి యు. పి. నివాసి) పంతుకు తన భూమిని ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం గావించిన ప్రకారం తిరిగి యిమ్మని ప్రార్థించాడు. కాని ఏమీ జరుగలేదు. తనకు తిరిగి లభిస్తుందని ఆశ లేనేలేదని అన్నాడు. ఇంకా గవర్నమెంటుకు వినతులు పంపమని నేనన్నాను. కాని అతనికి–అనేకమంది రైతుల లాగానే–కాంగ్రెసులో విశ్వాసం పోయింది. లాభంలేదన్నాడు. ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని పోరాడగల రైతు కుటుంబంలో పుట్టిన అతను, బీదవాడిని–బంధువుగానీ, నాయకుడు గానీ ఎవరూ సహాయం చేయరని నిట్టూర్పు విడిచాడు. అతని స్వరంలో ఆ విచారం ప్రతిధ్వనించుతోంది. అతని చరిత్ర చెబుతున్నపుడు పీక్కుపోయిన అతని విచారభారనయనాలలో నీళ్లు గిర్రున తిరిగాయి. మా సంభాషణ ముగించే లోపల (అర్జన్జైజరువచ్చి, సతోకిని త్వర పెట్టాడు సభను ప్రారంభించాలని) గాలిదుమ్ము వచ్చి మామీద విరుచుకపడింది. గది అంతా దుమ్ము. వేడిగాలి ఆచెట్లలో బొబ్బలుపెట్టింది. పెద్ద ఆక్రందనం చేసింది. మా తలుపులను దభీమని బాదింది....

నేనింకా కొన్నిప్రశ్నలడిగాను. సతోకి తాను పద్యాల పుస్తకాలమ్ముకొని బ్రతుకుతున్నానని చెప్పాడు. విదేశీయులనుండి, దేశీయ పెట్టుబడిదారులనుండి విముక్తిచెందడానికి: దోపిడి, దుఃఖమూ అంతమ యేందుకు:స్వాతంత్ర్య సందేశాన్ని మోయడమే తన జీవితంలో మిగిలిన ఒకపని అని తెల్పాడు. ఇప్పుడతను సోషలిస్టు. కాంగ్రెస్ వర్కరయినప్పటికీ అతనికి మితవాద పక్షమంటే ఇష్టంలేదు. నాగ్లేండ్ల క్రిందట స్త్రీలను గురించి అతడువ్రాసిన పుస్తకం నిషేధింపబడింది. దానిపై నిషేధం ఇంకా తొలగించలేదు. కాని చాలమందికి ఆపాటలు కంఠతా వచ్చు గ్రామాలలో ఇంకా వాటిని పాడుతూనే ఉంటారు.

పుస్తకాలను ప్రకటించడంలో ఏమైన కష్టాలు కల్గుతున్నాయా అని నేను ప్రశ్నించాను. బ్రిటిషు ప్రభుత్వ భయంవల్ల చాలమంది పబ్లిషర్లు అతని పద్యాలు ప్రకటించ నిరాకరించారట. ఇంతేగాక కేపిటలిస్టులు ఎలా దోపిడి చేసుకొనేదీ తెల్పాడు తనపద్యాలు ప్రకటించుకొని పబ్లిషర్లు తనకు డబ్బు చెల్లించకపోగా. ప్రకటించినందుకు తనను డబ్బడుగుతారట: కాంగ్రెస్ లక్ష్యంకోసమే వ్రాయబడిన అతని పద్యాల్ని యు. పి. కాంగ్రెస్ అధికారులను (మంత్రి వర్గంలో) కొందర్ని ప్రకటించమని అడిగితే వారు తిరస్కరించారట:

ప్రతిచోటా దెబ్బలు తిన్నాడు. అయినా అతను నిరుత్సాహ పడలేదు. దేశస్వాతంత్ర్య పరమావధిని సంపాదించ డానికి, (అతనన్నా అతని పనియన్నా సానుభూతి చూపని) కాంగ్రెస్ పతాకంక్రిందే రాత్రింబవళ్ళు, తనకలాన్ని, కంఠాన్నీ ఉపయోగించి కష్టపడుతున్నాడు....

తుపాను కొంచెం తగ్గింది. గుడ్డసంచి తీసుకొని (దానినిండా చిన్న పద్యాల పుస్తకాలు, కాగితాలూ ఉన్నాయి.) సతోకి మహాసభను ప్రారంభించడానికి పరుగెత్తాడు.

(ఇంకా వుంది)

మునగాల సత్యాగ్రహం తాత్కాలికంగా విరమింపబడ్డది

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ నిర్ణయం

ది 18-6-39 వ తేదీన ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ కార్యనిర్వాహకవర్గ సమావేశము శ్రీ డి. యస్. వల్లభరావుగారి అధ్యక్షతను సమావేశమై ఈక్రింది తీర్మానములు గావించెను.

మునగాల రైతు సత్యాగ్రహము.

1. బ్రహ్మయ్యగారి తీర్పును అతిక్రమించుచూ తదితరంగా అన్యాయమైన నిర్బంధములను రైతు కూలీలకు కల్గించుచున్న మునగాల జమీందారీ అక్రమాలను నిరోధించుచూ, తమ ప్రాథమిక హక్కులను సంరక్షించుకొనుటకై మునగాల రైతు కూలీలు తదితరులు యీ నెల 2 వ తేదీనుండి సత్యాగ్రహోద్యమమందు ప్రదర్శించిన ధైర్య సాహసాలను, చూపెట్టిన త్యాగమును ఈ సంఘం హర్షించుచున్నది.

జైళ్ళకు పంపబడిన,లాఠీదెబ్బలకు గురియైన ఆస్తులు జప్తు చేయబడుచుంటే సహనమును చూపుచుండిన, సంపూర్ణమైన అహింసామార్గమును అవలంబించుచుండిన స్త్రీ పురుషులను ఈ సంఘమువారు అభినందించుచున్నారు.

17-6-39 తేదీన మునగాలకు విచ్చేసిన గౌరవనీయులగు రవిన్యూ మంత్రిగారితో జరిగిన సంభాషణల అనంతరం రైతుల తరపున వెళ్ళిన రాయబారవర్గములోని శ్రీ కామినేని వెంకటప్పయ్యగారు తమ తుదినిర్ణయమును 18 తేదిలోగా తెలియపరచెదమని చెప్పియున్నారు.

ఒడంబడికను జమీన్‌దారు అమలు జరుపుటలేదని ఏప్రియల్ 30 వ తేదీనుండి రైతులు తీర్మానముల ద్వారాను ఉత్తరములద్వారాను తెలియపరచు చున్నప్పటికిని ప్రభుత్వంగాని, కాంగ్రెసు సంఘంగాని, బ్రహ్మయ్యగారుగాని తగినచర్య తీసికొనకపోగా, మేనెల 21 వ తేదీని బెజవాడ జాయింటు మేజస్ట్రేటు జమీందారు ప్రోత్సాహంమీద రైతులు తమ స్వంత ధనముతో కట్టుకున్న రామాపురం పాఠశాల భవనమందు రైతాంగ విద్యాలయమును పెట్టుకోరాదని ప్రజలపైనను ప్రత్యేకముగా 22 వ్యక్తులపైననూ అక్రమంగాను అనవసరముగాను 144 సెక్షనును ఎక్స్‌పార్టీగా ప్రయోగించినందువల్లనే మరితరం చేయునదిలేక మునగాల రైతులు తమ పౌరస్వత్వపు హక్కులను కాపాడుకొనుటకై సత్యాగ్రహమును ప్రారంభించిరి.

అనేక ఏండ్లకు లోనైన ఆ రైతులు జమీందారుచే భగ్నపడుచున్న ఒడంబడికను కూడా అమలు జరిపించుకొనడానికి తమ సత్యాగ్రహమును నక్రమముగానే సాగించుచున్నారు.

అయినను ప్రభుత్వము రైతు రక్షణకై సంపూర్ణమగు కృషిచేయుటకు మరి కొంత వ్యవధి యిచ్చుట మంచిదని అభిప్రాయపడి, యీ సంఘము మునగాల రైతుల సత్యాగ్రహమును 15 రోజులువరకు నిలుపుదలచేయవలసినదిగా మునగాల రైతులకు సలహా యొసగుచున్నది. యీ వ్యవధిలోపల బ్రహ్మయ్యగారి తీర్పు అమలు జరుపుటకు తగిన ఏర్పాట్లు ప్రభుత్వము చేయవలసినదిగా కోరుటకు ఈ క్రిందివారిని రాయబారవర్గముగ నియమించడమైనది.

1. చలసాని వాసుదేవరావుగారు
2. కామినేని వెంకటప్పయ్యగారు
3. గోగినేని లక్ష్మినారాయణగారు
4. ఏడికిటి రామ కోటయ్యగారు
5. పేట బాపయ్యగారు
6. డి. యస్. వల్లభరావుగారు

యీ కాల పరిమితి పూర్తి ముగుటలోపనే జూలై 6వ తేదీని అవుసరం ఆంధ్ర రాష్ట్రీ రైతుసంఘ సమావేశమును జరిపి యీ విషయమందు ఆంధ్ర రైతాంగపు ధర్మమును కార్యక్రమమును నిర్ణయించుటకు తీర్మానించడమైనది.

క్రిందటి సంవత్సరమంతా మెట్ట, మాగాణి పైరులు పాడగుటచేతను, జమీందారు పెట్టుచుండిన బాధలవల్ల ప్రజలు కడుంగడు బాధలపాలగుటచేతను, యీ నాడు మునగాల రైతులలో అత్యధిక సంఖ్యాకులు శిస్తులు చెల్లింపలేని దుర్భర స్థితియందున్నప్పటికినీ. యెన్నెన్నో బాధలుపడి ముందు పంటకూడా తాకట్టుపెట్టి జమీన్‌దారుకు చెల్లుబడి కావలసిన శిస్తుమొత్తం 74 వేల రూపాయలలో 28 రూపాయలు చెల్లించియున్నారు. రైత్వారీ ప్రాంతములలో యిట్టి కాటక పరిస్థితులయందే రిమీషను యివ్వబడి మిగతా శిస్తుకు వాయిదా వేయబడియుండగా మునగాల జమీందారుకు రైతులు యివ్వలేని స్థితిలో యున్నారని తెలిసియుండియు శిస్తు అంతా యిప్పుడే వసూలు చేయుచుండుట అన్యాయము. కనుక అసలే చెల్లింపలేని రైతులు తమ శిస్తు బకాయిలకు రాబోయే సంవత్సరంవరకు వసూలు వాయిదా వెయ్యమని పట్టుపట్టుట అధర్మము. ఈ సంవత్సరం శిస్తులు చెల్లింపగలిగిన స్థితిలో యున్నవారు తాము చెల్లించవలయునని మునగాల రైతులను యీ సంఘమువారు కోరుచున్నారు.

ఏయే రైతులు అటుల చెల్లించగలరో విచారించి వారిచేత శిస్తులు చెల్లింపచేయవలెనని మునగాల జమీన్ రైతు సంఘమును ఈ సంఘము కోరుచున్నది. అటుల చెల్లింపలేని రైతులను నిర్బంధపరచి వారి ఆస్తిపాస్తుల జప్తు చేయించి వేలం వేయించు జమీన్‌దారును అధర్మపు జప్తులు ఫసైగా కార్యకలాపమును వెంటనే ఆపువల చేయించి, ఆ బకాయి శిస్తు వసూళ్లను వచ్చే సంవత్సరంవరకు సస్పెన్షను చేయించుచూ జమీందారునకు జప్తులు వ్యవహారములో యే మాత్రం పోలీసు కుమ్మక్కు యివ్వవలదని ప్రభుత్వమును యీ సంఘము కోరుచున్నది.

[తక్కిన తీర్మానాలకు 16 వ పేజీ చూడండి]

* * *

ఎ. ఐ. సి. సి. కి కొమ్మారెడ్డిగారి తీర్మానం

అఖిలభారత కాంగ్రెసు సంఘ సభ్యుడు, పశ్చిమ గోదావరిజిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు, ఆంధ్రరాష్ట్రరైతుసంఘాధ్యక్షుడునగు శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు బొంబాయిలో ఈనెల 24, 25 వ తేదీలలో జరుగనున్న అఖిలభారత కాంగ్రెసు కమిటీకి ఈ క్రింది తీర్మానమును పంపించిరి.

"మద్రాసు రాష్ట్రములో కాంగ్రెసు హయాములో జరుగుచున్న పోలీసు అత్యాచారములను గురించి యీ కమిటీవారు ఆందోళన పడుచున్నారు కృష్ణాజిల్లా మునగాల ఎస్టేటు నడిగూడెంలో రైతులపై, పశువులపై తీవ్ర లాఠీ చార్జిచేయుట ఈ సభవారు ఖండించుచు, జమీన్‌దారు దుండగములను ప్రతిఘటించుటకు సత్యాగ్రహము చేయుచున్న రైతులకు సానుభూతిని తెలియపర్చుచు, కాంగ్రెసు మంత్రివర్గము వెంటనే జోక్యము కలిగించుకొని జమీన్‌దారు దుండగములను అరికట్టవలెనని అభిప్రాయపడుచున్నారు."

గాంధీగారి కొత్త 'టెక్నిక్'

సంస్థానాధీశుల ఫెడరేషన్ ప్రతికూలత

గాంధీజీ తిరువాన్కూరు స్టేటు కాంగ్రెసు నాయకులకు సంస్థాన ప్రజా ఉద్యమాన్ని కాలపరిమితి లేకుండా ఆపుచేయమని సలహా యిస్తూ, తనకొక కొత్త వెలుగు కన్పించిందని — నూతన ప్రేరణ కలిగిందని—సెలవిచ్చాడు. ఈ నూతన వెలుగు ఏమిటి? ప్రజల హక్కులను కాపాడటానికి నూతన పోరాట విధానమా? రాజకోట ప్రజా పోరాటాన్ని ఆపుచేసి తానొక్కడే ఉపవాసానికి పూనుకొని, వైస్రాయి సలహాపై ఫెడరల్ జష్టీ పరిష్కారానికి వదలి, విఫలుడై తానోడితినని వీరవల్లాముందు వినమ్రుడైన గాంధీజీ ప్రజలకు మరొక సాధనం ఉపదేశింప బోతున్నాడా? అనే ప్రశ్నలు వస్తాయి.

గాంధీజీ, స్థూలరూపమైన హింసను మానినంత మాత్రంలో ప్రయోజనం లేదంటున్నారు. మనోవాక్కాయ కర్మలందు దాన్ని అవలంబించాలంటున్నాడు. వెనుకటి ఉద్యమాలలో కొద్దో గొప్పో కలితీ ఉన్నదని విచారపడుతున్నాడు. ఇకముందు వ్యక్తిశాసనోల్లంఘనమే గాని, సమిష్టిశాసనోల్లంఘనము ఉండరాదంటున్నాడు. అంటే ప్రజలెంత పీడితులైనాసరే సమిష్టిగా నిర్మాణ యుక్తంగా శాసనోల్లంఘనం జరుపగూడదు. మనోవాక్ కర్మలయందు హింసను త్యజించినవ్యక్తులు మాత్రం ఎవరికివారు వ్యష్టిగా సత్యాగ్రహం జరుపవచ్చు. తిరువాన్కూరు స్టేటుకాంగ్రెసు దివాన్ సర్. సి. పి. రామస్వామిఅయ్యర్‌పై ఆరోపణలు రద్దుచేసి కొంటే చాలదు. మహారాజాగారితోనే గాక అతని దివానుతోకూడ సరిపెట్టుకోవాలి అన్నాడు. రాజకోట అనుభవాన్నిబట్టి యీ సలహా యిస్తున్నానని చెప్పాడు.

గాంధిజీ యిచ్చిన యీ సలహాలలో కొత్త ఏమీ లేదు. ప్రజలకు దారి చూపే వెలుగు అంతకంటేలేదు. ప్రజలంతా రాజకోటలో గాంధిజీ పోరాటం వదలి, వీరవల్లాకు వినమ్రుడై దర్బారుకు హాజరగుటనూ, రాజా యివ్వనున్న చేతి విదిలింపు సంస్కరణలను అంగీకరించడానికి సిద్ధపడడాన్నీ విషాదకరమైన ఓటమిగా ఎంచుతున్నారు. నిరంకుశత్వానికి లొంగిపోవడమని తలంచుతున్నారు. కాని గాంధీజీ అదియే నూతన మార్గమంటున్నాడు. పీడిత ప్రజా హక్కులను రక్షించడానికి కొత్త వెలుగు అంటున్నాడు.

ఇందులో నూతన మేమి లేదు. లిబరల్ మహాశయులు కాంగ్రెసు నాయకులుగా ఉన్నపుడు కాంగ్రెసు మహాసభ ఈ విధానంపైనే నడపబడేది. గోక్లే, ఫిరోజిషా మెహతా, సురేంద్రనాథ బెనర్జీల పంథా అదియే. కాంగ్రెసు మహాసభలో వారు భారత ప్రజలకు జరుగుచున్న అన్యాయాన్ని వల్లెవేసేవారు. బ్రిటీషు పార్లమెంటును చక్రవర్తిని ఆకష్టాలను తీర్చవలసినదిగా ప్రార్థించేవారు. ఏమైనా చేతి విదిలింపు సంస్కరణలు యిస్తే ఎంత అసంతృప్తిగా వున్నా అవి స్వీకరించి యింకా ఎక్కువకొరకు ప్రార్థించేవారు. చక్రవర్తితోను, బ్రిటీషు సామ్రాజ్యవాదంతోనూ సరిపెట్టుకొనేవారు. కాంగ్రెసు మహాసభలో రాజభక్తి తీర్మానము గావించబడేది. గాంధీజీ తన రాజకీయ గురువు అని చెప్పుకొనే గోక్లే మార్గానికే మరలుతున్నాడు. గాంధీజీ 1920 లో సహాయ నిరాకరణోద్యమాన్ని-ప్రజావిప్లవంలా సహజముగా వచ్చే చౌరాచౌరీవంటి సంఘటనలకు వెరచి-అహింసనింకా ప్రజ లలవరచుకోలేదని ఆపుజేసాడు. 1930 దండి యాత్రకు ముందు మరల వెనుకటివలెనే చేస్తావా అనేప్రశ్నకు సత్యాగ్రహుల ప్రవర్తనలో తాను బాధ్యుడనియు, దౌర్జన్యసంఘటనలు జరిగినంతమాత్రాన ఉద్యమాన్ని ఆపనన్నాడు. పోరాటంలో దౌర్జన్య రాహిత్యాన్ని పాలసీగా అంగీకరించిన వారంతా చేరవచ్చునని సెలవిచ్చాడు: మతంగా స్వీకరించ నక్కరలేదన్నాడు. 1933 లో ప్రజలు తన అహింసా సిద్ధాంతాన్ని అంగీకరించకపోవడమే ఓటమికి కారణమనీ, సమిష్టి శాసనోల్లంఘనం పనికిరాదనీ అన్నాడు.

అందుచే గాంధిజీ కొత్తవెలుగులో నూతనసిద్ధాంతమేమీ లేదు: 'అహింస'ను కేంద్రముగా చేసికొని అవృత్తంగా తిరిగే మితవాద తత్వమే అది. నేడు ప్రజ్వలితమగుచున్న ప్రజా వుద్యమానికి నాయకత్వం వహించి యావద్భారత జాతీయపోరాటాన్ని క్రమక్రమముగా పోరాటం లేకుండానే అధికారం హస్తగతం చేసికోవచ్చునని ఆశించుతున్నాడు. ఫెడరేషను, యుద్ధానికి వ్యతిరేకంగా పోరాటానికి సన్నాహాలు చేయగోరుటలేదు. కొంతమంది 'అభివృద్ధికరమైన' సంస్థానాల సాయంతో ఫెడరల్ శాసనసభలలో కూడా కాంగ్రెసు మంత్రిపదవులను స్వీకరించవచ్చునని ఆశించుతున్నారు. అందుచేతనే సంస్థానాలన్నిటిలోని ప్రజా పోరాటాన్ని ఆపుజేయుట. ఇక గాంధీజీ ఈ పాలసీ నరేంద్రులలో 'హృదయ పరివర్తన' గలిగించిందేమో చూదాము.

సంస్థానాధిపతుల మహాసభ

బొంబాయిలో సమావేశమైన నరేంద్రుల సమావేశము సంస్థానాధిపతులు ఫెడరేషనులో చేరడానికి ఏర్పరచబడిన నిబంధనావళి (Instrument of Accession) మార్పుచేసిందికూడా తమకు తగిన రక్షణలు యివ్వడం లేదనీ అసంతృప్తికరంగా వుందనే తీర్మానించింది. అయితే యిది రాయబారాలకు యికముందు తావులేదనీ, ఫెడరేషన్ పూర్తిగా నిరాకరించబడినట్లుగా యెంచరాదనీ కోరారు. అంటే నిబంధనావళిలో యింకా నరేంద్రుల కనుకూలమైన మార్పులు గావించితే జేరతామని, బాసజేస్తున్నారు. వారు కోరే మార్పులేమిటి: మొదటి రౌండు టేబిల్ కాన్ఫరెన్సులో బాస యిచ్చినటుల సంస్థానాల ఆంతరంగిక పరిపాలనలో ఫెడరల్ ప్రభుత్వం జోక్యం కల్గించుకోరాదని రక్షణ యివ్వాలట. చక్రవర్తికి నరేంద్రులకు జరిగిన ఒడంబడికలు గౌరవించబడాలట. నరేంద్రులు యిపుడు విధించుతున్న దిగుమతి సుంకాలపై జోక్యం కల్గించుకోరాదట. ఎక్సైజుపన్నులు 1937 మార్చి 1కి వున్నవి మాత్రమే అంగీకరించబడతాయని యిప్పటి నిబంధనావళిలోవుంది. అటులగాక యికముందు ఫెడరేషన్ అమలు జరుపునప్పటిరేట్లు అంగీకరించబడాలని నరేంద్రులు కోరుతున్నారు అంటే సంస్థానాధిపతులు యీలోగా తమ ఆదాయాన్ని వృద్ధిచేసికోడానికి పరిశ్రమలకు వినాశకరమైన ఉత్పత్తిపన్ను (ఎక్సైజుపన్ను) వృద్ధిచేసికోడానికి హక్కు కోరుతున్నారు.

సామ్రాజ్యవాదులు ఫెడరేషనులో సంస్థానాలను చేర్చబూనుకొంది, నరేంద్రుల నామినేటెడ్ ప్రతినిధుల సాయంతో ఫెడరల్ శాసన సభల్లో ప్రజా ప్రతినిధులకు ఏ సందర్భంలోనూ మెజారిటీ రాకుండా చేయడానికే నరేంద్రులు తమ ప్రజలను వారి ఇష్టంవచ్చినట్లు ఏలడానికి పూర్తిరక్షణ నిస్తేనేగాని చేరమంటున్నారు. ఈ రాయబారాల అంతరార్థమదే. ఒకదాని కొకటి విరుద్ధంగాని ఎవరిలాభంవారు చూచుకొంటున్నారు. కాని యిందులో సంస్థాన ప్రజలకుగాని, బ్రిటీషు యిండియాప్రజలకుగాని కించిత్ లాభంలేదు. అందుచేతనే కాంగ్రెస్ మహాసభ ఫెడరేషన్ భగ్నంచేయాలనీ ప్రజా ప్రతినిధి పరిషత్తు భారతరాజ్యంగాన్ని నిర్ణయించాలని తీర్మానించింది.

కాని గాంధీయులు మాత్రం సంస్థాన ప్రతినిధుల సాయంతో ఫెడరల్ శాసనసభలో మెజారిటీ సంపాదిస్తామనీ, పోరాటం లేకుండానే అధికారం సంపాదిస్తామనే ఆశ యింకా వీడలేదు. అందుచేతనే బులాభాయి దేశాయి నరేంద్రుల మహాసభకు వచ్చినవారితో సంప్రదింపులు జరిపాడని వార్తలున్నాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక విలేఖరి 15 వ తేదీ పత్రికలో "ఈసమయంలో భూలాభాయి దేశాయి ఫెడరేషన్‌కు అనుకూలమైన సంస్థాన మంత్రులను కలసికోడం విపరీతంగా ఎంచబడుతూంది. సంగతులు తెలసినవారు దేశాయి వైస్రాయిగారికి ఫెడరేషను తొందరగా అమలు జరపడానికి సాయం చేస్తామని గాంధీయులు వాగ్దానాలను పూర్తిచేసికోడానికే అలావేసాడని అనుకొంటున్నారు."

ఇవన్నీ ఒకేసంగతిని రుజువు చేస్తున్నాయి, గాంధీయులు ఫెడరేషనుకు వ్యతిరేకంగా పోరాడటానికి సిద్ధంగాలేరు. అందుచేతనే సంస్థాన ప్రజా పోరాటాలను గాంధీజీ ఆపుచేయించాడు. యుద్ధ సమయంలో సామ్రాజ్యవాదులకు సాయంరాదనీ, ఆ అవకాశాన్ని జాతీయ స్వాతంత్ర్యం సంపాదించడానికి వినియోగించాలనే త్రిపురీ కాంగ్రెస్ జాతీయవాంఛా తీర్మానం అములులో పెట్టదలచుకలేదు. స్వల్పమైన మార్పులు గావించితే ఫెడరేషను అంగీకరించడానికి సామ్రాజ్యవాదులతో రాజీబేరాలు సాగించడానికి సిద్ధంగా వున్నారు. ఈదిగజారుడు విధానాన్ని అరికట్టడానికి ఒకే మార్గముంది. స్థానిక ప్రజా పోరాటాలను విరివిగా సాగించాలి. ప్రజా ఒత్తిడిద్వారానే గాంధీయుల రాజీవిధానము కొనసాగకుండుటకు, జాతీయ పోరాట ప్రారంభించుటకు పునాది వేయుగల్గుతాము.

కాంగ్రెసు వార్తలు

గుంటూరుజిల్లా కాంగ్రెస్ సంఘ ఆనరరీ ఆర్గనైజరు వావిలాల గోపాలకృష్ణయ్యగారు జిల్లావాసుల కీక్రింది విజ్ఞాపన చేయుచున్నారు:

త్రిపురీ కాంగ్రెస్ జాతీయ వాంఛను ప్రకటించింది. కలకత్తాలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సంఘం యుద్ధాలను నిరోధిస్తూ తీర్మానించింది. ఇండియాదేశాన్ని తరతరములవరకు బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమక్రింద బానిసలుగ నుండుటకు అన్నివిధముల బంధించి వేయుచున్నారు. ప్రపంచంలో జరుగుచున్న సామ్రాజ్యవాదుల దోపిడికి అంతు కనుపింపక• యుద్ధంలో నిమగ్నులై అమాయక ప్రజలను సామ్రాజ్యయుద్ధాలలో బలియొసంగి వీరి రక్తమాంసములతో తమ లాభములను పంచుకొనుచున్నారు. అందుకింకను పెద్దపెద్ద యెత్తులను వేయుచున్నారు. ఆలోచనలు సాగించుచున్నారు రోజురోజుకు కళలు బాసిపోవుచున్న బ్రిటిష్ సామ్రాజ్యము తులలేని అర్థిక సంపత్తితో• మితిలేని జనబలముతో నిండి నిఃటీకృతమై యుండియా దేశమును ఉపయోగించుకొని యీ దేశమును శాశ్వతముగ తమక్రింద నొక్కిపుంచుకొనుటకు రోజురోజు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆకలిమంటచే మలమల మాడుచున్న కూలీలను, భరింపరాని పన్నుల భారంతోను తలమించిన అప్పులతోను బాధపడుచున్న రైతులను, నిరుద్యోగముచే ఆత్మహత్యల కాహూతి యగుచున్న యువకులను. విద్యార్థులను ఆశజూపి కమపు కత్తుకత్తి నేర్పి యుద్ధాలలో బలియొసంగు ప్రయత్నాలు బ్రిటిషు సామ్రాజ్య ప్రభుత్వము చేస్తున్నది ఇందుకై ఫెడరేషన్‌ను అమలుజరిపి రాజకీయాధికృతను గవర్నరు జనరల్ చేతులోపెట్టి సర్వాధిపత్యమును చలాయించుటకు తమరాజ్యాధిపత్యము ఏమూలపోతుందో, ఏనాడు ప్రజాబలం ఆధిపత్యం అవలంభిస్తుందో నని సామ్రాజ్యాధీశుల చెప్పుచేతులలో మెలగుచున్న స్వదేశ సంస్థానాధీశులు సంస్థాన ప్రజలపై గావించుచున్న అత్యాచారములు. దుండగములు వీని కంతు కన్పించుటలేదు. సంస్థానాధీశుల దౌర్బల్యాన్ని ఆసరాచూచుకొని బ్రిటిషు సామ్రాజ్యవాదులు ఇండియాలోని ప్రజాబలాన్ని విచ్ఛిన్నంచేయ సంకల్పించి ఫెడరేషన్ బోను నొడ్డియున్నారు. ఈ దురంతాలను. ఇట్టి సామ్రాజ్య ప్రభుత్వ దుష్టయంత్రాలను. మనము అన్నివిధాల ఎదుర్కోవాలె—నిరోధించాలె. అది మన విధి. అదును కనిపెట్టి జాతీయ శక్తులను కేంద్రీకరించి, కీలకమెరిగి తీవ్రపోరాటాన్ని సాగించుటకు మనము తయారై యుండవలయును.

ప్రజలలో జాతీయ వాంఛను గురించి, ఇండియాకు రానున్న ఆపదనుండి రక్షించుటకు ఫెడరేషన్‌ను ఎట్టి త్యాగముతోనైనను నిరోధించుటకు సన్నద్ధులనుచేయుటకు, సామ్రాజ్య యుద్ధాలలో ఎవరు పాల్గొనకుండునట్లు చేయుటకు, జిల్లాయంతట ఫెడరేషన్ నిరోధక. యుద్ధ ప్రతికూల. సమావేశములు జరిపి జాతీయ వాంఛను ప్రకటింప తలంపుగలదు. అందుకు ప్రాతిపదికకు నొక యాత్రాదళము బయలుదేరి ప్రతి ఫిర్కాలోను ఫిర్కా సభలు. సమావేశములు (Rallys) జరిపి ప్రజా వాంఛను బలపరుపదలంచాము.

ఈ ప్రయత్నములో జిల్లావాసుల సహాయం పూర్తిగా కావలయును. కావున ఆయాగ్రామములలో జరుగు ఫిర్కాసభలకు ఆయాగ్రామాల వారంతా వేలకొలది విచ్చేసి సభలను జయప్రదము గావింపవలసినదనియు, ఫేడరేషను భగ్నం చేయవలెననియు. యుద్ధాలు బహిష్కరింపవలెననియు, జాతీయ వాంఛను ఐక్యకంఠంతో బలపరచి ప్రజావాంఛను ప్రకటింపవలెననియు, రానున్న స్వాతంత్ర పోరాటానికి సంసిద్ధులై రాజకీయ రంగంలో గుంటూరుజిల్లా అంతర్జాతీయంగా సంపాదించిన చిరకీర్తి ప్రతిష్ఠలను మరొకమారు బలపరుచుకొనుటకు ప్రయత్నించవలెననియు ఈ జిల్లా వాసులను మరొకమారు సవినయంగా ప్రార్థించుచున్నాను.

ఫిర్కాసభల కార్యక్రమము

తెనాలి తాలూకా

జూన్

20 అమృతలూరు — 24 కొల్లిపర
21 చేబ్రోలు — 25 కొల్లూరు
22 తెనాలి — 26 వేమూరు.
23 దుగ్గిరాల

రేపల్లె తాలూకా

27 రేపల్లె

జులై

28 బోడాయెపాలెం — 1 ఘాశిపూడి
29 పెదమల్లపూడి — 2 చెరుకుపల్లి
30 కూచినపూడి

బాపట్ల తాలూకా

3 పొన్నూరు — 7 పరుచూరు
4 అప్పికట్ల — 8 చీరాల
5 బాపట్ల — 9 వేటపాలెం
6 పెదనందిపాడు

ఒంగోలు తాలూకా

10 దుద్దుకూరు — 13 ఒంగోలు
11 అమ్మనబ్రోలు — 14 వెల్లంపల్లి
12 సంతనూతలపాడు — 15 అద్దంకి

నర్సారావుపేట తాలూకా

16 మారుమూరు — 19 నర్సారావుపేట
17 చిలకలూరిపేట — 20 రొంపిచెర్ల
18 నాదెండ్ల — 21 కొమ్మాలపాడు

వినుకొండ తాలూకా

22 ఏనుగుపాలెం — 25 వెల్లటూరు
23 ఐనవోలు — 26 ఈపూరు
24 వినుకొండ

పల్నాడు తాలూకా

27 కారంపూడి — 30 గురజాల
28 వెల్దుర్తి — 31 దాచేపల్లి
29 మాచెర్ల

ఆగష్టు

1 ఒడుగు రాళ్ల

సత్తెనపల్లి తాలూకా

2 బెల్లంకొండ — 5 పెదకూరపాడు
3 సత్తెనపల్లి — 6 ఫిరంగిపురం
4 అచ్చంపేట

గుంటూరు తాలూకా

7 ప్రత్తిపాడు — 10 పెదకాకాని
8 తాడికొండ — 11 గుంటూరు
9 మంగళగిరి

* * *

తునితాలూకా కాంగ్రెస్‌కమిటీ యెన్నికలు

ది 11-6-39 వ తేదీని తుని తాలూకా నూతన కాంగ్రెస్ కమిటీ యెన్నికలు వెలమ కొత్తూరు గ్రామంలో మధ్యాహ్నం గం॥ 1 కు శ్రీయుత తిరుపతి అప్పల నరసింహంగారి అధ్యక్షతక్రింద సమావేశమై యీ దిగువ కమిటీని ఏకగ్రీవముగా యెన్నుకోవడమైనది.

అధ్యక్షులు కామ్రేడ్ యినుగంటి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి శ్రీయుత కుప్పిని అదినారాయణపట్నాయిక్, సహాయకార్యదర్శి• లెక్కల సత్యనారాయణమూర్తి

కార్యనిర్వాహక సభ్యులు :

1 శ్రీయుత తిరుపతి అప్పలనరసింహం
2 .. గాడి సన్యాసిపాత్రుడు
3 .. గాడి బూసయ్య
4 .. చింతకాయల చిననారాయణమూర్తి
5 .. సూరి ప్రకాశరావు
6 .. పెదిరెడ్ల చెల్లారావు
7 .. సోమరౌతు సత్యనారాయణమూర్తి

తీర్మానములు

1. పాత కాంగ్రెస్ కమిటీవారు ఎజండా ప్రకారం మీటింగుకువచ్చి నూతన కాంగ్రెస్ కమిటీవారికి చార్జి అప్పజెప్పనందున జిల్లా కాంగ్రెస్ కమిటీవారిని తక్షణమే పాత కాంగ్రెస్ కమిటీతాలూకు జమా-ఖర్చులున్నూ, రికార్డున్నూ అప్పజెప్పించవలసినదిగా యీ కమిటీవారు కోరుతూ తీర్మానించడమైనది.

2. ఈ సంవత్సరం తుని తాలూకాతో విరివిగా కాంగ్రెస్ ప్రాథమిక సభ్యులను చేర్పించుటకు తీర్మానించడమైనది.

3. తాత్కాలికముగా తుని తాలూకా కాంగ్రెస్ ఆఫీసు వెలమకొత్తూరులో నేర్పరచి, త్వరలోనే సదరు ఆఫీసు, ప్రజలందరకు అందుబాటులో నుంచుటకై తునిలో యేర్పరచుటకు యీ కమిటీవారు తీర్మానించడమైనది.

* * *

కొత్తపేట తాలూకా కాంగ్రెసు సంఘం.

నూతన సంవత్సరానికి కార్యసంఘమును ఎన్నుకొనుటకు 11-6-39 తేదీని పలివెలలో పై సంఘ సమావేశము జరిగినది. యీక్రింది వారిని కార్యసంఘ సభ్యులుగా ఎన్నుకొనడమైనది.

పి. అనంతం. ప్రెసిడెంటు
పెన్మెత్స సత్యనారాయణ. ప్రధాన కార్యదర్శి
అయ్యగారి సుబ్బారావు. సహాయ కార్యదర్శి
సోమయాజుల రామనాథం
కాశీబైనాల సూర్యనారాయణ
చాగంటి అచ్యుతరామయ్య
నఖినేటి పద్మరాజు
మంతెన నరసింహరాజు
బైరాజు బంగార్రాజు

* * *

చిత్తూరు జిల్లా.

చిత్తూరు తాలూకాలో ఆర్. యం. రత్నం, కె. నరసయ్యగార్లు నేషనల్ డిమాండు, యుద్ధ ప్రతికూల ప్రచారము చేయుచూ వచ్చిరి.

సిరేనిపాళియలు, వెంకట పెరుమాళరాజు పురం, ఎగూరు. పూడి మీదుగా కాయం చేరి, చిరుతనూరు తిరుపతి చేరిరి.

కాయం గ్రామంలో 30 మంది రాత్రి పెద్ద రైతు మహాసభ జరిగెను. కె. నరసయ్యగారు అతివాద, మితవాద కార్యక్రమము, ఉద్దేశముల గురించి ఉపన్యసించిరి. తరువాత రత్నం కాంగ్రెసులో చేరవలసిన ఆవశ్యకత-యుద్ధ ప్రతికూలత-తతిమ విషయములుగురించి మాట్లాడినారు. రైతులీక్రింది విషయమును చెప్పినారు.

'మా గ్రామం ఒక అయ్యంగారిది. ఈ సంవత్సరం వర్షం లేనందువల్ల, చెఱువు పూర్తిగా యెండిపోయి వుండటం మూలాన బావులక్రింద మాత్రం పైరు పెట్టినాము. మొత్తపు భూమిలో ½ వంతు మాత్రం పైరు చేసినాము. అని నీళ్లులేక పూర్తిగాపోయింది. మా గ్రామానికి గవర్నమెంటు కర్నం, ప్రొప్రయిటరు కర్నం, ఇద్దరున్నారు. పైరు యెండిపోయిన విషయం వాళ్లకు తెలియబరచాము, వాళ్లు వచ్చిచూచినారు గవర్నమెంటు కర్నం, పంటచేసింది ఎంతవరకో అంతమాత్రం లెఖలలో గుర్తించేస్తూ యెండిపోయింది తెలియజేసాడు. ప్రొప్రయిటర్ కర్నం, యెండిపోయింది కొంత తెలియజేసాడు. కాని మొత్తం పైరుపెట్టినట్లు వ్రాసాడు. పంటపోయినదానికి "రెమిషన్" అడిగాము. అ. 6 ల వంతు యిచ్చాను. మొత్తానికి కట్టండి శిస్తు" అని ప్రొప్రయిటరు అడుగుతున్నారు. ఆ విధంగా అయితే మామూలుకు మించిపోతుంది. కఱవుతో తిన కూడులేని రైతులము న్యాయంగా పంటచేసింది యెంతో అంతవరకు లెఖకట్టి 0-8-0 వంతు రెమిషన్ కోరుతున్నాము. కాని వాళ్లు ఒప్పలేదు."

* * *

ఇచ్ఛాపురం తాలూకా కాంగ్రెసు సంఘం

యిచ్ఛాపురం తాలూకా కాంగ్రెసు నూతన సంఘ సాధారణ సమావేశము రాజపురములో తే 4-6-39 ది. ఆదివారం సాయంకాలం 5గంటలకు శ్రీయుత ఉత్తర విశాఖ జిల్లాకాంగ్రెస్ సంఘ ప్రధానకార్యదర్శిగారగు గౌతు లచ్చన్నగారి యాజమాన్యముక్రింద జరిగెను.

తీర్మానాలు

1. యీ తాలూకా సంఘమునకు యీదిగువవారిని అధ్యక్ష కార్యదర్శులుగను కార్యవర్గ సభ్యులగును యేకగ్రీవముగా యెన్నుకోవడమైనది.

అధ్యక్షులు: శ్రీ బల్లెడ అప్పలస్వామిగారు
కార్యదర్శి: శ్రీ లక్కోజి భరతాచారిగారు
స॥ కార్యదర్శి శ్రీచార్ల జగన్నాయకులుగారు

2. తాలూకా సంఘ కార్యాలయము రాజపురంలో నుంచుటకు తీర్మానించడమైనది.

3. నూతన సంవత్సరమునకు తాలూకా అంతట కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమము సక్రమముగా కొనసాగించి కనీసము 2 వేలమంది సభ్యులను చేర్చుటకు తీర్మానించుచు యీదిగువ యేర్పాట్లు కావించడమైనది.

(ఎ) జిల్లా కాంగ్రెసు సంఘమువారు నిర్ణయించిన షరతులకులోబడి నెల 1కి రు 10/లు వేతనముక్రింద యీదిగువవారిని ప్రచారకులుగ నియమించుటకు తీర్మానించడమైనది.

బొల్ల లక్ష్మీజీరావు బార్లపుట్టగు
పిల్లి సుబ్రమణ్యం రాజపురం

4. నేటివరకు వానలు లేకపోవుటచే కలుగుచున్న తీవ్రమయిన ఎండలు వడగాడ్పుల వలను యీతాలూకా అంతట మెట్టపైరులకు పూర్తినష్టము కలుగుటయేగాక పశువులమాట అటుంచి, మనుష్యుల దాహమునకయిన మంచి నీరుకానక, తీవ్రమైన ఆందోళన అలజడి తలూకా అంతట ప్రబలిపోవుచున్నది ప్రభుత్వమువారు జిల్లాబోర్డువారు వెంటనే యీతాలూకాలో తగిన నీటివసతికై అవసరచర్య జరుపవలసినదని యీసంఘమువారు కోరుచున్నారు.

డెట్ కన్సీలియేషను బోర్డు బెజవాడ


యీ బోర్డును ప్రభుత్వ మేర్పరచినారు. కాని అది అమలులో బహుమంద గమనంగా వున్నది. బోర్డు తరఫున యింతవరకు వివరములు ఏమిన్ని ప్రచురింపలేదు. దీని వివరములు ప్రజలకు విపులముగా తెలియుటత్యవసరమై యున్నది. బహు కొద్ది మందికి మాత్రమే తెలియును. దరఖాస్తులు పెట్టుకొనిన వారికినీ ఏ విధమైన అయిమను జరుగక చాలా ఆలశ్యమగుచున్నది. మైలవరం ఫిర్కాలో ముగ్గురు దరఖాస్తులు పెట్టుకున్నారు. నందిగామలో ఒకరు, కోడూరులో ఒకరు 2-3-1939 తేదీన, మైలవరం పోస్టాఫీసులో నెం 142 రున రిజిష్టరు చేసినారు. దానిని సబు కలెక్టరుగారి ఆఫీసులో 4-3-1939 తేదీన వి. వి. సుబ్బారావుగారు తిరుగు రశీదుమీద దస్కతుచేసి తీసుకున్నారు. 29-3-39 తేదీవరకు ఏమిన్నీ జవాబులేదు. పిరి తరువాత మరొక దరఖాస్తు పెట్టుకొనగా• ఆతనికి, ఋణదాతలకు నోటీసు పంపుటకు డబ్బు పంపమనగా పంపినారు. అదిచూచి పై దరఖాస్తుదారు తిరిగి 29-3-39 తేదీన మరొక రిమైండరు పెట్టినారు. 18-4-1939 తేదీన నందిగామలో దరఖాస్తుదారులను విచారించుటకు నోటీసు యిచ్చినారు రెండవ దరఖాస్తు దారుకు; యిది చూచి మొదటివారు 17-5-39 తేదీన తిరిగి రిమైండరు పంపగా, కలెక్టరుగారు బోర్డు అధ్యక్ష హోదాలో తమవద్ద ఏమిన్నీ కాగితములేదని జవాబు యిచ్చినారు. పై విధమున వారి ఆఫీసుకు చేరినట్లు రశీదులుండియు నిరర్థకమైనది. ఎవరికిన్నీ ఏవిధమైన జవాబులులేవు. సబుకలెక్టరుగారి ఆఫీసులోనే కాగితములు కాలులెత్తుకు పోయినవా? బోర్డువారు ప్రజలకు వివరములు తెలుపు అధికార ప్రకటనచేయుట అవసరమై యున్నది. బోర్డును నియమించిన సార్థకత నీవలకు త్వరలో అందునట్లుచేయుట బోర్డువారి విద్యుక్త ధర్మం.

అ. వెం. శి. రామారావు,
కృష్ణాజిల్లా రైతు సంఘ
సహాయ కార్యదర్శి.

* * *

వెల్వాడం, ఎయిడెడ్‌స్కూలు టీచరు మానేజరు అక్రమచర్య

నేను బెజవాడతాలూకా వెల్వాడం హిందూఎలిమెంటరీ పాఠశాలలో 1-1-1937 తేదీనుండి 6-6-1939 తేదీవరకు సకాలమునకు హాజరై రెండవ అసిస్టెంటు ఉపాధ్యాయునిగా పనిచేసియుంటిని. డబ్బు యివ్వకపోయినను, ముందుగా అడ్వాన్సు రు॥ 36 లు ముట్టినట్లుగా సంతకము జేయక ఎంత డబ్బు యిచ్చిన అంత వరకే ముట్టినట్లు సంతకము చేయుటచేతనో, తక్కువ స్కేలు గ్రాంటుకు వచ్చు టీచరుండుటవల్లనో నన్ను తొలగించి మరొకరిని ఏర్పాటుచేయు నుద్దేశముతో టీచరు మానేజరైన యరమల పర్వతరెడ్డిగారు 1-6-39 వ తేదీనుండి నాపేరును టీచర్సు అటెండెన్సు రిజిష్టరులో వ్రాయక 6-5-39 వ తేదీ సాయంత్రం కొత్త టీచరును ఏర్పాటుచేసిరి. 2 సం॥ల 5 మాసములనుండి పనిచేయుచున్న నన్ను హఠాత్తుగా, ఏకారణము కనబరచక, వ్రాతమూలమున గాని, వాఙ్మూలమున గాని ముందుగా ఎట్టి నోటీసు నివ్వకయే తొలగించెను. ఈ పైసందర్భములను బట్టి మేనేజర్లక్రింద



పనిచేయు టీచర్లందరు జమిందారీ గ్రామ ప్రజలవలె కష్టము లనుభవించుచున్నారనక తప్పదు. వారి భావిదశలో యింక నెన్ని యిక్కట్లు కలుగనున్నవో యోచింపుడు. విద్యాశాఖాధికారులు యీ టీచర్లకు తగు రక్షణ కలుగజేయగలందులకు తగిన విధానమును ప్రకటించిన గాని రక్షణలేదు. దీనిని గురించి కాంగ్రెసు ప్రభుత్వమువారు గావించిన శాసనములున్ననూ, ఉపాధ్యాయలోకమునకు తెలియకున్నది. గనుక ఉపాధ్యాయ సంఘం బలము చేకూర్చుకొని తమ స్వరక్షణకు తగు విధాన మరయుట వారి కనీసధర్మము. ప్రకాశం కమిటీ రిపోర్టు వచ్చుచున్నదని అడవిని ప్రజలు తిందురేమో యని బొగ్గుగా మార్చుకుని అరణ్యమును నాశనము చేయు జమిందారీ పేరాశ చర్యలకును, ముందు విద్యాశాఖాబోర్డు నమలుకు వచ్చి చట్టములు జరుగును గనుక నిన్నునేడే తొలగించితిమను వీరి పేరాశకును వ్యత్యాసమున్నదా? ఉపాధ్యాయ వృత్తిని ముఖ్య జీవనముగా ఎంచిన యీబీదవాని మనవి యింతక యాలించి ప్రభుత్వమువారు తగు చర్య గైకొందురుగాక యని మనవి చేయుచున్నాను.

11-6-39 } ఇట్లు
మైలవరం } కందివెలుగు వెంకటేశ్వర శర్మ

* * *

విస్సన్నపేట ఆస్పత్రి

విస్సన్నపేట లోకల్‌బోర్డు ఆసుపత్రి డాక్టరు గారిని, మంత్రసానిని బదిలీ చేయించవలసినదిగా కోరుచూ యిదివరలో వివిధ సంఘములవారు తీర్మానములుచేసి అధికార్లకు పంపియున్నారు. దరిమిలాను బహిరంగ సభజరిపి అందలి తీర్మానములను పంపుతూ క్రిందటి నెల మే 31 వ తేదీ గ్రామస్థుల కొందరు జిల్లాబోర్డు ప్రెశిడెంటు, కృష్ణాజిల్లా సర్జన్‌గార్లవద్దకు రాయబారం కూడా వెళ్ళివచ్చినారు. యింతవరకు డాక్టరు బదిలీ వుత్తర్వులుగాని, మంత్రసాని బదిలీ వుత్తర్వులుగాని వచ్చినట్లులేవు. గ్రామంలో అలజడి చాలా జాస్తీగా ఉన్నది. ఆసుపత్రిలో రోగుల సంఖ్య తగ్గిపోయినది. కొన్ని సంఘములవారు అసలే అసుపత్రికి వెళ్లట మానివేసినారు. వైద్యమునకు యిబ్బంది పడుచున్నారు. పార్టీ కక్షలతో పనిచేయు డాక్టరు వుండుట శ్రేయోదాయకముకాదు. గ్రామంలో ప్రజలు యింకొక డాక్టరుగార్ని వేయించండి. అని కోరుతూ వున్నప్పుడు యింత ఆలశ్య మెందులకో తెలియకున్నది. డాక్టరుగారిని ఎంత త్వరలో బదిలీచేసిన అంత ప్రజల కష్టాలు తొలగగలవని ఆశించుచున్నారు

ఇట్లు,
ఒక విలేఖరి.

* * *

హైస్కూలు మన్ను అన్యాక్రాంత మవుతోంది

మే నెల 24 వ తేదీన జగ్గయ్యపేట బోర్డు హైస్కూలులోనికి తెల్లవారుసరికి పదిబండ్లు తెచ్చి పుట్‌బాల్ గ్రౌండులో గోతులు పెట్టి మన్ను త్రవ్వుకొని బండ్లకు నింపి తోలుకొని పోబోవుచుండగా స్కూలు నైటువాచరు బండ్లవారిని అడ్డుపరచెను. అందుమీదట ఘర్షణ జరిగినది. పెద్దలుకూడ కొందరు హైస్కూలు లెక్కల అసిస్టెంటు, శర్మగారును, అటెండరు రామమూర్తిగారును కూడ వచ్చి "ఇదేమిటి" అంటే యీ మన్ను జగన్నాధరావుపంతులుగారికి కావలెను, కొద్దిగా రెండువందల బండ్లు తోలుకుందుము. అడ్డు పెట్టితే పంతులుగారితో చెప్పెదము అని బండ్లవారు అన్నారు. పంతులు గారికిన్నీ జిల్లాబోర్డు ప్రెసిడెంటు శ్రీ చల్లపల్లి రాజావారికిని అత్యంత మైత్రి అగుటచే బండ్లకు అడ్డు వచ్చుట ప్రమాద హేతువని కాబోలు బండ్లను వదలివేసిరి; నిరంతరాయముగా బండ్లు సాగుచున్నవి. శ్రీ జగన్నాధరావు పంతులుగారు ఈ మధ్యనే ఈ గ్రామమందు ఒక స్వంత భవనమును నిర్మింప మొదలుపెట్టినారు. ఈలెక్కప్రకారం చూస్తే పంతులుగారి ఇంటికి మెరక కావలిస్తే హైస్కూలు కప్పు లేవవలసి ఉంటుంది. ఈవిషయం జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారును హైస్కూలు హెడ్ మాష్టరు గారును విచారించుట యుక్తము.

24-5-39 } ఇట్లు
జగ్గయ్యపేట } అమరవాది మహాదేవశాస్త్రి

* * *

విద్యావనం

కృష్ణాజిల్లా యువజన సంఘాధ్యక్షులు కడియాల గోపాలరావుగారిట్లు వ్రాస్తున్నారు.

మన పిల్లలను కాన్వెంటులకు పంపుట చాల సహజమైపోయింది. కాని కాన్వెంటులలో మన పిల్లలకిచ్చు ఆహారమూ, వేరే విద్యా. సరిగా వంట బట్టవు. అది కాక. గురుకులవాస నివాసములతో, దేశ భాషలతో, అల్లిక కుట్టుపని, వడ్రంగము మొదలగు చేతిపనులు, వ్యాయామము, సంగీతము, చిత్రకళ, భరత నాట్యము మొదలగు విద్యలను, నిపుణులైన శిక్షకులు చెప్పుతూ ప్రేమ వాత్సల్యములతో మంచి వాతావరణములో పిల్లలను పెంచు ఆధునిక విద్యావనంబోటి విద్యా సంస్థలు దేశమందు పెంపొందింపచేయుట చాల అవసరం. ఇట్టి తరి మన రాష్ట్రంలో మంతెనవారి పాలెంలో స్థాపింపబడిన విద్యావనం అన్ని తరగతులవారికి అందుబాటులో యుండి. బాలబాలికలను బాలాఢ్యులుగను, మేధావంతులుగను, జ్ఞానవంతులుగను తయారు చేయుచున్నపుడు ఎక్కువ ధనవ్యయంచేసి ఇతర ప్రాంతాల్లోని గురుకులాలకు కాన్వెంటులకు పిల్లలను పంపించుట అనవసరం, బాలుర మానసిక తత్వాన్నిబట్టి చదువు చెప్పుట యీ పాఠశాల ప్రత్యేకత.

విద్యావనం స్థాపించి సంవత్సరమన్నా కాలేదు. కాని అచ్చట నేర్చుకొనుచున్న విద్యార్థులు ఆరోగ్యంలో నేమి, విద్యలోనేమి మంచి అభివృద్ధి పొందారు. యీ సంస్థకు గౌరవాధ్యక్షులుగా మంత్రి గౌ॥ సుబ్బరాయన్‌గారూ, గుంటూరు జిల్లాబోర్డు ప్రెసిడెంటు చంద్రమౌళిగారూ ఉన్నారు. దీనికి వ్యవస్థాపకులు కామేశ్వరరావు, వారి సతిమణి సరళాదేవిరావుగారూ ఐ ఉన్నారు.

ఉపాధ్యాయ బృందము కూడా విద్యావంతులతోనూ స్వార్థత్యాగులతోనూ, కూడుకొని యున్నది. వ్యాయామము మొ॥ విద్యలలో మంచి నిపుణులయిన ప్రొఫెసర్లు బొంబాయి, మధ్యరాష్ట్రాలనుంచి కూడా వచ్చారు. ఇట్టితరి ఆంధ్ర మహాజనులను, ముఖ్యంగా కృష్ణాజిల్లా వాసులను ఈ అమూల్య సమయం జారవిడువక పిల్లలను బంపియూ, ఘోరవిరాళాల నిచ్చియూ యిలాంటి విద్యాసంస్థలను పోషించి దానివల్ల విద్యాలాభములను పొందగోరుచున్నాను.

అస్సాం ఆయిల్ కంపెనీ కార్మికుల సమ్మె

“శక్తి అంతా ధారవోసి సమ్మె సాగించాలిసిందే” --రాజన్‌బాబు

అస్సాం ఆయిల్ కంపెనీ పనివారల సమ్మె ప్రారంభమై 80 రోజులయింది. ఇది ఒక పరిశ్రమకు చెందిన పోరాటమయినా అస్సాంలోని యావత్ ప్రజా పోరాటముగా అభివృద్ధి చెందింది. స్థానిక జిల్లా కాంగ్రెసు కమిటీలు ప్రత్యక్షముగా కార్మికులకు అండగా నిలచినవి. విద్యార్థి సంఘాలు, యితర కార్మిక సంఘాలు, ముస్లిం లీగు కూడ కార్మికులకు సంపూర్ణంగా సహాకారము చేస్తున్నవి. దిగ్బాయిలో ఏప్రిలు 18 వ తేదీన మిలిటరీ సహాయంతో కంపెనీ వారలు ముగ్గురు కార్మికులను హత్యగావించిన దృశ్యం కన్నులార గాంచి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులుకూడ ఈపోరాటంలో ప్రత్యక్షంగా జోక్యం కల్గించుకోవలసి వచ్చింది. ఈ హత్యలను విచారించుటకు అనధికార విచారణ కమిటీని నియమించుటకు మారుగా ప్రభుత్వ శాఖా విచారణ జరిపించుటవల్ల హత్యగాండ్రు నిర్దోషులుగ వదలివేయబడిరి.

ఈవిషయమై అస్సాం రాష్ట్ర కాంగ్రెసు కార్యనిర్వాహకులకు మంత్రివర్గమునకు తీవ్ర భేదాభిప్రాయములు గల్గినవి. భారత కాంగ్రెసు అధ్యక్షుడు జోక్యము కల్గించుకొనవలసి వచ్చింది.

జూన్ 1 వ తేదీని కలకత్తాలో కాంగ్రెసు అధ్యక్షులు, అస్సాం ప్రధాని బార్డోలాయి, కార్మిక సంఘ కార్యదర్శి సుధీంద్ర ప్రమానిక్‌గార్ల సమావేశం జరిగినది. ప్రధానమంత్రి, కార్మికసంఘ కార్యదర్శి సమ్మెను గూర్చి తమ యభిప్రాయములను వెల్లడి చేశారు. కాంగ్రెసు అధ్యక్షునికోర్కెపై కార్మికసంఘ కార్యదర్శి సమ్మె అచిరకాలములో పరిష్కరింపబడుటకు గాను తమ తుది మాటలుగా యీ క్రింది అత్యంత అవసరమగు కోర్కెలను తెలియజేసెను.

1. సమ్మెదారులందరిని తిరిగి పనిలో ప్రవేశపెట్టుకోవాలి 2. వివాదగ్రస్త విషయములను గూర్చి చర్చల సందర్భములో లొలగింపబడిన వారిని తిరిగి పనిలో ప్రవేశపెట్టుకోవాలి. 3. పనిలోకి తీసుకొనబడనివారికి ప్రభుత్వము భృతి కల్పించాలి. 4. వివాదగ్రస్త విషయములను గూర్చి పరిష్కరించు కమిటీని వెంటనే నియమించాలి. 5. ఈసూచనలతో కూడిన ఒక ప్రకటన ప్రభుత్వము చెయ్యాలి

అంతేగాక భారత కాంగ్రెసు అధ్యక్షుడు, పరిష్కార కమిటీ సూచనలను ప్రభుత్వము అచిరకాలములోనే అవసరమైన ఎడల శాసనము కావించి అయినా ఆచరణలోనికి తీసుకొనివస్తుననని వాగ్దానము చెయ్యాలనికూడ కార్మిక సంఘ కార్యదర్శి కోరాడు. చివరకు 10 వేల మంది కార్మికుల జీవనోపాయాలు రాష్ట్రపతి విచక్షణకే వదలివేశానని కూడ తెలియజేశాడు. ఈ కోర్కెలు నెరవేర్చుటకు బాధ్యత రాష్ట్రపతికూడ వహించవలసి వచ్చింది. కలకత్తాలో జూన్ 9 వ తేదీన ప్రధాన మంత్రి, రివెన్యూ మంత్రి, ఆయిల్ కంపెనీ మేనేజరు రాష్ట్రపతితో సమ్మె పరిస్థితులనుగూర్చి చర్చించిరి. కాని కంపెనీవారు సమాధానమునకు వచ్చు సూచనలు పొడచూపలేదు. 10 వ తేదీని అస్సాం ప్రధాన మంత్రి సుభాస్‌చంద్రబోసుతోకూడ చర్చించెను. కార్మిక సంఘ కార్యదర్శి కంపెని యజమానులు మూర్ఖత వహించి పరిష్కారమునకు ప్రతికూలురగుటవల్ల మంత్రివర్గం కంపెనీమీద తీవ్రమైన ఒత్తిడి గల్గించాలని కాంగ్రెసు ప్రధానిని కోరాడు. ప్రథమమున సమాధానపడుటకే నిరాకరించిన కంపెని యజమానులు జూన్ 15 వ తేదీకి పరిష్కారమునకు తమ స్వంత సూచనలను ముఖ్యంగా తాము సమ్మెదారులందరిని పనిలోనికి తీసుకొనక తమకు అవసరమగు వారిని పనిలో ప్రవేశపెట్టుకొని బత్తెఖర్చులు యిచ్చి ఇండ్లకు పంపుతామని, ఖాళీలు కల్గిన యెడల సంవత్సరములోపు వారిని పనిలో ప్రవేశపెట్టుకొంటామని తెలియజేశారు. ఈ సూచన కేవలము తమమీద యేర్పడిన నెపమును బాపుకొనుటకై పన్నిన పన్నాగమని రాష్ట్రపతి గుర్తించాడు. రాజీ కుదిరే సూచనలు కన్పించలేదని కార్మికులు శక్తి వంచనలేకుండ పోరాటం సాగించాలని యీ విషయమంతా అఖిలభారత కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గ సమావేశమందు చర్చించుతామని ప్రకటించాడు. తన్ను రెండవమారు కలకత్తాకు రమ్మన్నప్పుడు రాజీ కుదురునని ఆశించితినని తన ఆశాభంగము వెల్లడించాడు. అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షుని ఆశాభంగమునకు కారణం కంపెనీ యజమానుల మూర్ఖతయే.

కంపెనీ యజమానులకు అండగా కాంగ్రెసు విద్రోహులందరు కలసి పనిచేయుచున్నారు. ముస్లిం ప్రజా సామాన్యమంతయు సమ్మెదార్లకు సానుభూతిగా వుంది. మే 5 వ తేదీన శాసనసభయందలి యూరోపియన్ ప్రతినిధి రాజకీయ ఆందోళనవల్ల కార్మికులందు గల్గిన తిరుగుబాటును చర్చించాలని. అబ్దుల్ హై, కార్మికుల విజృంభణను యెదుర్కొనలేక పోయిందని అడ్జర్నమెంటు ప్రతిపాదనలు తెచ్చారు. అంతేగాక, యూరోపియన్ పెట్టుబడిదారుల పత్రికలు స్టేట్సుమన్, టైమ్సు ఆఫ్ ఇండియా కాంగ్రెసు మంత్రివర్గమును దుమ్మెత్తి పోయుచూ, యీ క్రిమినల్ గవర్నమెంటు యూరోపియన్ పెట్టుబడిదారులను నాశనము చేయుచున్నదనియు, చట్టవిరుద్ధంగా ప్రవర్తించుచున్నదనియు ప్రచారం సాగించినవి. పూర్వం మంత్రివర్గ ప్రధాని సాధుల్లా హిందూ ముసల్‌మాన్ ప్రజాసామాన్యమునకు వ్యతిరేకముగా తెల్లదొరల పొగత్తలు, కాంగ్రెసును నిందించుటయు ప్రారంభించాడు.

మరియొక ప్రక్క కంపెనీ పెట్టుబడిదారులు కార్మికులను వారి నాయకులపై రౌడీలను ప్రయోగించి దౌర్జన్యమునకు పురిగొల్పుచున్నారు. కార్మిక నాయకులను బెదరించుతూ ఆకాశ రామన్న వుత్తరాలు వ్రాయబడుచున్నవి. ఇవి ప్రభుత్వమునకు, కాంగ్రెసు కమిటీలకు పంపబడినవి. కాని వీటి విషయం మంత్రివర్గం తగు చర్య తీసుకొనలేకపోయింది. అంతేగాక పెట్టుబడిదారుల బెదరింపులను తీవ్రముగా ఎదుర్కొనలేకపోయింది. అంతేగాక రాష్ట్రపతి సమాధానపరచు ప్రయత్నాలు జరుగుచున్న సందర్భములోనే 144 సెక్షను పొడిగింపబడినది. పోలీసు, మిలటరీ అత్యాచారాలను నిరసించుచూ, కార్మిక సంఘము అనేకసార్లు ప్రభుత్వమునకు రిపోర్టు చేసిరి. అత్యాచారాలను యెదుర్కొనుటకు గవర్నరు ఇంటి ముందు సత్యాగ్రహం చేయవలసి వస్తుందని రాష్ట్రపతికి 8 వ తేదీన తంతి ద్వారా తెలియజేయబడినది.

ఇక ప్రజాసామాన్యమంతయు కార్మికులు సఫలీకృతులు కావాలని విరాళములు వసూలుచేస్తున్నది. బెంగాలులో కాంగ్రెసులోని అతివాదులు, మితవాదులు, సోషలిస్టు, కార్మికసంఘాలవారు సహాయం చేయుటకు ఒక కమిటీగా ఏర్పడి బహిరంగ సభలు జరిపి కార్మికులకు సహాయం చేయుటకు పూనుకొన్నారు.

భారత కాంగ్రెసు యీ సమస్య చేబట్టిన ఎడల కార్మికుల జయించుట మసాధ్యముకాదు. ఇందుకు రానున్న కార్యనిర్వాహకవర్గ సమావేశమందు కార్మికులకు ధనసహాయమునకు ప్రయత్నించుటయే కాక, కార్మిక పోరాటములందు అస్సాం రాష్ట్ర కాంగ్రెసు పూర్తిగా పాల్గొనేటట్లు చెయ్యాలి. మంత్రివర్గము కంపెనీ యజమానులకు పోలీసు, మిలటరీ సహాయం పంపరాదని తాకీదు పంపాలి. యజమానులు యితరులను పనిలో ప్రవేశపెట్టుకోకుండునట్లు చేయుటకు 144 వ సెక్షన్ యజమానులపై ప్రయోగించాలి.

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ నిర్ణయం

కాంగ్రెస్ నిబంధనావళిలో మార్పులు

2. అన్ని సామ్రాజ్య వ్యతిరేక శక్తులను కేంద్రీకరింపచేసి విజృంభించునట్లు చేయవలసిన యీ దినాల్లో, జాతీయ వాంఛా తీర్మానాన్ని అమలు జరిపించి సంస్థాన ప్రజా ఉద్యమాన్ని జయప్రదంగా సాగించవలసిన ఈదినాల్లో కాంగ్రెసులో రైతు-కూలీ-సోషలిస్టు వగైరా తీవ్రసామ్రాజ్య విద్వేష సంఘసభ్యులకు తావులేకుండుటకై కాన్‌స్టిట్యూషన్ మార్చుటకు కాంగ్రెస్ పెత్తందార్లు ప్రయత్నించుచుండుట దేశానిర్దక దాయకమని ఈ కమిటీ ప్రకటించుచున్నది.

3. యీనాటి ప్రత్యేక పరిస్థితులబట్టి సత్వరముగా జాతీయ సంరంభాన్ని సాగించుటకు దేశములను వెనువెంటనే తయారు చేసి జాతీయ వాంఛా తీర్మానాన్ని అమలు జరుపవలెనంచే కాంగ్రెసు యొక్క ఈ నాటిపైఖరి త్వంతముగా మారవలసియున్నది. రైతు-కూలీ సంఘాలతో సంపూర్ణముగా, కాంగ్రెసు సహకారం చేస్తూ, జాతీయ సంరంభమును జయప్రదముగా సాగించగల్గుటకై రైతు-కూలీరాజ్య స్థాపనకు దారితీయుటకై దేశములోని తీవ్రవాదులంతా ఐక్యతచెందుట మంచిది. ఈలాంటి ఆశయములు గలిగిన 'ఫార్వర్డు బ్లాకు' స్థాపనకు ఈ సంఘం సంతసించుచున్నది. స్వంతముగా అతివాదవర్గాల ప్రతినిధుల సభను జరుపుటలో రైతుసంఘ పెత్తనదార్లు కూడ తగిన శ్రద్ధ చేయవలసినదని హెచ్చరించుచున్నారు.

4. రైతాంగ స్వచ్ఛంద సేవకులంతా యీక్రింది ప్రమాణమును గైకొనవలయును.

అఖిలభారత రైతు మహాసభవారి ఆశయములను అమలు జరుపుటకు మా పై అధికారుల ఉత్తరవులను ఉల్లాసముతో శిరసావహించుటకు ప్రమాణము చేయుచున్నాను.

5. తిరిగి పెరుగుచున్న 2 వ ఆర్థిక మాంద్యమువల్ల నీరసింపబడుచు పంటలన్నీ పోవటంవల్ల బీదలైపోవుచున్న వెంకటగిరి రైతులకు ప్రత్యేకంగా భరింపరానంతటి శిస్తులను పూర్తిగా చెల్లుబడి చేయాలని నిర్బంధించుచున్న జమీన్‌దారుని కార్యకలాపమును తీవ్రముగా నిరసించుచూ, ఆ బీదరైతులకు ఆధమం రూపాయికి ఎనిమిది అణాలు చొ॥ రిమీషను ఇప్పించి రైతుల వ్యవసాయపు ఖర్చులకు, పోషణకు, వలయు ధాన్యమును, పశువులను, యే పరిస్థితులలోను, శిస్తుకై జప్తు చేయకుండా చూచుటయు జప్తులవిషయమై జమీన్‌దారునకు పోలీసు కుమ్మక్కు చేయకుండుటయు ప్రభుత్వ ధర్మమని యీ సంఘం తీర్మానించుచున్నది.

ఫార్వర్డు బ్లాకు : అతివాదుల ఐక్యత

కామ్రేడ్ పి. సి. జోషి

సమీపించుచున్న ప్రపంచ సంగ్రామ సమయంలో తన చిక్కులనుండి బయటపడటానికి సామ్రాజ్యవాదులు భారత జాతీయశక్తులతో చీలిక అపేక్షించుతారు అలా చేయగలిగినపుడే భారత దేశాన్నికూడ యుద్ధంలోకి బ్రిటను యీడ్చుకొనగలుగుతుంది. కాని మన కాంగ్రెసు నాయకులు ఈ సంగతి గుర్తించుట లేదు. జాతీయవాదులలో సంపూర్ణ ఐక్యత నేర్పరచి స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించుటకు బదులు మితవాద నాయకులు తీవ్రవాదులను కాంగ్రెసు నుండి తరుమడానికి ప్రయత్నించుచున్నారు. నేడు జాతీయ ఉద్యమాన్ని ఎదుర్కొనుచున్న ప్రధాన అపాయం ఇదియే. అందుచేతనే మితవాద నాయకత్వంపై అసంతృప్తి తీవ్రమవుతూ వుంది. మితవాదులు అవలంబించుచున్న వినాశకరమైన విధానంపై కోపం నాయకత్వంపై తిరుగుబాటుకు దారి తీస్తుంది. “మితవాదనాయకత్వం సామ్రాజ్యవాదంతో పోరాటానికి బదులు మనపై పోరాటం సాగించుతూంది. అందుచే మనం ముందు వీరితో పోరాడి యీ నాయకత్వాన్ని తొలగించి సామ్రాజ్యవాదంతో పోరాటానికి దారి సుభపరచుకొందాము” అనే భావం బయలుదేరింది.

తీవ్రవాద పార్టీలు, ముఠాలమధ్య అనేక విభేదాలుండుటచే బలహీనంగా ఉన్నాయి. తీవ్రవాదులలో ఐక్యత చేకూరక పోవుటచే సాధారణ సభ్యులలోని అసంతృప్తిని సరియైన మార్గంలో పెట్టి నాయకత్వం వహించలేక పోతున్నారు. మితవాదుల దాడి, తీవ్రవాదులు దాన్ని సరిగా ఎదుర్కొ లేకపోవడం, కొందరు, మితవాదులపై పోరాటమే ప్రధానంగా బోధించడానికి అవకాశమేర్పడింది.

తీవ్రవాదుల ఐక్యత.

కమ్యూనిస్టులము యీ అపాయాన్ని గుర్తించి 1938 సెప్టెంబరు లోనే ‘లెఫ్ట్ బ్లాక్’ కావాలని సూచించాము. దీనిద్వారా తీవ్రవాదుల ఐక్యత ఏర్పడితే మితవాదులదాడిని అరికట్టి జాతీయవాదులలో చీలికలు రాకుండా చేయవచ్చుననీ, తద్వారా స్వాతంత్ర్య పోరాటానికి దారి తీయవచ్చుననీ మేము వాదించాము. కాని కాంగ్రెస్ సోషలిష్టు నాయకులలో కొందరు తీవ్రవాదుల సంస్థ (లెఫ్ట్ బ్లాక్) ఏర్పడుతే కాంగ్రెసులో చీలికలు కలిగిస్తుందనీ, మితవాదులపై ఎడతెగని పోరాటానికి దారితీస్తుందనీ ఆక్షేపించారు. మేము తీవ్రవాదుల ఐక్యత మితవాదులదాడిని అరికట్టడానికేననీ, తద్వారా జాతీయ ఐక్యత సాధించవచ్చునని వాదించాము. ఐక్యతకొరకు పూనుకోకపోతే, మితవాదులు, చేసే పోరాటాన్ని భగ్నం గావించి, బ్రిటిషు సామ్రాజ్యవాదులకు లొంగిపోయే ప్రయత్నాలను ఎదిరించలేమనీ, కాంగ్రెసు ఐక్యతను కాపాడ లేమనీ స్పష్ట పరచాము. తరువాత త్రిపురిలోనూ, కలకత్తా ఎ. ఐ. సి. సి. సమావేశంలోను జరిగిన ఘటనలు పై సంగతినే రుజువు చేస్తాయి.

ఫార్వర్డు బ్లాకు

సోషలిస్టులు, కమ్యూనిస్టులు కలసి తీవ్రవాదుల ఐక్యతను సాధించలేక పోవుటచే తీవ్ర జాతీయవాదులు ఫార్వర్డు బ్లాకు ఏర్పరచారు. మేము దాన్ని హర్షించాము. కాని ఫార్వర్డు బ్లాకు తీవ్రవాదు లందరి ఐక్యతను సాధించలేదనీ, అందుకోసము తీవ్రజాతీయవాదులు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు కలసిన ఒక కాన్ఫరెన్సు జరపాలనీ కోరాము. ఫార్వర్డు బ్లాక్ నాయకులను తమ ఉద్దేశాలు, రాజకీయ కార్యక్రమం ప్రకటించాలని కోరాము. వారు ప్రకటించిన కార్యక్రమం తీవ్రవాదుల ముఠాకు తగినదిగానే వుంది: కాని కొందరి ముఖ్యులైన నాయకుల ఉపన్యాసాలలో, ప్రకటనలలో జాతీయ ఐక్యతా విధానానికి విరుద్ధమైన విషయాలు కొన్ని వుంటున్నాయి.

కాంగ్రెసులో చీలికను గురించి బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. మేము తీవ్రవాదుల ఐక్యత జాతీయ ఐక్యతను సాధించడానికే కోరుతున్నాము. నేడు కాంగ్రెసు మహాసభ ఒకటే ప్రజలందరిని స్వాతంత్ర్య పోరాటానికి నడుపగలిగిన సంస్థ. కాంగ్రెసులో చీలికలు కల్గించుట ఆత్మవినాశకరమైన పని: స్వాతంత్ర్య పోరాటాన్ని భగ్నంచేయుట అవుతుంది. మితవాదులు కాంగ్రెసులో చీలికలు కల్గించడానికి తీవ్రవాదులను తరిమివేయడానికి ప్రయత్నిస్తున్నారు. తీవ్రవాదులుకూడ ఆ పద్ధతే అవలంబిస్తే కాంగ్రెసులో చీలికలువచ్చి జాతీయ ఐక్యతే భగ్నమైపోతుంది.

కొందరు ఫార్వర్డు బ్లాక్ నాయకులు కాంగ్రెసు నాయకత్వంలో పానిజాన్ని గురించి, ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని గురించి మాట్లాడుతున్నారు. ఇట్టి మాటలు మితవాదులపై కేవలం కత్తికట్టడాన్నే సూచిస్తాయి. ఇవి సాధారణ సభ్యులకు నాయకత్వముపైవున్న అసంతృప్తిని సూచిస్తాయేగాని రాజకీయ నాయకత్వముయొక్క కర్తవ్యాన్ని సూచించవు. ప్రస్తుత సందిగ్ధావస్థ మితవాదులకు వ్యతిరేకముగా పోరాటం సాగించుట ద్వారానే తొలగదు: మనము ఐక్యతకొరకు జాతీయ పోరాటం ప్రారంభించుటకై సన్నాహాల కొరకు పోరాడి, కాంగ్రెసు సామాన్య సభ్యులందరి బలాన్ని సంపాదించినపుడే సాధ్యమవుతుంది. మితవాదుల దాడిని అరికట్టుట, వారిపై పోరాటానికి కాలుదువ్వుట ద్వారా సాధ్యపడదు: తీవ్రవాదులందరూ కలసి కాంగ్రెసు వాదులలో ఎక్కువమంది బలాన్ని దిగజారుడు పాలసీకి. లొంగిపోయే విధానానికి వ్యతిరేకంగా సంపాదించినపుడే సాధ్యమవుతుంది.

ఇపుడు కాంగ్రెసు వాదులలో ఎక్కువమంది జాతీయ పోరాటం ప్రారంభించాలని కోరుతున్నారు. కాని వారికి ప్రస్తుత నాయకత్వంపై నమ్మకముంది. ఈస్థితిలో వేరొక నాయకత్వమనే నినాదం లేవదీయడం వలన అత్యధిక సంఖ్యాకులగు కాంగ్రెసు వాదులనుండి తీవ్రవాదులు దూరమగుటయే సంభవిస్తుంది. అందుచే కేవలం మితవాదులపై కత్తిగట్టడం, మితవాదులదాడిని అరికట్టలేకపోగా వారిని బలపరుస్తుంది....

జాతీయ నాయకత్వము, జాతీయ సంఘటనలో వివిధశక్తుల పరస్పర సంబంధాన్ని ప్రతిబింబిస్తూ ఉంటుంది. (తెలియజేస్తూ ఉంటుంది) అలా ప్రతిబింబించనపుడు అది ఉద్యమానికి మెడ గుదిబైై వినాశకారి అవుతుంది. నేడు దేశములో శక్తులనుబట్టి కావలసినది వానికి సరిగా ప్రతినిధిత్వము వహించగల్గినది సంయుక్త నాయకత్వము. నేడు మనకున్న ఒకేధోరిణిగల మితవాద నాయకత్వమూ పనికిరాదు, కొంతమంది అతివాదులు కోరేటట్లు వేరొక క్రొత్తనాయకత్వమూ కాదు. ఒకేధోరిణిగల నాయకత్వము పోరాటానికి అడ్డంకిగావుండి పోరాటాన్ని భగ్నముచేస్తూ ఉంది. క్రొత్తనాయకత్వమును, దేశములోని స్వాతంత్ర్య శక్తులలో విచ్ఛేదము కలిగించడము ద్వారానే ఏర్పాట్లు చేయగలము. ‘లేదా అది కేవలము మాటలలోనే ఉండి ఆచరణలోకి తేబడజాలదు. అందుచేత సంయుక్త నాయకత్వం కోసమే అతివాదులు పోరాడాలి. ప్రజాసామాన్యము దేశవ్యాపక స్వాతంత్ర్య పోరాటములో తమ అనుభవమువలన పాతనాయకత్వము పోరాటాన్ని వ్యతిరేకిస్తూ భగ్నము చేస్తూ ఉందని తెలుసుకొన్నప్పుడే, క్రొత్తనాయకత్వము. వస్తుంది. ఈపోరాటము రాకముందే క్రొత్తనాయకత్వము కావాలనేది నినాదము ప్రజాసామాన్యాన్ని పోరాటములో పాల్గొనేటట్లు చేయక. దానినుండి దూరముగ తొలగిపోవునట్లు మాత్రము చేయును.

అతివాదులలో ఉన్న రాజకీయ విభేదాలివి. అతివాదుల ఐక్యతకు మూలమైన రాజకీయ సూత్రమును అతివాదులందరూ, స్పష్టముగా తెలుసుకొని అంగీకరించ నంతకాలము, అతివాదులలో ఐక్యత ఎట్టి సంఘటన రూపము తీసుకోజాలదు కాంగ్రెసులో ఐక్యతను కాపాడే పని అన్నిటికన్న ప్రధానమైనదని అంగీకరించని అతివాదులతో కమ్యూనిస్టులము కలువజాలము. కాంగ్రెసులో ఐక్యత కావలంటే, సంయుక్త నాయకత్వము యొక్క అవసరము గుర్తించాలి. దానికోసంపనిచేయాలి.

అతివాదుల ఐక్యతకు నిర్మాణము ఏవిధంగా ఉండాలి ?

అతివాదుల ఐక్యత, ఒక “బ్లాక్”గా ఉండాలి. పార్టీగా ఉండకూడదు. అయితే, “బ్లాక్”కు, పార్టీకి భేదమేమి ?

బ్లాక్ అంటే వివిధపార్టీలు వివిధ రాజకీయ ముఠాలు (గ్రూపులు) కలిసి ఉండడము. ఈ కలసి ఉండడములో మామూలుగ ఈ వివిధ పార్టీల ప్రతినిధులు మాత్రము ఉంటారు. ఒక బ్లాక్ ఎప్పుడూ ఈ వివిధపార్టీ ప్రతినిధుల అంగీకారముతో నిర్ణయములు చేయుచుండును. ఏ ఒకపార్టీ అంగీకరించకపోయినను, నిర్ణయము చేయుటకు వీలులేదు.

పార్టీలో వ్యక్తిగతంగా సభ్యులు చేరుతారు నిర్ణయాలు అధిక సంఖ్యాకులు ఇష్టప్రకారము, మెజారిటీ ఓటు ప్రకారము చేయబడుతాయి.

[కొన్ని సమయాలలో బ్లాక్‌లో వివిధ పార్టీల ప్రతినిధులేగాక ఆ పార్టీలలోని సభ్యులందరూ వ్యక్తిగతంగానే చేరవచ్చు. కాని వారు వారి పార్టీ నిర్ణయాల ననుసరించియే బ్లాక్‌లో పనిచేస్తూ ఉంటారు. ఆ పరిస్థితులలో మెజారిటీ నిర్ణయాలు, ఏపార్టీకి మెజారిటీ ఉంటుందో ఆపార్టీ నిర్ణయాలుగానే ఉంటాయి. అప్పుడు ఇతరపార్టీలు దాని కంగీకరించనపుడు బ్లాక్‌లో నుండి విడిపోవచ్చును. అందుచే, ఒక బ్లాక్‌లో వ్యక్తిగతంగా ఒక పార్టీ సభ్యులు అధిక సంఖ్యాకులుగా ఉండినప్పటికినీ, ఆపార్టీ పూర్తిగా తన దృక్పథమే నెగ్గాలని పంతము పట్టితే బ్లాక్ విచ్ఛిన్నమవుతుంది. దీనినిబట్టి బ్లాకుకు, పార్టీకి ప్రధాన భేదము సభ్యత్వ విషయములోగాక, తీర్మానములు చేయుటలోనే ఉంది. బ్లాక్ తీర్మానమును దీనిలోని వివిధ పార్టీల అంగీకారముతో చేయును: పార్టీ అలాకాక తనలోని వివిధ సభ్యుల మెజారిటీ ఓటును బట్టి చేయును. — సం.]

ఫార్వర్డు బ్లాక్ జాతీయ అతివాదులనందరిని తనవైపుకు ఆకర్షించుచున్నది. ఫార్వర్డు బ్లాకు ఒకపార్టీగా ఏర్పడుతూ ఉంది. ఇప్పే ఫార్వర్డు బ్లాకు పార్టీలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు వ్యక్తిగతంగాచేరి, తాము తమ పార్టీలలో ఏరకంగా ఎవరిమటుకు వారు ఓటుచేస్తూ ఉంటారో ఆలాగే ఫార్వర్డు బ్లాక్‌లోకూడ ఓటు చేస్తూ ఉండాలనడము, వారి పార్టీలను రద్దు చేసుకోవడమే అవుతుంది. తమ పార్టీలను రద్దు చేసుకోవడమంటే సోషలిజాన్నుండి వెనుదిరిగి జాతీయ అతివాద దృక్పథమువైపుకు మరలుట అవుతుంది. వారు తమ్మతమ పార్టీ నిర్ణయాల ప్రకారము ఫార్వర్డు బ్లాకులో ఓటు చేసే పక్షాన వ్యక్తిగతంగ చేరడములో అర్థమేమీలేదు. అందుచే ఫార్వర్డు బ్లాకులోని జాతీయ అతివాదులూ, సోషలిస్టులూ, కమ్యూనిస్టులు తమ ప్రతినిధులను పంపి, వీరందరిచే అంగీకరింపబడిన ఒక కార్యక్రమాన్ననుసరించి పని చేయడానికి ఒకబ్లాక్‌గా ఏర్పడడమే సరియైన పద్ధతి. దీనికి మరియొక కారణము, జాతీయ అతివాదులకూ, సోషలిస్టులకూ, కమ్యూనిస్టులకూ, పరస్పరము కొన్ని విషయాలలో ఐక్య కార్యక్రమమున్ననూ, మూలసూత్రాలలోనే కొన్ని భేదాలున్నవని కూడ మరచిపోకూడదు. ఈ భేదాలున్నంతకాలమూ వీరందరూ కలిసి ఒక పార్టీగా ఏర్పడలేరు. కేవలము ఒక బ్లాక్‌గా మాత్రము ఏర్పడగలరు.

కాంగ్రెసు సోషలిస్టుపార్టీకూడ అంగీకరించింది.

మొట్టమొదట కాం॥ సో॥ పార్టీనాయకులు కొంతమంది వ్యతిరేకించినా, నేడు పార్టీ అతివాదుల ఐక్యసంఘమును ఏర్పరచడానికి, దాని కార్యక్రమమును నిర్ణయించడానికి అతివాదుల సభను జరుపాలని అంగీకరించింది. కాని అట్టి సభలో పాల్గొనడానికి ఫార్వర్డుబ్లాకు నాయకులు నిరాకరించారు.

మేము ఫార్వర్డుబ్లాకు నాయకులతో ఎంతో వాదించి చూచితిమి. ఒకబ్లాక్‌నూ, పార్టీకి ఉన్న భేదమును వారు గుర్తించడము లేదు. మేము ఫార్వర్డుబ్లాకు పార్టీలో చేర్చి మా రాజకీయ స్వాతంత్ర్యాన్ని, నిర్మాణ స్వాతంత్ర్యాన్ని గోల్పోవడానికి ఒప్పుకో లేదు. కేవలము ప్రాక్షనుగా, (ముఠాగా) పని చేయుటకు ఫార్వర్డుబ్లాకులో కమ్యూనిస్టులు ప్రవేశించినను, అలా ప్రవేశం దానికి సోషలిస్టులు అంగీకరించుట, సోషలిస్టుల

అభిప్రాయము అలాచేసి ప్రాక్షనుగా పనిచేయ డము ఎక్కువ ఘర్షణలకు కారణమవుతుందనీ, ఆ పరిస్థితులలో చేరినా లాభముండదని. కమ్యూనిస్టులు, సోషలిస్టులలో ఎవరూ చేరకపోయి నమా ఫార్వర్డుబ్లాక్ సిజంగా అతివాదుల ఐక్య సంఘటన కాజాలదు. పైగా అట్టి ఐక్యతను ముందు ముందు కూడ రాకుండ చేస్తుంది.

ఈ రోజు మనల నెదుర్కొంటూ ఉండే సమస్య పోరాటమా లేక లొంగిపోవడమా? సోషలిస్టులు, కమ్యూనిస్టులు, జాతీయ అతివాదులు పోరాటము కావాలంటున్నారు. వీరందరిలో ఐక్యత వచ్చినా స్థానిక ప్రజాపోరాటాలు, రోజురోజు పోరాటాలు బలపడుతాయి. వీరందరూ కలని అరంభించిన రాజకీయ ఆందోళనలు దేశవ్యాపిత జాతీయ పోరాటానికి దారితీస్తాయి. అనేకమంది కాంగ్రెసు వాదులను రోజురోజుకు మనవైపుకు ఆకర్షిస్తాయి. ఈ పోరాటాలు ఎక్కువయ్యేకొలదీ ఈ అతివాదులందరూ మరింత అన్యోన్యముగా, ఘనిష్ఠంగా పనిచేయడానికి పూనుకుంటారు. తమ అనుభవ ఫలితంగా పోరాటాన్ని మరింత పెంపొందజేయుడానికి, ఐక్య సంఘటనలో మెట్టు మెట్టుగా ముందుకు పోతారు. అందుచే నేడు అతివాదులలోని వివిధగ్రూపులు, పార్టీలు అంగీకరించడానికి తయారైన సంఘటనలో అరంభిస్తాము. అట్టి సంఘటన ఎ. ఐ. సి. లోని అతివాదు లందరూ కలసి ఒక ప్రాక్షను (ముఠాగా) గా ఏర్పరడడము. దానికి నాయకత్వము, వివిధ అతివాదపార్టీలనుండి సమానముగ ఎన్నుకోబడిన కమిటీ వహిస్తుంది. ఈ కమిటీయే ప్రజాపోరాటాలను నడుపుతుంది. నిజానికి ఈ కమిటీ అతివాదులందరియొక్క కార్యనిర్వాహక వర్గంగా మారుతుంది. ప్రస్తుతము పరస్పర అనుమానాలు, ఘర్షణలు పోయేకొలది ఈ ఐక్య సంఘటన మరింత బలపడుతుంది. మరియొక అడుగు ముందుకు పోతుంది.

మాయొక్క పైవాదననంతా ఫార్వర్డుబ్లాకు నాయకులు పెడచెవిని పెట్టారు. వెంటనే పూర్తిగ అతివాదులంతా ఫార్వర్డుబ్లాకులో చేరితే చేరండి లేకపోతే, మామార్గము మాది అనే ధోరణిలో మాట్లాడారు. ఐక్యతకు నేడు వేయవలసిన మొదటి అడుగులు వేయుటకు తయారు కావడములేదు. కనీసము అతివాదుల పనులను కేంద్రీకరించడానికి ఒక కమిటీకికూడ ఫార్వర్డుబ్లాక్ నాయకులు అంగీకరించలేదు. అతివాదుల ఐక్యత వారి షరతులమీదనే కావాలని కోరడం ఐక్యతను తేవడముకాదు. విభేదాలను మా మూలుగా ఉంచడమే అవుతుంది ఈ అతివాదులలో విభేదము మితవాదుల దాడిని మరింత ఎక్కువ చేస్తుంది. అప్పుడు అతివాదులు, మితవాదుల పైకి మరింత దుముకుతారు. అతివాద, మితవాదుల ఘర్షణ బ్రిటిషు ప్రభుత్వానికి సంతోషం కలిగిస్తుంది.

అతివాదుల ఐక్యత నేడు చాల అవసరము ఏ అతివాద పార్టీకూడ తనమటుకు తానే స్వతంత్రించి జాతీయ పోరాటానికి దేశాన్ని తయారు చేయలేదు. యుద్ధము సమీపిస్తుంది. నేడు మనము కలియకపోతే, మనం ముందుకు పోలేము. అగాధములోకి జారిపోతాము.

—

బ్రిటన్ - జపాను ఘర్షణ

గత మూడు నెలల లోపల అనేకసార్లు జపాన్, బ్రిటిషు ఫ్రెంచి సామ్రాజ్యాలను ధిక్కరించుతూ వచ్చింది. జపానుచేసే దుండగాలు ఇన్నిన్నిగాదు. బ్రిటిషు ఫ్రెంచి నౌకలను ఆపి సోదాజేయడం, ఇద్దరు బ్రిటిషువారిని చంపడం, కులాంగ్సు దీవులలో అమాయ్‌వద్ద బ్లాకేడ్ (రాకపోకలు లేకుండా నిరోధించి అడ్డుగట్టటం) చేయడం, విదేశీయులను అవమానం చేయడం. ఈనాటి ఘర్షణ టీన్ట్సిన్‌వద్ద జరిగింది.

బ్రిటిషు వారికి హక్కులున్న ప్రదేశాలు చైనాలో ఇవి. హాంగ్‌కాంగ్, కాంటన్, షాంగే, టీనిన్ట్సిన్. టీన్ట్సిన్ అన్నివిధాలా ప్రాముఖ్యమైన పట్టణం అని చెప్పవచ్చు. టీన్ట్సిన్ జనాభా 1387,000.

ప్రస్తుతఘర్షణ ఎలా వృద్ధిఅవుతూ వచ్చిందో చూదాం. ఏప్రిల్ 9 వ తేదీన జపాను అనుకూలుడయిన చెన్‌షి-కాంగ్‌ను బ్రిటిష్ కన్సెషన్‌లో హత్యచేశారు. ఈచంపిన వాళ్లు కమ్యూనిస్టులనీ, వెంటనే వీరిని అప్పజెప్పవలసిందనీ బ్రిటన్‌కు జపాను అల్టిమేటం పంపింది. కాని బ్రిటన్ అందుకు అంగీకరించలేదు. జపాను ఆఫీసర్లు, కొందరిని అరెస్టుచేసి, దారుణంగా హింసించడంవల్ల తామే హత్యగావించామని నల్గురు చైనావారొప్పుకొన్నారు. కాని తర్వాత నిజంచెప్పారు. వారిని జపానుకు అప్పజెప్ప దానికి బ్రిటన్ నిరాకరించింది. కావాలిస్తే ఈ ఘటనను గురించి విచారించడానికి ఒక బ్రిటిషు వానిని, ఒక జపానువానిని, మరొక మధ్యవర్తినీ కలిపి ఒక కమిటీని నియమించుతామని బ్రిటన్ తెల్పింది. కాని దానికి జపాను అంగీకరించలేదు.

జపాను, బ్రిటిషు, ఫ్రెంచివారి భాగాలను బ్లాకేడ్ చేస్తామని, జపాను-చైనా ప్రదేశాల మధ్య ఎవరినీ పోనీయమనీ, పీ నదిమీదనున్న (అంతర్జాతీయ) బ్రిడ్జినికూడా మూసివేస్తామని చెప్పి 14 వ తేదీని బ్లాకేడ్ ప్రారంభించింది.

జపాను ఇలా చేయడానికి కారణం ఏమిటి? జపాను ఈ మధ్య చాలా దెబ్బలు తింది. చైనా యుద్ధంలో ఇపుడపుడే తమకు జయంగలిగే లక్షణాలు కన్పించకుండటం గాకుండా ఓడిపోవుటంకూడ తటస్థించుతున్నది. యుద్ధంవల్ల, ఆర్థికంగాను పీడితులైన ప్రజలలోని, నిరుత్సాహాన్ని ఇంకో వక్రమార్గాన్ని తిప్పి హర్షింపజేసేటట్లుచేయాలి. అందుకోసం ఇదొక ఎత్తు. ఇంతేగాదు. బ్రిటిషు ఫ్రెంచి, అమెరికన్ ప్రదేశాలలో అనేకమంది చైనా అర్థులు జపాను దుష్కృత్యాలకు సహించలేక తలదాచుకొంటున్నారు. వారిలో కొందరపుడపుడు జపాను ఆఫీసర్లకు ఊపిరాడనీయడంలేదు. బాధపెడుతున్నారనే వంకతో బ్రిటిషు ఫ్రెంచి.అమెరికా ప్రదేశాలను పూర్తిగా తరిమివేయాలని జపాను ప్రయత్నించుతుంది. అయితే అంత సులభంగా పోతారా?

ఒకవేళ అక్కడ ఉన్నా. వీరు తమకు అడ్డులేకుండా ఉండాలి. చైనా గెలిచేటందుకు తగిన అవసరమైన సహాయం బ్రిటన్ చేయకపోయినా, కొద్దికొద్దిగా ఋణాలీయడం మనం చూస్తూనే ఉన్నాం. ఆ సహాయంకూడా మాని, జపాను ఆశయాలకు బ్రిటన్ సహాయం చేయాలని జపానుకోర్కె.

అందుకోసమే, టీన్ట్సిన్‌లో జపాను మిలటరీ అధికారి బ్రిటిషు అధికారులను చూడ నిరాకరించాడు పైగా "ఇది ప్రధానమైన సమస్య. బ్రిటన్ చంగ్-కై-షేక్‌కు సహాయం ఇవ్వనిలా కరించితే తప్ప సంధికుదురదు" అని జపాను పత్రికలు వ్రాస్తున్నాయి. జపాను రాజకీయవేత్తలంటున్నారు.

250,000,000 పౌనులు పెట్టుబడి పెట్టింది చైనాలో బ్రిటన్. ఈ నష్టకాన్నంతా పడులు కొని పోతుందా? లేదు. అయితే ఇన్ని రోజుల వరకు సరియైన చర్య తీసుకోపోడానికి కారణం ఏమిటి? ఆహారం దొరకడంలేదు. చెప్పరాని అవమానాలు చేస్తున్నారు సోదాలు చేస్తున్నపుడు. 'తీవ్రంగా అసమ్మతము' పంపినా జపాను లెక్కచెయ్యడంలేదు. ఇక నేం చేస్తుంది బ్రిటన్? అనే ప్రశ్నలు వస్తాయి.

నేటి జపాను చేసే చర్యలకూ-అటు హిట్లర్ ముస్సోలినీలకు సంబంధంలేదని తలచడం పొరబాటు. జర్మనీ ఇటలీలు మిలటరీ ఒడంబడిక గావించుకొన్నాయి. కాని జపాను అందులో తన బలహీనతవల్ల చేరలేకపోయింది. కాని తాను వాళ్ళని సంతృప్తి పఱచడానికి అవుడపుడూ ఇటు చైనాలో, గిల్లి కజ్జాలు పెట్టుకోవాలి. ఫ్రాంసు, అమెరికాలకు ముఖ్యంగా బ్రిటన్‌కు ఒత్తిడి తేవాలి. నేడు సోవియట్‌తో రాయబారాలు జరుగుచున్నాయి. ఈరాయబారాలు సఫలమవుతాయేమో? సోవియట్ ప్రాచ్య ప్రదేశంలో కూడ హామీ ఇవ్వమని బ్రిటనును అడుగుతుందేమో? అని భయపడి, ముందుగానే బెదిరించి, ఈసోవియట్ రాయబారాలు సఫలం కాకుండా ఉండేందుకు జపాను ప్రయత్నించుతున్నది. దీనికి జర్మనీ ఇటలీలు ప్రోత్సహించినాయి. జపానుకూడ సోవియట్‌కు బ్రిటన్ ప్రాచ్య దేశాలలో హామీ ఇవ్వకుండా ఉండేందుకు తెచ్చిన ఒత్తిడి ఇది.

ఇంతేగాదు. ఏదోవిధంగా బ్రిటన్ మీద ఒత్తిడితెచ్చి, తమ కనుకూలంగా జంగ్-కై-షేక్ రాజీ చేసికొనడానికి బ్రిటన్ సాయపడాలని జపానువాంఛ. అందుకనే "ఇది ఒక్క స్థానిక తగాదా కాదు." అని జపాను అధికారులంటున్నారు. అటు జర్మనీ-ఇటలీ పత్రికలు సంతోషించుతున్నాయి. "జర్మనీ-ఇటలీలను బోల్షివిక్కుల సహాయముతో చుట్టివేయాలనుకొన్నారు. కాని వారే జపానుచేత చుట్టివేయబడ్డారు" అని ఒకపత్రిక వ్రాసింది.

ఈదురాక్రమణను ఆపుచేయాలంటే బ్రిటన్ ఫ్రాంసు, అమెరికాలు కలిసి ఎదుర్కోవాలి. అంతేగాని ఏదో ఆర్థిక ఆంక్షలువేసి జపానును లొంగదీయాలని ప్రయత్నించడం, యూరప్‌లోని "అపీజ్‌మెంటు పాలిసీ" ఇక్కడ కూడా అవలంబించడం, పైసామ్రాజ్యాల హక్కులే గాక చైనా స్వాతంత్ర్యంకూడ మంట గలవడానికి దారితీస్తుంది.

సవరణ

గత సంచికలో 'బాల్టిక్' అనే పదానికి బదులు ప్రతిచోటా 'బాల్కన్' అని పడింది. సరిచేసుకొని చదవండి.

★

ఈ సంచికలో 5-వ పేజీలో రెండవకాలం నాల్గవ పేరా, నాల్గవ పంక్తిలో.

28 కి బదులు 80

30 కి బదులు 28 ఉండాలి.

ఉ॥ వి॥ జిల్లా రైతుసంఘ సాధారణ సమావేశం.

23-6-39 ని శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కాశీబుగ్గ రహదారీ బంగళావద్ద ఈ దిగువ విషయాలు విచారించి నిర్ణయించుటకై పై సంఘ సమావేశము జరుగును. గాన తత్ సంఘ సభ్యులగు తాము తప్పక దయచేయ ప్రార్థన.

విషయములు.

1. జిల్లాసంఘ సంవత్సర కార్యక్రమ జమాఖర్చుల నివేదిక.
2. అధ్యక్షుల, కార్యదర్శుల, కార్యవర్గసభ్యుల యెన్నిక.
3. రైతాంగ ముద్రణాలయం, ప్రజావాణి పత్రికలయొక్క రిపోర్టుల పరిశీలన, వాటి నిర్వహణం గూర్చి ఆలోచించుట.
4. మునగాల ఎస్టేటు రైతు సత్యాగ్రహ పోరాటమును గూర్చి.
5. కార్యదర్శి ప్రవేశపెట్టు యితరవిషయాలు.

గౌతు లచ్చన్న.
కార్యదర్శి.
ఉ॥ వి॥ జిల్లా॥ రైతుసంఘం.

నవశక్తి

పార్టీ సభ్యులు ముఖ్యంగా గమనించాలి

జూన్ నెల కోటా — చేర్పించినది.

	సం॥ రేక	క్రై సం॥ చందా	సం॥	క్రై సం॥ చందా
విశాఖపట్టణం	4	8	2	0
తూ. గోదావరి	15	30	1	1
ప. గోదావరి	20	40	2	2
కృష్ణా జిల్లా	37	74	9	5
గుంటూరు	25	50	3	5
నెల్లూరు	25	50	5	0
ఇతర స్థలాలు	8	16	3	2
	134	268	25	15

★ ★ ★

పార్టీ సభ్యులంచరు తీవ్రంగా కృషిచేసి తమ జిల్లా కోటాలను పూర్తిచేయాలి. నవశక్తి విడిప్రతులు అమ్మకం ఎక్కువ చేయాలి. విరాళాలు పోగుచేయాలి. జిల్లాలు, తాలూకాలు యీ పని నెరవేర్చడంలో సోషలిష్టు కాంపిటీషన్‌తో పనిచేయాలి. నవశక్తి నిలవడం యింకా వృద్ధి అవడం మీ చేతుల్లోనే వుందనే సంగతి మరువకూడదు. — సంపాదక వర్గం.

తునికిపాడు రైతాంగ విద్యాలయం

తిరువూరు నందిగాము తాలూకాలు బహు పేదరికమును అనుభవించు ప్రజలచే నిండియున్నవి. ప్రజలకు విద్యాజ్ఞానము, రాజకీయ చైతన్యము తక్కువ, నిస్సారమైన భూములు, వేసవి విత్తనములైనను వండుట కష్టము. శిస్తులు మెండు, ఏవిధమైన సౌకర్యములు లేవు. వేసవిలో నీళ్ళయినను దొరకవు. జమీందారీ పరిపాలనలో కృంగి కృశించుచున్నారు. ఇప్పటి ప్రజలనుభవించు బాధలకు సాక్షి నేటి మునగాల, గంపలగూడెం ఎస్టేట్లలోని ఘోర కృత్యములే.

వీటికి తోడు సరిహద్దున నున్న నైజాం స్టేటు ప్రజలనుభవించు బాధలు వర్ణించ నలవికాదు. ఇచ్చటి ప్రజలకు స్వతంత్రించి యే వుత్సవములు, సభలు ప్రభుత్వ అనుమతి లేనిదే జరుపుకొనుటకు వీలులేదు. ఇవి అవి అననేల ఇంటికివచ్చిన బంధువు వుండుటకు కూడ ప్రభుత్వపు అనుమతి పొందవలసినదే, ఈ ప్రజలు చదువు సంధ్యలు లేక అతి మూఢత్వమున నున్నారు, పంటలను మించు పన్నులు. కదిలితే తంటా, మెదలితే తంటా. శాయిరీ (కష్టమ్సు) బాధలు, అధికారీ జులుము, లంచగొండి తనము బహు జాస్తి. కాంగ్రెసు పేరు తలపరాదు. తమ బాధలు లోకానికి వెల్లడించరాదు.

ఈ ప్రాంతములు కలసిన కూడలిలో రైతాంగ విద్యాలయం స్థాపించబడినది.

తిరువూరు తాలూకాకు చెందిన యీ చిన్ని గ్రామంలో మే 25 వ తేదీని విద్యాలయానికి కామ్రేడ్ మద్దుకూరి చంద్రశేఖరరావు (నవశక్తి సంపాదకులు) గారు ప్రారంభోత్సవం జరిపారు. జూన్ 13 వరకు సాగింది.

కామ్రేడ్ పేట బాపయ్యగారు పతాకోత్సవం జరిపారు.

అచార్య రంగాగారు ఆచార్యత్వము వహించారు.

నిత్యం ఉదయం నామమంత్రం కామ్రేడ్ మునిపల్లె రామారావుగారు విద్యార్థులకు వాలంటీరు శిక్షణ (మిలటరీ డ్రిల్లు) నేర్పారు. మధ్య మధ్య చుట్టుపట్ల పల్లెలకు కవాతుతోవెళ్ళి ప్రజలకు ఉత్సాహం, ధైర్యాన్ని పురికొల్పినారు.

ఈ 20 రోజులలో పలువురు జాతీయనాయకులువచ్చి విద్యార్థులకు యీక్రింది విషయములపై బోధించారు.

విషయము — ఉపన్యాసకులు

1. రష్యా విప్లవము
   కామ్రేడ్ చంద్రశేఖరరావుగారు
2. ఫెడరేషన్-అంతర్జాతీయ సమస్యలు
   కామ్రేడ్ ఆర్. నరసింహారెడ్డిగారు
3. సాహిత్యం-ప్రజానీకం
   కామ్రేడ్ శెట్టిపల్లి వెంకటరత్నంగారు
4. ఋణచట్టం
   శ్రీయుత కా. పూర్ణమల్లి ఖార్జునరావుగారు యమ్. ఎల్. సి.
5. భారత కార్మికోద్యమము
   కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లుగారు
6. భారత స్వాతంత్ర్య పోరాటాలు
   కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణగారు
7. కో-ఆపరేటివు ఉద్యమము
   కామ్రేడ్ డి. సీతారామయ్యగారు
8. పశువైద్యం
   డాక్టర్ యేకెళ్ళ శ్రీరాములుగారు
9. జమీన్‌దారీ దురంతాలు
   శ్రీయుత గద్దె రంగయ్యనాయుడుగారు యమ్. ఎల్. ఎ.
10. ఐ. సి. యస్. ఉద్యోగీయ వర్గం
    శ్రీయుత యన్. శ్రీరామశర్మగారు బి. ఎ.
11. చరిత్ర పరిణామవాదము
    వాంధ్రదేశ చరిత్ర
    స్వదేశ సంస్థానాలు
    జమీన్‌దారీ విధానము
    భారత ఆర్థిక సూత్రములు
    భారత జాతీయ ఋణము
    పారిశ్రామిక అభివృద్ధి
    వ్యవసాయకూలి—రైతు సామరస్యము
    కూలీ రైతు ఉద్యమము
    శ్రీయుత ఆచార్య రంగాగారు
12. యువజనులు క్రమశిక్షణ
    రాష్ట్ర సమస్యలు
    సామ్యవాద సిద్ధాంతాలు
    కామ్రేడ్ మునిపల్లె రామారావుగారు
13. హైద్రాబాదు సమస్యలు
    వి. యల్లారెడ్డి, ఆర్. నారాయణరెడ్డిగార్లు (నైజాం)

క్లాసుల కాలపరిమితి

ఉదయం గం॥

4-30 నుంచి 5 దేహపరిశ్రమ
5 .. 6 డ్రిల్లు
7-30 .. 11 క్లాసు

సాయంత్రం గం॥

4 నుండి 6 వరకు క్లాసు
6 నుండి 7 వరకు డ్రిల్లు
8 నుండి 10 వరకు క్లాసు లేక గోష్ఠి

బహిరంగ సభలు

ది 4-6-39 లాహోర్ రైతు సత్యాగ్రహ దినోత్సవం.

అధ్యక్షులు : ఆచార్య రంగాగారు

ఉపన్యాసకులు : కామ్రేడ్ పేట బాపయ్యగారు
మురుకుట్ల వెంకటప్పయ్యగారు
మునిపల్లి రామారావుగారు
(చేబ్రోలు) అన్నపూర్ణమ్మగారు

ది 10-6-39 "రైతు పోరాటము—కాంగ్రెస్ రైతు ఉద్యమ సామరస్యం" "స్త్రీ ఉద్యమం—సంస్థాన పోరాటం".

అధ్యక్షులు : కామ్రేడ్ పేట బాపయ్యగారు.

ఉపన్యాసకులు: భారతీదేవిగారు, ఆచార్య రంగాగారు, మునిపల్లె రామారావుగారు, పి. సుందరంగారు. డి సీతారామయ్యగారు, పి హనుమయ్య. (నైజాం)

ది 11-6-39 మునగాల రైతు సత్యాగ్రహ దినోత్సవం

అధ్యక్షులు: కామ్రేడ్ మునిపల్లె రామారావుగారు

ఉపన్యాసకులు : పేట బాపయ్యగారు, పి. సుందరంగారు.

రాత్రి శ్రీ సీతారామరాజు గ్రంథాలయ ప్రథమ వార్షికోత్సవము

అధ్యక్షులు : కామ్రేడ్ పేట బాపయ్యగారు,

ఉపన్యాసకులు : యన్. శ్రీరామశర్మ, బి. ఎ., గారు. మునిపల్లె రామారావుగారు

ది 12-6-39 విద్యార్థుల వీడ్కోలు సభ, సర్టిఫికెట్లు యిచ్చుట.

అధ్యక్షులు : కామ్రేడ్ సుంకర వీరభద్రరావుగారు, విద్యార్థుల, గ్రామస్థుల, వీడ్కోలు. ఉపన్యాసాలు.

గోష్ఠిసభలు.

ఇవి గాక అనేక రాజకీయ సమస్యలపై విద్యార్థులు గోష్ఠి సభలు గావించి, చర్చలు సాగించారు.

ది 30-5-39 "ఫెడరేషన్—ప్రతిఘటించాలి"

అధ్యక్షులు : పి. హనుమయ్య (నైజాం)గారు, (అ॥ భా॥ కి॥ వర్కింగు కమిటీ సభ్యులు)

అనుకూలవాదులు 10; ప్రతికూలవాదులు 4

తీర్మానం నెగ్గినది

ది 5-6-39 "రాబోయే ప్రపంచ సంగ్రామములో భారతదేశం పాల్గొనకూడదు".

అధ్యక్షులు : సుంకర వీరభద్రరావుగారు,

అనుకూలురు 8; ప్రతికూలురు 7 తీర్మానం నెగ్గినది.

ది 6-6-39 "సంస్థానాలను పూర్తిగా రద్దు చేస్తేనే భారత దేశానికి సంపూర్ణ స్వరాజ్యము అనుభవములోనికి వచ్చును."

అధ్యక్షులు : కామ్రేడ్ మురుకుట్ల వెంకటప్పయ్యగారు

అనుకూలవాదులు 12; ప్రతికూలవాదులు 4

తీర్మానం బహుసంఖ్యాకులచే నెగ్గినది.

ది 7-6-39 "స్వరాజ్య పోరాటం బలపడవలెనంటే, రైతు-కార్మికులకు రక్షణ కలుగవలెనంటే సంస్థానాల యిలాకా జాగీర్‌దారీ విధానం, బ్రిటిష్ యిలాకా జమీందారీ విధానం సత్వరంగా రద్దు కావలెను"

అధ్యక్షులు మునిపల్లె రామారావుగారు

అనుకూలవాదులు 12; ప్రతికూలవాదులు 4

తీర్మానం అధిక సంఖ్యాకులచే నెగ్గినది

ది 8-6-39 "బీదవాండ్లెవరిమీద శిస్తువేయకుండా ధనవంతులమీదనే శిస్తువేస్తే బాధ్యతలేకుండా బీదలు ప్రవర్తించుకొని కార్మిక-కర్షకులకు చెందుచున్న ప్రభుత్వమును దివాలా తీయిస్తారు గనుక యిప్పటి శిస్తు విధానాన్ని యిక ముందుకూడా సాగించి ధనికులు, బీదల మీదకూడా శిస్తులు వేసి ప్రజోపయోగ కార్యములు సాగించుట మంచిది"

అధ్యక్షులు : కామ్రేడ్ కొసరాజు అమ్మయ్యగారు

అనుకూలవాదులు 4; ప్రతికూలవాదులు 12

తీర్మానం అధికసంఖ్యాకులతో ఓడినది.

ది 9-6-39 "కార్మిక-కర్షక రాజ్యం త్వరితంగా స్థాపితం కావలెనంటే యీ నాడు మన దేశంలో పెరుగుచున్న పెట్టుబడి విధానాన్ని అందువల్లనే కలుగుచున్న ధనబడు పరిశ్రమాభివృద్ధిని అపుదల చేయుటమంచిది.

అధ్యక్షులు : పి. హనుమయ్యగారు.

అనుకూలవాదులు 9; ప్రతికూలవాదులు 9

తీర్మానం ఓడిపోయినది.

సుంకర వీరభద్రరావు,
అర్గనైజింగు కార్యదర్శి

పల్లెకోన

రేపల్లె—తెనాలి డివిజన్
వేసంగి రాజకీయ పాఠశాల,

జమ, ఖర్చుల వివరాలు.

జమ: వసూళ్లు

వెల్లటూరు	11-0-0
చినపాలెం, పెదపాలెం	17-0-0
ఎల్లపల్లి	17-0-0
చిలుపూరు	21-8-0
తూర్పుపాలెం	10-0-0
రావి అనంతవరం	30-0-0
పెదపులివర్రు	7-0-0
గోవాడ	6-0-0
చేబ్రోలు	3-0-0
భట్టిప్రోలు	12-0-0
వెలువోలు సీతారామయ్యగారు	4-0-0
విద్యార్థుల నుంచి	35-0-0
తాలూకా (తెనాలి) కాంగ్రెసు కమిటీ	15-0-0
ఇతరత్ర	10-0-0
	రు 198-8-0

ఖర్చు వివరాలు

జెండాలు, బానర్స్	18- 6-6
ప్రింటింగు చార్జీలు	9- 0-0
తపాలా ఖర్చులు	3- 4-0
వార్తాపత్రికలు	3-12-0
కూలీలు	12- 8-0
బళ్ళబాడిగ	7 -8-0
లైట్లు అద్దె, కిరసనాయిలు	9- 6-0
ఫొటోగ్రాఫరునకు	4-12-0
ప్రయాణపు ఖర్చులు	24- 6-0
టీచర్స్‌కు	12- 1-6
వంటసరుకులు	139- 5-3
కట్టెలు, పాలు, పెరుగు	12- 5-0
వంటవాళ్ళకు	12- 0-0
బహిరంగ సభలకు,	
టమ్‌టమాలకు	3- 2-0
ఇతర ఖర్చులు	9-11-6
	రు 281-8-3

వాగ్దానములుచేసి చందాలు ఇవ్వనివారి వద్ద నుంచి, వసూలు చేయుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. జమ, ఖర్చులు సరిపోవాలంటే ఇ-కా 83-0-3 వసూలు కావలెను.

నవశక్తి మీ కోర్కెలు మీ కష్టాలు ప్రతిబింబింపజేసి మీ కోసం పోరాడుతుంది	# నవశక్తి	నవశక్తి జాతీయ, అంతర్జాతీయ సమస్యల్ని విశదీకరించి విశ్వశాంతిని ప్రబోధించుతుంది

ముఖ్య గమనింపు

మా అనుభూత మందులను, యితరములను ఆయా జిల్లాలలో మా యేజంట్లకు సప్లయి చేయుటకును, క్రొత్త యేజంట్లను యేర్పాటు చేయుట, ప్రకటనాదులను సరిగ చేయుట మొదలగు వానికిని, సమర్థులగు వారు కావలసి యున్నారు. అర్హతనుబట్టి జీతము వగయిరాలు యివ్వబడును. వారికి గల అనుభవముతో కూడ మాకు వెంటనే వ్రాసికొన వలయును.

ఇట్లు,

డాక్టర్. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి,

బెజవాడ.

Published by M. Chandrasekhara Rao
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE